Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 03.01.2014, శుక్రవారం సంపుటి : 33 సంచిక : 31 పేజీలు : 16, వెల : ₹ 4




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com

## నెల్లూరులో ధనదాహంతో వర్ధిల్లుతున్న...

# నగర / నరక పాలక సంస్థ



• వీరికి కోర్టులంటే లెఖ్ఖే లేదు • కలెక్టర్లంటే భయమే లేదు • కోకొల్లలుగా అక్రమాలు, కోట్ల కొద్దీ దోపిడీలు

## అంతా అవినీతే...

- హైకోర్టు 2013జూన్‌లో ఆదేశాలిచ్చినా రోడ్డు ఆక్రమించి అడ్డంగా కట్టిన "అనిల్‌గార్డెన్స్"ను ఇంతవరకూ తొలగించలేదు.
- అనుమతి లేకుండా కడుతున్నారంటూ దేనికీ అడ్డం లేకుండా తమ సొంత స్థలంలో కట్టుకుంటుండిన నెల్లూరుక్లబ్ భవనాన్ని అడ్డంగా కూలదోసారు.
- అపార్ట్‌మెంట్లకు ప్లాన్ వేయించుకుని లాడ్జీలు, స్కూళ్లు నడుపుతున్నా కళ్లు మూసుకున్నారు.
- టౌన్‌ప్లానింగ్ అధికారుల నుండీ కమీషనర్ వరకూ అందరూ దొంగలే!
- అడిగినంత ఇస్తేనే నిర్మాణానికి అనుమతిస్తున్నారు.
- డిటిపి అనుమతి లేకుండా వందలకొద్దీ లే అవుట్లు వేలకొద్దీ ప్లాట్లు తయారవుతున్నా వాటి యాజమాన్యాన్ని బ్లాక్ మెయిల్ చేసి డబ్బు గుంజుతున్నారు.
- సమాచార హక్కు చట్టం ఆసరాగా సమాచారం అడిగితే కుంటిసాకులు చెప్తూ నెలల తరబడి తిప్పుకుంటున్నారు.
- బాసు అండతో కొంత, కండకావరంతో మరికొంత దొరికిన వరకూ దోచుకుంటున్నారు.
- ప్రత్యేక అధికారిగా అడిషనల్ జాయింట్ కలెక్టర్, పర్యవేక్షణాధికారిగా జిల్లా కలెక్టర్ వున్నా వీరికి భయమేలేదు.
- నగరాన్ని నరక కూపంగా మార్చి పందికొక్కుల్లా తింటున్నారు.
- నెల్లూరు నుండి హైదరాబాదు దాకా పైఅధికారులంతా చోద్యం చూస్తున్నారు.
- సిబిఐ ద్వారా మొత్తం చిట్టా తీస్తే వందలకోట్ల అవినీతి బయటపడుతుంది.

పూర్తి కథనం 3వ పేజీలో...




## అందరూ ఆడుతున్నారు.. మరి విజేతలెవరో చూడాలి

రాష్ట్రవిభజన అంశం ఒక ఆటగా మారింది. ఈ ఆటలో ప్రతి పార్టీది కూడా ప్లేయర్ పాత్రే! ఎవరి గేమ్ వాళ్లు ఆడుతున్నారు. ఇప్పటివరకు జరిగిన గేమ్‌లో ఎవరు ప్రతిభ చూపించారు, ఇక ముందు జరగబోయే గేమ్‌లో ఎవరు టాలెంట్ చూపించబోతున్నారనేది ఆసక్తిగా మారింది.

విభజన బిల్లును తెరమీదకు తెచ్చి కాంగ్రెస్ అధిష్టానం ఓ పెద్ద గేమ్‌ప్లాన్‌కు రూపకల్పన చేసింది. వన్‌షాట్ టూ బోర్డ్స్ పాలసీతో అటు తెలంగాణలోనూ, ఇటు సీమాంధ్రలోనూ ఎంపీ సీట్లను హోల్‌సేల్‌గా కొల్లగొట్టే ప్లాన్ వేసింది. తెలంగాణ ఏర్పాటు ద్వారా అటు టీఆర్‌ఎస్‌కు వచ్చే సీట్లు తమ ఖాతాలోకే వస్తాయి, సీమాంధ్రలో జగన్‌కు ఎక్కువ సీట్లు వస్తాయి కాబట్టి ఎన్నికల తర్వాత ఎలాగూ తమకే మద్దతునిస్తాడని కాంగ్రెస్ అధిష్టానం తెగ ఆలోచనచేసి టి-బిల్లును తెగతొందరగా తయారు చేసింది. అయితే కాంగ్రెస్ అధిష్టానం గోల్ వైపు బంతిని తంతుంటే ప్రత్యర్థి జట్టు కీపర్‌కంటే కూడా సొంత పార్టీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డే ఆ బంతిని గోల్‌లో పడకుండా అడ్డుకుంటుండడం కాంగ్రెస్ అధిష్టానానికి ఏ మాత్రం మింగుడుపడని (మిగతా 11వ పేజీలో)

# కెప్టెన్ ఇన్నింగ్స్ మొదలైందా?

రాష్ట్ర విభజన బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తూ, కాంగ్రెస్ అధిష్టానాన్నే ఢీకొంటున్న ముఖ్యమంత్రి ఎన్.కిరణ్‌కుమార్ రెడ్డి ఆ దిశగా కార్యరంగంలోకి దిగాడా? కాంగ్రెస్ అధిష్టానం ఆడిస్తున్నట్లే తాను ఆడుతున్నానన్న ఆరోపణలకు తెరదించనున్నాడా? నిన్నటి మంత్రివర్గ మార్పు ఈ ప్రశ్నలకు సమాధానమవుతుంది. విభజన బిల్లుపై చర్చకు శాసనసభ సమాయత్తమవుతున్న తరుణంలో శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి పదవి నుండి దుద్దిళ్ల

## • శ్రీధర్‌బాబుకు చెక్ • శైలజానాథ్‌కు లక్

శ్రీధర్‌బాబును తొలగించి ఆ పదవిని సమైక్యాంధ్ర ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న శైలజానాథ్‌కు అప్పగించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. దీని ద్వారా తెలంగాణ బిల్లును అడ్డుకుంటానని తాను చెప్పిన మాటలను ఆచరణలో చూపించడానికి కిరణ్ సిద్ధమవుతున్నాడని తెలుస్తుంది.

రాష్ట్రపతి నుండి తెలంగాణ బిల్లు రాష్ట్రానికి వచ్చింది. (మిగతా 11వ పేజీలో)

## కాంగ్రెస్ నుండి వలస...

# మారుతున్న 'దేశం' వరస

(వివరాలు 2వ పేజీలో)

సంక్రాంతి అతిపెద్ద సేల్

UPTO 50% OFF

శారీస్, సల్వార్స్, గాగ్రాస్, డ్రస్ మెటీరియల్స్, లేడీస్ వెస్ట్రన్‌వేర్, మెన్స్‌వేర్ & టెక్స్‌టైల్స్ పై

కళానికేతన్®
షాపింగ్ మాల్

ట్రంక్ రోడ్, గాంధీనగర్, నెల్లూరు. ఫోన్ 2316677

*Conditions Apply.



ఆశలన్నీ...

# ఆనం పైనే..!

**ఒంట్లో శక్తి ఉండి నడుస్తున్న తల్లిదండ్రులను సాకడం కాదు, ఒంట్లో శక్తి కోల్పోయి, రోగంతో మంచానపడిన తల్లి దండ్రులను విడిచి పెట్టకుండా సాకడమే గొప్పతనం. ఇప్పుడు రాజకీయాలలో ఆనం సోదరులు అదే చేయబోతున్నారు.**

ఈ రాష్ట్రంలో, ఈ జిల్లాలో కాంగ్రెస్‌పార్టీ బలంగా ఉన్నప్పుడు నాయకులతో ఆ పార్టీ సందడిగా కనిపించింది. ఆ పార్టీ టిక్కెట్ల కోసం నాయకులు తన్నుకు చచ్చేవాళ్లు. కాంగ్రెస్ అనే సంస్థను నమ్ముకుని ఎంతోమంది నాయకులు పదవులు అనుభవించారు. ఆ పదవుల ద్వారా కోట్లు సంపాదించారు. రాష్ట్రంలో ఇప్పుడు కాంగ్రెస్‌పార్టీ మంచం పట్టిన రోగిలా మారింది. ఇక ఈ రోగితో ఉంటే చాకిరి, డబ్బుఖర్చు తప్ప ఇంకేం లాభం ఉండదనుకున్న నాయకులు ఇతర పార్టీల వైపుకు పరుగులు తీస్తున్నారు. జిల్లాలో వున్న నాయకులంతా కాంగ్రెస్‌ను వదిలి పోయినా ఆనం సోదరులు మాత్రం కాంగ్రెస్‌ను వీడిపోయే పరిస్థితి లేదు. మునిగినా తేలినా కాంగ్రెస్‌తో కలిసి సాగడానికే సిద్ధపడుతున్నారు. రేపటి ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున పోటీ చేయడానికే అభ్యర్థులు కరువవుతున్నారు. జిల్లాలో గ్యారంటీగా గెలుస్తుందని చెప్పగల సీటు ఒక్కటీ లేదు. అయినా ఆనం సోదరులు తమ కుటుంబం నుండే ఎన్నికల బరువు బాధ్య తలను మోసేందుకు సిద్ధపడుతున్నట్లు తెలుస్తుంది. ఆనం వివేకానందరెడ్డి, ఆనం రామనారాయణ రెడ్డిలతో పాటు రేపటి ఎన్నికల్లో ఆనం విజయకుమార్‌రెడ్డి, ఆనం చెంచుసుబ్బారెడ్డిలను రంగంలోకి దించనున్నట్లు సమాచారం. ఆనం రామనారాయణరెడ్డి మళ్ళీ ఆత్మకూరు నుండే పోటీచేసే అవకాశాలున్నాయి. ఆనం వివేకానందరెడ్డి ఈసారి నెల్లూరు లోక్‌సభ నుండి పోటీచేసే దిశగా ఆలోచిస్తున్నట్లు తెలుస్తుంది. నెల్లూరురూరల్‌లో మంచి సంబంధాలున్న ఆనం విజయకుమార్‌రెడ్డిని రూరల్ అభ్యర్థిగా, వివేకా పెద్ద కొడుకు ఏ.సి.సుబ్బారెడ్డిని నెల్లూరు నగర అభ్యర్థిగా బరిలోకి దించే అవకాశాలున్నాయి. ప్రస్తుత నగర ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి కాంగ్రెస్‌లోనే ఉంటే ఆయననే నగర కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటించాలనుకున్నారు. కాని ఆయన తెలుగుదేశంలోకి పోతుండడంతో నగరం నుండి అభ్యర్థిని నిలబెట్టాల్సిన బాధ్యత వీరిపైనే పడనుంది. దీంతో ఆనం కుటుంబం నుండే అభ్యర్థి దిగొచ్చు. మొత్తానికి ఈసారి జిల్లా కాంగ్రెస్ భారమంతా కూడా ఆనం కుటుంబం మోయాల్సిందే!

కాంగ్రెస్ వలసలతో...

# పుంజుకుంటున్న 'దేశం'



**ఒక పార్టీ చావు ఇంకో పార్టీకి పెళ్ళికళగా మారుతోంది. ఒకరు చనిపోతూ తన అవయవాలతో ఇంకొకరికి ప్రాణదానం చేయడం చూస్తుంటాం. రాజకీయాల్లో కూడా ఇలాంటి ప్రాణ దానం స్కీంలు ఉంటాయనేది ఇప్పుడు జరుగుతున్న పరిణా మాలను బట్టి చూస్తుంటే తెలుస్తుంది.**

సీమాంధ్రలో కాంగ్రెస్‌పార్టీ చావుకు చేరువలో ఉంది. చావు అనడం కంటే కూడా ఆత్మహత్య అంటే సబబేమో. కాంగ్రెస్ చావు, తెలుగు దేశంపార్టీకి వరంలా మారింది. మొన్నటివరకు రాష్ట్రంలో తెలుగుదేశంపార్టీ పరిస్థితి కాలేయం పూర్తిగా చెడిపోయి రేపోమాపో అన్నట్లుగా ఐసియులో వున్న పేషంట్‌లా ఉండింది. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ తనకు తాను ఆత్మహత్యకు పాల్పడి తన కాలేయాన్ని తెలుగుదేశంకు దానం చేసినట్లుగా మారింది పరిస్థితి. సీమాంధ్రలోని 13జిల్లాల్లో కాంగ్రెస్ నుండి వలసలు మొదలయ్యాయి. వైకాపాలో ఇప్పటికే షట్టర్లు దించేయడంతో కాంగ్రెస్‌లోని వలసనేతలంతా కూడా తెలుగుదేశంవైపుకు క్యూ కడుతున్నారు. నెల్లూరుజిల్లానే తీసుకుంటే మొన్నటివరకు చాలా నియోజకవర్గాల్లో అభ్యర్థులకు కరువొచ్చి పడింది. పలు నియోజకవర్గాలకు సరైన నాయకులు లేక మండలస్థాయి, కౌన్సిలర్ల స్థాయి నాయకులనే అభ్యర్థులుగా పెట్టాల్సిన పరిస్థితి వుండింది. అయితే రాష్ట్ర విభజన పరిణామాలు తెలుగుదేశంకు ఆయాచిత వరంలా మారాయి. కాంగ్రెస్‌లో వుంటే చిల్లుపడిన పడవలో గోదారిని దాటడమేననుకున్న జిల్లా కాంగ్రెస్ నాయకులు తెలుగుదేశం వైపు కదులుతున్నారు. ఈ పరంపరలో ఎమ్మెల్యేలు ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, మాజీఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డిలు తెలుగుదేశంపార్టీలో చేరడానికి రంగం సిద్ధమైంది. వీళ్లంతా ఒకప్పుడు తెలుగుదేశంలో ఉన్నోళ్లే! ఒక్కొక్కరు ఒక్కో ప్రత్యేక పరిస్థితుల్లో ఆ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరాల్సివచ్చింది. ఈ ముగ్గురు పార్టీలోకి వస్తే మూడు నియోజకవర్గాలకు అభ్యర్థుల కొరత తీరినట్లే! అంతే కాదు, ఆయా నియోజకవర్గాలకు వీళ్లు గట్టి అభ్యర్థులు కూడా అవుతారు.

సర్వేపల్లి ఎమ్మెల్యే ఆదాల ప్రభాకర్‌రెడ్డి తెలుగుదేశంలో చేరితే నెల్లూరురూరల్ టిక్కెట్‌ను ఆశిస్తున్నట్లు తెలుస్తుంది. గత ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీ రూరల్ సీటును పొత్తులో భాగంగా సీపీఎంకు కేటాయించింది. ఈసారి ఆదాలను దించడానికి సిద్ధమవుతుంది. ఆదాల చేరికతో రూరల్ నియోజకవర్గంలో ఆ పార్టీని వెంటాడుతున్న నాయకత్వ సమస్య తీరుతుంది. ఆదాల అభ్యర్థి అయితే రూరల్‌లో ఖచ్చితంగా ముక్కోణపు పోటీ ఉంటుంది.

నెల్లూరు నగర ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి తిరిగి తెలుగుదేశంలో చేరనున్నారు. ఇప్పటికే చంద్రబాబుతో ఆయన మాట్లాడడం, నగరం సీటును ఆయనకే ఖరారు చేయడం జరిగింది. గత ఎన్నికలప్పుడే శ్రీధరకృష్ణారెడ్డి తెలుగుదేశం నుండి ప్రజారాజ్యంలో చేరారు. నగరం సీటును తెచ్చుకున్నాడు. కాంగ్రెస్‌పై 90ఓట్ల తేడాతో గెలిచాడు. ప్రజారాజ్యంను కాంగ్రెస్‌లో విలీనం చేయడంతో ఆయన కాంగ్రెస్ ఎమ్మెల్యేగానే కొనసాగుతున్నాడు. ఈ 5ఏళ్ల కాలంలో ఆనంతో సన్నిహిత సంబంధాలు నడిపాడు. ఆనం సోదరుల సహకారంతో నగరాభివృద్ధికి దండిగానే నిధులు తెప్పించాడు. అందరితో సత్సంబంధాలు ఏర్పరచుకున్నాడు. వివాదరహితుడిగా పేరుతెచ్చుకున్నాడు. ఎంత మంచి పేరు తెచ్చుకున్నా ఈసారి కాంగ్రెస్ టిక్కెట్ మీద పోటీచేస్తే ఓడిపోవడం ఖాయం. (మిగతా11వ పేజీలో)




# న(గర/రక) పాలక సంస్థ

**నెల్లూరు నగరపాలకసంస్థ పూర్తిగా దారి తప్పింది. ఇదొక కలెక్షన్ సెంటర్‌గా మారింది. కాసులుంటే తప్ప ఇక్కడ పనులు కావు. లంచాలిస్తే ఎలాంటి అక్రమాలనైనా రైట్ రైట్ అంటారు. తమకు లాభం లేదనుకుంటే ప్రభుత్వ శాఖల నిర్మాణాలనైనా కూల్చేస్తారు. నగరంలో పారిశుద్ధ్యానికి పాతరేసారు. దోమల జాతరకు తెరతీసారు. జనాలను రోగాలబారిన వదిలేసారు. నగరపాలక సిబ్బంది మాత్రం అవినీతి, అక్రమాలతో సహజీవనం సాగిస్తూ దోపిడీ స్వామ్యాన్ని యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు.**

రాజకీయ అండదండలుంటే అక్రమ నిర్మాణాలు సైతం ఇక్కడ సక్రమమే అవుతాయి. అదే రాజకీయ శక్తులకు కోపం వస్తే ఎలాంటి నిర్మాణాలైనా బద్ధలు బద్ధలవుతాయి. అనుమతి లేకుండా కడుతున్నారంటూ నెల్లూరుక్లబ్ ప్రాంగణంలో కడుతున్న భవనాన్ని కూలగొట్టారు. ఈ భవనం కమర్షియల్ అవసరాలకోసం కాదు, క్లబ్ అవసరాల కోసమే. అయినా అక్రమమని కూలదోసారు.

సరే దీనిని సమర్థిద్దాం, మరి ఇదే న్యాయాన్ని, ఇదే ధర్మాన్ని ఎటువంటి అనుమతి లేకుండా మాస్టర్‌ప్లాన్ రోడ్డును కూడా కలిపేసి కట్టిన 'అనిల్‌గార్డెన్స్' విషయంలో చూపడం లేదెందుకు? ఇది అక్రమ కట్టడమని తెలిసినా కాసులతో నగరపాలక సిబ్బంది కళ్లు మూయించారు కాబట్టి వీళ్లకు కనపడలేదు. కాని సాక్షాత్తూ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానమే 2013జూన్‌లో అక్రమంగా కట్టిన అనిల్ గార్డెన్స్‌ను తొలగించాలని చెప్పినా ఇంతవరకు నగరపాలక సంస్థలో ఉలుకుపలుకు లేదంటే ఏమనుకోవాలి. కోర్టులంటే అంత లెక్కలేనితనమా? కలెక్టర్లంటే అలుసా?

> **అయినవారికి ఆకుల్లో, కానివారికి కంచాల్లో... ఇది మన కార్పొరేషన్ పాలసీ. కొందరు అపార్డ్‌మెంట్లకు, గోడౌన్లకు ప్లాన్ అనుమతి తీసుకుని వాటిల్లో హోటళ్లు, విద్యాసంస్థలు నడుపుతున్నా మన కార్పొరేషన్‌కు పట్టదు. వీళ్ల మామూళ్లు వీళ్లకు ముడుతుంటాయి కాబట్టి అలాంటి అక్రమాల జోలికి మనవాళ్లు వెళ్లరు.**

అయినవారికి ఆకుల్లో, కానివారికి కంచాల్లో... ఇది మన కార్పొరేషన్ పాలసీ. కొందరు అపార్డ్‌మెంట్లకు, గోడౌన్లకు ప్లాన్ అనుమతి తీసుకుని వాటిల్లో హోటళ్లు, విద్యాసంస్థలు నడుపుతున్నా మన కార్పొరేషన్‌కు పట్టదు. వీళ్ల మామూళ్లు వీళ్లకు ముడుతుంటాయి కాబట్టి అలాంటి అక్రమాల జోలికి మనవాళ్లు వెళ్లరు. నగరంలో ఎక్కడ నిర్మాణం జరుగుతున్నా క్రిందిస్థాయి సిబ్బంది నుండి పైస్థాయి అధికారి వరకు ఎవరి మామూళ్లు వారికి అందాల్సిందే. అలా అందించకుంటే నిర్మాణదారులు తమ చావు తాము చావాల్సిందే!

ఒక సామాన్యుడు ఇల్లు కట్టాలంటే కార్పొరేషన్ కార్యాలయం చుట్టూ ప్లాన్ అప్రూవల్ కోసం చెప్పులరిగేలా తిరగాల్సి వస్తుంది. మామూళ్లు ఇచ్చుకున్నా పనులు తొందరగా కావడం లేదనే ఆవేదన నగర ప్రజలలో వ్యక్తమవుతుంది. నగరంలోనూ, చుట్టుపక్కల డిటిపి అప్రూవల్‌లేని లే అవుట్లు నగరపాలక సిబ్బందికి వరంలా మారుతున్నాయి. లే అవుట్లను తొలగిస్తామని బెదిరించి రియల్టర్ల నుండి డబ్బులు దండుకుంటూ అక్రమ లేఅవుట్లను చూసీ చూడనట్లు వదిలేస్తున్నారు.




కోర్టు ఆదేశాలను సైతం ధిక్కరిస్తూ అధికారుల అవినీతి దర్పానికి సాక్షీభూతంగా దర్శనమిస్తున్న అనిల్‌గార్డెన్స్

నగరంలో మున్సిపల్ కార్పొరేషన్ పనితీరు మొక్కుబడిగా మారింది. సిబ్బంది కూడా మామూళ్లు వచ్చే పనులు తప్పితే ప్రజలకు పనికొచ్చే పనుల జోలికి పోవడం లేదు. నగరపాలకసంస్థలో చాలా కాలంగా తిష్టవేసుకున్న వాళ్లు చక్రం తిప్పుతున్నారు. కొందరు రాజకీయ అండ చూసుకుని నగరం మీదపడి దోచుకుంటున్నారు. జిల్లా అదనపు కలెక్టర్ నగర పాలకసంస్థకు ప్రత్యేక అధికారిగా ఉన్నా, జిల్లా కలెక్టర్ పర్యవేక్షణాధికారిగా ఉన్నా నగరపాలక సంస్థకు పట్టిన అవినీతి జబ్బును వదిలించలేకపోతున్నారు. ఇరుకు సందులు, మురికి పందులు, ముదురుదోమలు, ముదనష్టపు చెత్తకుప్పలతో నగరం ఎంత కంపు కొడుతుందో నగర పాలకసంస్థ అంతకంటే ఎక్కువ కంపుకొడుతుంది.

కార్పొరేషన్‌లో జరుగుతున్న నిరంకుశ అవినీతి భాగోతాలను బట్టబయలు చేయాలనే ఉద్దేశ్యంతో సమాచార హక్కు చట్టం క్రింద బిల్డింగ్ ప్లాన్లు, వాటికి అనుమతిచ్చిన తీరు అడ్డదిడ్డంగా వాళ్లు నిర్మించిన భవనానికి ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ ఇచ్చిన పద్ధతి మరియు నియమానికి విరుద్ధంగా కట్టిన అపార్టమెంట్లలో మార్ట్‌గేజ్ రిలీజ్ చేసిన విధానాన్ని ప్రశ్నిస్తూ అప్లై చేస్తే ఒక్కదానికీ సమాధానం ఇవ్వరు. ఏదో ఒక కుంటి సాకుతో నెలలు తరబడి కార్పొరేషన్ చుట్టూ తిప్పుకోవడం కాగితాలు, కనబడడం లేదు, సర్వే నెంబర్లో తప్పుంది. మీరు చెప్పిన ప్లాన్ నెంబర్ ఇది కాదు... అంటూ సమాధానాలు చెబుతూ అతి దుర్మార్గంగా వాస్తవాలను పాతిపెడుతున్నారు. నిజాలను బయటకు రానీయకుండా దొంగల్లా దాచిపెడుతున్నారు. ఇది ఎంత వరకు సమంజసం.

నగర శాసనసభ్యుడుకంటే రూరల్ శాసనసభ్యుడికి ఆధిపత్యం, అజమాయిషీ నగర కార్పొరేషన్‌పై ఎక్కువగా వుండడం, తనవారికి మేలు పగవారికి కీడు సామెతగా ఆయన ప్రవర్తించిన తీరు అధికారులకు అలుసుగా మారి నాయకుడు పది శాతం మందికి సిఫారసు చేస్తే వాళ్ళతో పాటు అధికారులు మరో డెబ్బై శాతం మందికి మేలు చేస్తూ తమ జేబులు నింపుకునే "ఆన"వాయితీకి అలవాటు పడ్డారు. మిగిలిన ఇరవై శాతం ప్లాన్ల కోసం, అనుమతుల కోసం మున్సిపల్ కార్యాలయం చుట్టూ చెప్పులరిగేలా తిరిగి నెలలో కావాల్సిన పనిని మూడ్నెలల్లోనో, ఆరు నెలల్లోనో చేసుకుంటున్నారు.

నెల్లూరు తొలిమహిళా మేయర్ ఆనం వారిని ఎదిరించడంతో ఆమెను దించి తమ మనిషిని మేయర్‌ను చేసుకుని మున్సిపాల్టీలో ఆమె చెప్పిందే వేదం, ఆమె చేసిందే వాదం అనే నినాదంతో పనులు జరిపించడంతో అటు అధికారుల్లోనూ, ఇటు ఇతర రాజకీయ నేతల్లోనూ అధిక శాతం అసంతృప్తి చోటుచేసుకుంది. అనేక విషయాల్లో మాజీమేయర్ చౌరవ పలువురికి కష్టం, నష్టం కలిగించినా, ఆమె మాటను కాదనే స్థితి లేదు. షాజహాన్ ముంతాజ్‌కు తాజ్‌మహల్ ఇచ్చినట్లుగా మా నాయకుడు ఈమెకు నెల్లూరు నగరాన్ని ఇచ్చేసాడా? అని అటు ప్రజలు, ఇటు నాయకులు అనుకోవడం ఇప్పటికీ వినపడుతుంది. కారణం ఏదైనా, వాస్తవాలు ఏవైనా నగర మున్సిపల్ కార్పొరేషన్ మాత్రం అ"భాసు"పాలైంది. అవినీతికి నిలయమైంది. సిబిఐ ద్వారా ఒకసారి దర్యాప్తు చేయిస్తే కోట్ల కొద్దీ అవినీతి బయటపడడం అటుంచితే, నేతల చేతలతో వాతలు పెట్టించుకున్న అధికారుల తలరాతలు సైతం మారి జైళ్లకు వెళ్లే పరిస్థితి ఏర్పడుతుంది.

> **అనేక విషయాల్లో మాజీమేయర్ చౌరవ పలువురికి కష్టం, నష్టం కలిగించినా, ఆమె మాటను కాదనే స్థితి లేదు. షాజహాన్ ముంతాజ్‌కు తాజ్‌మహల్ ఇచ్చినట్లుగా మా నాయకుడు ఈమెకు నెల్లూరు నగరాన్ని ఇచ్చేసాడా? అని అటు ప్రజలు, ఇటు నాయకులు అనుకునే పరిస్థితి ఏర్పడింది.**

## సంగీతప్రియులను అలరించిన 'వాణి'జయరాం

### 'సుమధుర స్వరకోకిల' బిరుదుతో కళాంజలి అవార్డు ప్రదానం



వాణిజయరాంకు కళాంజలి అవార్డుతో సత్కారం

ప్రముఖ సినీనేపథ్యగాయని వాణీజయరాంకు కళాంజలి, సాంస్కృతిక సంస్థ "సుమధుర స్వర కోకిల" బిరుదుతో కళాంజలి-2013 అవార్డును డిసెంబర్ 29ఆదివారం నెల్లూరు పురమందిరంలో ప్రదానం చేసారు. ఈ అవార్డును నెల్లూరుజిల్లా ఎస్పీ పివియస్ రామకృష్ణ దంపతులు, కావలి ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు, సినీరచయిత వెన్నెలకంటి చెన్నైప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో డైరెక్టర్ ప్రసాద్. 'లాయర్' వారపత్రిక అధినేత తుంగా శివప్రభాత్‌రెడ్డిలు అందించారు.

ఈ సందర్భంగా వాణీజయరాం మాట్లాడుతూ తాను 1970లో సినీరంగంలో ప్రవేశించానని, తెలుగు కీర్తనలు, సంగీత విలువలు అమ్మ వద్దనే నేర్చుకున్నానన్నారు. తెలుగు, తమిళ, కర్ణాటక, మలయాళ, బెంగాలీ తదితర భాషల్లో వేలకుపైగా పాటలు పాడి అశేష అభిమానులను సంపాదించుకునే అదృష్టం తనకు లభించిందన్నారు. 'పూజ' సినిమాలోని "ఎన్నెన్నో జన్మల బంధం నీదినాది", మరోచరిత్రలో "విధి చేయువింతలెన్నో", ఘర్షణలో "నిన్ను కోరి వర్ణం"లతో పాటు మరికొన్ని సినిమాల్లోని పాటల పల్లవులను ఆలపించి కరతాళ ధ్వనులు అందుకున్నారు.

ఈ కార్యక్రమంలో కావలి ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు, సినీరచయిత వెన్నెలకంటి ప్రసాద్ మాట్లాడారు. నెల్లూరీయుడు రోహిత్‌రెడ్డి హీరోగా నటించిన తొలిచిత్రం 'దిల్‌దివానా' 2014 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. హీరో రోహిత్‌రెడ్డిని సభకు పరిచయం చేశారు. అనంతరం బీద రమణయ్య స్మారక అవార్డును కవి మోపూరు పెంచల నరసింహానికి అందజేశారు. కళాంజలి జరుపుకోబోయే రజతోత్సవ సంబరం కోసం బీఎంఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ తరపున లక్ష రూపాయలు విరాళాన్ని బీద మస్తాన్‌రావు ప్రకటించారు. కార్యక్రమానికి ముందు సుగంధిని, సాయిచరణ్, పావని, మురళీధర్‌రావు, వెన్నెలకంటి కుమారుడు రాకేందుమౌళిలు సినీ సంగీత విభావరి నిర్వహించారు. వీరిని కళాంజలి సంస్థ సత్కరించింది. కార్యక్రమంలో ముక్కాల ద్వారకానాథ్, టి.నారాయణరెడ్డి, దేవరాల సుబ్రహ్మణ్యం, బివి నరసింహం, జిల్లా ఎస్పీ సతీమణి శ్రీమతి కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.




హీరో రోహిత్ ముఖచిత్రంతో తయారైన 'దిల్‌దివానా' సినిమా 2014 క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

## చెంగాళమ్మ ఆలయంలో వేమిరెడ్డి పూజలు




వేమిరెడ్డికి స్వాగతం పలుకుతున్న ఇఓ శ్రీనివాసులరెడ్డి

ప్రముఖ పారిశ్రామికవేత్త వైయస్సార్‌సిపి నాయకులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం నెల్లూరు జిల్లా సూళ్ళూరుపేటలోని చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్నారు. చెన్నై నుండి వస్తూ అమ్మవారికి విశేషపూజలు చేసారు. ఆలయ కార్యనిర్వహణాధికారి పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి వేమిరెడ్డికి స్వాగతం పలికి, ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థ ప్రసాదాలను అందజేసారు.




ఇటీవల చెన్నైలోని 'లీలాప్యాలెస్'లో జరిగిన అఖిలభారత అట్టపెట్టెల ఉత్పత్తిదారుల సదస్సులో తమిళనాడు గవర్నర్ కె.రోశయ్య చేతుల మీదుగా అవార్డునందుకుంటున్న ఆ సమాఖ్య అధ్యక్షులు కె.అనిల్‌కుమార్‌రెడ్డి, పక్కన కేంద్ర నౌకాయాన శాఖామంత్రి జి.కె.వాసన్




## వివేకానందుడి స్ఫూర్తి ఏది

ప్రపంచమంతా స్వామి వివేకానంద 150వ జయంతి ఉత్సవాలు జరుగుతున్నాయి. కాని వివేకానందుడి ఆశయాలను నేడు ఎంత మంది పాటిస్తున్నారు. యువత కోసం ఆయన పరితపించారు. ఈ దేశ భవిష్యత్ కోసం, హిందూ సంస్కృతి ఔన్నత్యం కోసం ఆయన తపించారు. యువతకు మార్గనిర్దేశం చేసారు. కాని నేటి యువత విలాసాలు, మత్తుపదార్థాలతో ఆయన బోధనలనే పెడచెవిన పెడుతోంది.

వాస్తు రామచంద్ర, నెల్లూరు.

## కాంగ్రెస్‌కు మరణ శాసనమే

ఈ రాష్ట్ర ప్రజల జీవితాలతో చెలగాట మాడుతున్న కాంగ్రెస్ పార్టీకి మరణశాసనం రాయాలి. ఈ దేశాన్ని నాశనం చేసింది కాంగ్రెస్ పార్టీయే. వారి నిర్వాకం వల్లే దేశంలో అవినీతి కుంభకోణాలు, అధికధరలు, మతకల్లోలాలు, ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ప్రజలను కులాలు, మతాల వారీగా విడదీసారు. ఇప్పుడు రాష్ట్రాల వారీగా విడదీస్తూ చిచ్చు పెట్టారు. కాంగ్రెస్‌కు బలంగా సమాధికట్టి ఇక లేవకుండా చేయాలి.

డి.శ్రీరామ్, నెల్లూరు.

## బీజేపీ ఆలోచించాలి

ఏకపక్షంగా ఉన్న తెలంగాణ బిల్లుకు మద్దతునిచ్చే విషయంలో బీజేపీ పునరాలోచన చేయాలి. సీమాంధ్ర ఈ దేశంలో ఒక భాగమే కాని పాకిస్థాన్‌లోనో, బంగ్లాదేశ్‌లోనో లేదని ఆ పార్టీ గుర్తించాలి. ఓట్ల కోసం, సీట్ల కోసం కాంగ్రెస్ ఆడుతున్న విభజన నాటకానికి బీజేపీ సరైన ముగింపునిచ్చి కాంగ్రెస్‌కు బుద్ధిచెప్పాలి.

జి.యస్.రావు, నెల్లూరు.

## పిచ్చి ముదురుతోంది

డిసెంబర్ 31వ తేదీ రాత్రి మన కుర్రకారు చేస్తున్న హంగామా అంతా ఇంతా కాదు. బైక్‌లు వేసుకుని వీధులవెంట పడుతున్నారు. వారి అతి వేగంతో తల్లిదండ్రులకు విషాదం మిగిలిస్తున్నారు. ఇకనైనా యువత ఇలాంటి పిచ్చి చేష్టలు మానుకుంటే మంచిది.

జె.యస్.కె. నెల్లూరు.

## 'ప్రభా'తం

# బలిపీఠంపై భద్రత



**మన దేశంతో పోలిస్తే ఇతర దేశాలలో రైలు ప్రమాదాలు చాలా తక్కువ. గంటకు 300కిలో మీటర్ల వేగంతో ప్రయాణించే బుల్లెట్‌రైళ్లు నడుపుతున్న చైనాలో అగ్ని ప్రమాదాలు అరుదు. ఈ దేశాలన్నీ ఆధునిక పరిజ్ఞానంతో రైళ్లను నడపడమే కాదు, అదే ఆధునిక పరిజ్ఞానాన్ని ప్రయాణీకుల భద్రతకు కూడా వినియోగిస్తున్నాయి.**

పవిత్ర భారతదేశంలో సగటు మనిషి ప్రాణానికి విలువలేకుండా పోతుంది. ఇక్కడ భద్రంగా బ్రతికడానికంటే కూడా చావడానికి అవకాశాలెక్కువ. సమాజంలో జరిగే హత్యల కంటే సర్కార్ చేసే హత్యలే ఎక్కువ. ఈ దేశంలో చావును చాలా సులభం చేసేసారు. చావడానికి ఎన్నో మార్గాలు కనిపెట్టారు. మనిషి బ్రతకడానికి ఎలాగూ అవకాశాలు కల్పించలేక పోయాం కాబట్టి చావడానికి ఎన్నో మార్గాలు ఏర్పరిచాం అన్నట్లుగా ఉంటోంది ఇక్కడి ప్రభుత్వాల వైఖరి.

మన దేశంలో చావుకు సవాలక్ష మార్గాలున్నాయి. సీమాంతర ఉగ్రవాదులు పెట్టిన బాంబులు పేలి చావొచ్చు... పంటలు చేతికి రాక, చేతికొచ్చిన పంటకు గిట్టుబాటు ధర లేక పొలానికని తెచ్చిన పురుగుమందులను తాగి రైతులు చనిపోవచ్చు... కామాంధకిరాతకుల చేతుల్లో పడి నిర్భయ లాంటి అమాయకపు ఆడపిల్లలు కడతేరిపోవచ్చు... వ్యాపారాలు చేసి అప్పులపాలై కొందరు ఆత్మహత్యలు చేసుకోవచ్చు... ప్రాంతీయవాదాలతో ఆత్మహత్యలకు పాల్పొడచ్చు... జీవితం మీద విరక్తిపుడితే వాహనంలో జాతీయ రహదారి మీదకొచ్చి రోడ్డు మీద ఉన్న ఏదో ఒక లారీని గుద్దేసి తాపీగా చనిపోవచ్చు. ఇక దేశంలో ప్రాణాంతక రోగాలతో చావాలనుకునే వారికి ఎటువంటి లోటు లేదు. దేశంలో వివిధ రకాలుగా చావు కేకలు వినిపిస్తూనే వున్నాయి.

ఇవి కాకుండా ప్రయాణంలోనే పరలోక ప్రయాణం అనే కొత్త స్కీంకు మన ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాయి. రైలు టిక్కెట్ కొంటే పరలోక ప్రయాణం ఉచితం అనేదే ఈ కొత్త స్కీం. రైలులో సుఖమయమైన ప్రయాణం అనే వాళ్లు గతంలో... ఇప్పుడు సుఖవంతమైన ప్రయాణం కాదు కదా, ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రైలెక్కాల్సిన పరిస్థితులు దాపురించాయి. విమాన ప్రయాణాలలో ఎలాగూ భద్రత ఉండదు. విమానం గాల్లోకి లేచాక ప్రయాణీకుల ప్రాణాలు గాల్లోనే ఉన్నట్లు లెఖ్ఖ. సాంకేతిక వైఫల్యాలైతేనేమీ, మానవతప్పిదాలు గాని విమాన ప్రమాదాలు జరిగేవి జరుగుతూనే వున్నాయి. ఇక బస్సు ప్రమాదాలకు అంతం లేదు. ఈమధ్యకాలంలో ఏ.సి బస్సులు సైతం తగలబడడం చూస్తూనేవున్నాం.

ప్రపంచంలోనే అతిపెద్ద రైల్వేవ్యవస్థల్లో భారతీయ రైల్వేవ్యవస్థ ఒకటి. దేశానికి ప్రధాన ఆదాయవనరు రైల్వేనే. ప్రతి ఏటా ప్రత్యేక రైల్వేబడ్జెట్‌ను ప్రవేశపెట్టడంతోనే దాని ప్రాధాన్యత ఏంటో తెలుస్తుంది. ఇంతటి ప్రాధాన్యత కలిగిన భారతీయ రైల్వే, ప్రయాణీకుల ప్రాణాల భద్రతకు భరోసా ఇవ్వలేకపోతుంది. సంఘటనలు జరిగినప్పుడు విచారణలు, నివేదికలంటూ హడావిడి చేయడం, ఆ తర్వాత మరచిపోవడం నిత్యకృత్యంగా మారుతోంది. 2013ఏడాది పోతూపోతూ ఓ చీకటి జ్ఞాపకాన్ని మిగిల్చిపోయింది. బెంగుళూరు నుండి నాందేడ్ వెళుతున్న ఎక్స్‌ప్రెస్ అనంతపురం జిల్లాలోని కొత్తచెరువు వద్ద అగ్ని ప్రమాదానికి గురికావడం, బి1 ఏ.సి బోగీ పూర్తిగా దగ్ధమై 26మంది ప్రయాణీకులు మాంసం ముద్దల్లా మారడం చూస్తుంటే మన రైళ్లు పరలోకానికి పరుగులు తీస్తున్నట్లుగా వున్నాయి. 2012జూలైలో నెల్లూరు వద్ద ఢిల్లీ నుండి చెన్నై వెళుతున్న తమిళనాడు ఎక్స్‌ప్రెస్‌లోని ఎస్-11 బోగీలో మంటలు చెలరేగి 32మంది సజీవదహనమైన దుర్ఘటనను జాతి ఇంకా మరచిపోకముందే నాందేడ్ ఎక్స్‌ప్రెస్ దుర్ఘటన మన రైల్వేలోని భద్రతా వైఫల్యాలను మరోసారి కళ్లకు కట్టింది. గతంలో జరిగిన స్వర్ణదేవాలయ మెయిల్, గౌతమి, హైదరాబాద్-షోలాపూర్ పాసింజర్, తమిళనాడు ఎక్స్‌ప్రెస్ దుర్ఘటనల నుండి మన రైల్వేశాఖ గుణపాఠాలేవీ నేర్చుకోలేదని నిన్నటి నాందేడ్ ఎక్స్‌ప్రెస్ ఘటనతో బుజువవుతుంది. రైల్వే నిర్లక్ష్యం ప్రయాణీకుల ప్రాణాలను గాల్లో దీపాలుగా మారుస్తుంది. రైల్వేకు ఆదాయం పెంచుకోవడంలో ఉన్న శ్రద్ధ, ఆ ఆదాయాన్ని అందిస్తున్న ప్రయాణీకులను సురక్షిత గమ్యానికి చేర్చడంలో లేకుండా పోయింది. రైళ్లు ఇలా ఎందుకు తగలబడిపోతున్నాయి, రైళ్లు తగలబడకుండా ఏమేం చర్యలు తీసుకోవాలనేదానిపై గతంలో నిపుణులు నివేదికలు సమర్పించి వున్నారు. దేశవ్యాప్తంగా విని యోగిస్తున్న రైళ్లలో 80శాతం అగ్ని ప్రమాదాల నుండి రక్షణ కల్పించలేని వేనంటూ నిపుణులు తేల్చిచెప్పారు. ముఖ్యంగా ఏ.సి బోగీలలో మంటలు వ్యాపించడానికి అవకాశాలెక్కువ. ఏ.సికి వాడే గ్యాస్‌కు వెంటనే మండే స్వభావం ఉంటుంది. ఇక ఎలక్ట్రికల్ లైనింగ్ లోపాలవల్ల షార్ట్‌సర్క్యూట్‌కు గురయ్యే అవ కాశాలెక్కువ. ఇక రైలెక్కుతున్న ప్రయాణీకుల లగేజీ తనిఖీలు ఉండవు. వాళ్లు పేలుడు పదార్థాలు, మండే స్వభావంగల పదార్థాలతో రైలెక్కినా నిలువరించే మార్గం లేదు. బోగీలు త్వరగా తగలబడిపోవడానికి ఇలాంటివి కూడా దోహదం చేస్తున్నాయి.

మన దేశంతో పోలిస్తే ఇతర దేశాలలో రైలు ప్రమాదాలు చాలా తక్కువ. గంటకు 300కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే బుల్లెట్‌రైళ్లు నడుపుతున్న చైనాలో అగ్ని ప్రమాదాలు అరుదు. ఈ దేశాలన్నీ కూడా ఆధునిక పరిజ్ఞానంతో రైళ్లను నడపడమే కాదు, అదే ఆధునిక పరిజ్ఞానాన్ని ప్రయాణీకుల భద్రతకు కూడా వినియోగిస్తున్నాయి. వేలకోట్లు టర్నోవర్ చేస్తున్న భారత రైల్వేకు మాత్రం రాబడి తప్ప ప్రయాణీకుల భద్రత పెద్దగా పట్టించుకోనవసరం లేని అంశమైపోయింది.

## 'అంతర్'జాతీయం

- దేశంలోని అన్ని విశ్వవిద్యాలయాలలో నోబెల్ విజేతల పేరిట పీఠాలు ఏర్పాటు చేయాలని కేంద్రప్రభుత్వం నిర్ణయించింది. నోబెల్ బహుమతులు గెలుచుకున్న రవీంద్రనాథ్‌ఠాగూర్, సి.వి.రామన్, హరగోవింద్‌ఖురానా, మథర్‌థెరిస్సా, సి.చంద్రశేఖర్, అమర్త్యసేన్, వి.రామకృష్ణన్‌ల పేరిట పీఠాలు ఏర్పాటు చేయనున్నారు.
- 2002 గోధ్రా అల్లర్ల కేసులో కోర్టు తనకు ఊరట కలిగించడంపై బీజేపీ ప్రధాని అభ్యర్థి నరేంద్రమోడీ తీవ్రంగా స్పందించారు. ఇన్నాళ్లకు తనకు విముక్తి లభించిందని, సత్యం గెలిచిందని ఆయన తొలిసారిగా ఈ సంఘటనపై తన భావాన్ని వ్యక్తీకరించారు. ఆనాటి సంఘటనపై తానెంతో చలించిపోయానని, అయినా ఇన్నాళ్ళు ఆ బాధను నాలోనేనే దిగమింగుకున్నానని చెప్పుకొచ్చారు.
- చైనా, పాకిస్థాన్ సరిహద్దుల వెంట గస్తీని మెరుగుపరిచేందుకు భారత ప్రభుత్వం ఇజ్రాయెల్ నుండి 15 మానవరహిత విమానాలను కొనుగోలు చేయాలని నిర్ణయించింది. వీటి విలువ 1200కోట్ల రూపాయలని తెలుస్తుంది.
- బీజేపీ నుండి విడిపోయి కెజెపిడి పెట్టిన కర్నాటక మాజీముఖ్యమంత్రి యస్.యడ్యూరప్ప సంక్రాంతి తర్వాత తిరిగి బీజేపీ గూటికి చేరనున్నట్లు ప్రకటించారు.
- చండీగఢ్ శివార్లలోని ముల్లాన్‌పూర్ పట్టణంలో 450కోట్లతో నిర్మించనున్న హోమీబాబా క్యాన్సర్ ఆసుపత్రి, పరిశోధనా కేంద్రానికి ప్రధాని మన్మోహన్‌సింగ్ సోమవారం శంకుస్థాపన చేసారు. దేశంలో ఏటా 11లక్షల మంది క్యాన్సర్ బారిన పడుతున్నారని, 9లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఈ సందర్భంగా ప్రధాని పేర్కొన్నారు. క్యాన్సర్ వంటి ప్రాణాంతకవ్యాధులకు ప్రపంచ స్థాయి చికిత్స అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి వుందని అన్నారు.
- చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ కమిటీ అధిపతిగా ఆర్మీజనరల్ బిక్రం సింగ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. భారత వైమానిక దళాధిపతి ఎన్ఏకె బ్రౌన్ 31వ తేదీ పదవీ విరమణ చేసారు. బిక్రం సింగ్ ఈ పదవిలో 7నెలల పాటు కొనసాగుతారు.
- దుబాయ్‌లో భారత దౌత్యాధికారిగా అనురాగ్ భూషణ్ నియమితులయ్యారు. ఢిల్లీలోని ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయాధిపతిగా పనిచేస్తున్న ఆయనను ప్రభుత్వం దుబాయ్ రాయబారిగా నియమించింది.
- వచ్చే లోక్‌సభ ఎన్నికలకు కాంగ్రెస్‌పార్టీ ప్రధాని అభ్యర్థిని ఇప్పుడే ప్రకటించాలని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి పి.చిదంబరం సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే ప్రధానిగా బాధ్యతలు చేపట్టే నాయకుడి గురించి ఇప్పటినుండే ప్రచారంలో పెట్టాలని ఆయన పేర్కొన్నారు.
- యుద్ధవిమానాలను సమర్థవంతంగా నడపగల సీనియర్ పైలట్ అరూప్‌రహా భారత వాయుసేనకు 24వ చీఫ్‌గా డిసెంబర్ 31వ తేదీ బాధ్యతలు స్వీకరించారు. మూడేళ్లపాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు.

## వార్త వ్యాఖ్య

వార్త :- సమాజాన్ని పాడుచేస్తున్న మీడియా. – కావూరి మండిపాటు.
వ్యాఖ్య :- *ఎంత చేసినా మీ రాజకీయనాయకులకంటే తక్కువేలే!*

వార్త :- ముఖ్యమంత్రి జైలుకు వెళ్లకతప్పదు. – శంకర్రావు.
వ్యాఖ్య :- *అలా అని అగ్రిమెంట్ ఏమన్నా ఉందా?*

వార్త :- కిరణ్, బాబు, జగన్ ఏకం కావాలి. – మంత్రి టి.జి.వెంకటేష్.
వ్యాఖ్య :- *ఒబామా, సద్దాం, లాడెన్‌లు కలిసి పనిచేయాలన్నట్లుంది.*

వార్త :- ఎన్నికల లోపు విభజనకు అవకాశం లేదు. – మంత్రి తోట నరసింహం.
వ్యాఖ్య :- *విభజన లేకుంటే ఎన్నికలకు కూడా అవకాశం లేనట్లుంది.*

వార్త :- చేతనైతే ఢిల్లీ పెద్దలకు చెప్పండి. – బొత్సకు మంత్రి గంటా సూచన.
వ్యాఖ్య :- *అక్కడ చెప్పే ధైర్యం లేకే కదా ఇక్కడ మాట్లాడేది.*

వార్త :- విభజనను అడ్డుకుంటేనే భాజపాతో పొత్తు. – కోడెల.
వ్యాఖ్య :- *విభజనకు మద్దతిస్తేనే పొత్తు అని వాళ్లంటున్నారే...*

వార్త :- విభజన బిల్లు ఏకపక్షంగా ఉంది. – రాష్ట్రపతికి సీమాంధ్ర బీజేపీ నేతల విజ్ఞప్తి.
వ్యాఖ్య :- *ఏకపక్షంగా ఉంటేనే కదా కాంగ్రెస్‌కు ఒక చోటయినా సీట్లొచ్చేది.*

వార్త :- పార్టీగా మనం వెనకబడి ఉన్నాం. – బీజేపీ నేత కిషన్‌రెడ్డి.
వ్యాఖ్య :- *విభజనతో ఇంకా వెనుకబడ్డారు.*

వార్త :- ప్రజాగర్జనకు ఆహ్వానం అందలేదు. – నందమూరి హరికృష్ణ.
వ్యాఖ్య :- *మీ అవసరం ఉందనుకుంటే పిలుస్తారులే!*

వార్త :- అవినీతి అంతు చూస్తా. – ఒంగోలు సభలో బాబు గర్జన.
వ్యాఖ్య :- *అవినీతి మీలాంటోళ్లని చాలామందిని చూసిందిలే!*

వార్త :- కాంగ్రెస్‌పార్టీని వీడడం ఖాయం. – జేసీ.
వ్యాఖ్య :- *అందుకేగా సోనియాగాంధీ నుండి అందర్నీ తిడుతున్నారు.*

వార్త :- 3న బొత్స ఆస్తుల ప్రకటన.
వ్యాఖ్య :- *బినామీలవి కూడానా?*

వార్త :- మనది చౌకబారు సాంకేతిక విద్య. – కేంద్రమంత్రి పళ్లంరాజు.
వ్యాఖ్య :- *చౌకబారు ప్రభుత్వాలు ఉంటే అంతేగా.*

వార్త :- పొత్తులపై చర్చించి నిర్ణయం. – సీపీఎం కార్యదర్శి బి.వి.రాఘవులు.
వ్యాఖ్య :- *ఎన్నికల్లో పోటీ చేయాలంటే ఎవరో ఒకరు తోడుండాల్సిందేనా?*


జన్మదిన శుభాకాంక్షలు
అనుకున్నది సాధించే తత్వం...
అందరినీ కలుపుకుపోయే వ్యక్తిత్వం
పదిమందికి మంచిని చేయాలనే
మానవత్వంతో పరిమళిస్తూ
తెలుగు, తమిళ, హిందీ, కన్నడ చిత్రాల
నిర్మాతగా, దర్శకుడిగా రాణిస్తూ
సమాజంలో మంచి సుమగంధపుమల్లిగా
వికసిస్తున్న తెలుగుతేజం...
తమిళనాడు తెలుగు యువశక్తి అధ్యక్షులు
శ్రీ కేతిరెడ్డి జగదీశ్వర్‌రెడ్డి గారికి
జన్మదిన శుభాకాంక్షలు.
- సిద్దారెడ్డి హరీష్ రెడ్డి (USA)

# గుట్టు రట్టయ్యింది


## నకిలీ పట్టాలతో పొట్టకొట్టారు

నెల్లూరు పొదలకూరు రోడ్డు లేక్‌వ్యూ కాలనీ 10వ వీధిలోని ఓ ఇంటిలో నకిలీ పత్రాలు సృష్టించి అధికారులను, ప్రజల్ని బోల్తా కొట్టించిన ఓ వ్యక్తి ఇంటిపై డిసెంబర్ 31వ తేదీ ఉదయం రెవెన్యూ అధికారులు పక్కా ప్లాన్‌తో దాడి చేసారు. ఆ ఇంట్లోని అణువణువూ గాలించారు. 450 నకిలీ పట్టాలు, పొజిషన్ సర్టిఫికెట్లు, రైతువారీ పట్టాలు, భూముల క్రయవిక్రయ పత్రాలు వివిధ ధృవీకరణ పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరు ఆర్టీఓ సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో, పకడ్బందీ వ్యూహంతో ఈ దాడి చేసారు. వివరాల్లోకి వెళితే నెల్లూరు నగరం పొదలకూరు రోడ్డు లేక్‌వ్యూకాలనీ 10వ వీధిలో నివాసం ఉంటున్న బద్దెపూడి శ్రీనివాసులు నకిలీ పత్రాలు సృష్టిస్తున్నట్లు అధికారులకు సమాచారం అందింది. దీంతో అప్రమత్తమైన నెల్లూరు ఆర్టీఓ, కోవూరు తహశీల్దార్ సాంబశివరావు, అల్లీపురం, పెనుబర్తి వీఆర్వోలు పెంచలరావు, జనార్థన్‌లు రహస్యంగా ఆ ప్రాంతానికి తీసుకెళ్ళారు.

నెల్లూరు తహశీల్దార్ నరశింహులు, వీఆర్వో చిన్నయ్య, ఒకటవ నగర సిఐ శ్రీనివాసరావుకు సమాచారం ఇచ్చి మూకుమ్మడిగా అధికారులు శ్రీనివాసులు ఇంట్లోకి ప్రవేశించి పలు నకిలీ పత్రాలు, స్టాంపులు స్వాధీనం చేసుకున్నారు. ఈ పత్రాల్లో ఓ యూత్ కాంగ్రెస్ నేతతో శ్రీనివాసులు క్రయవిక్రయాలు జరిపినట్లు తెలిపే పత్రాలు కూడా ఉన్నాయి. దాడుల సమయంలో సూత్రధారి శ్రీనివాసులు ఇంట్లో లేకపోగా కుటుంబసభ్యులు మాత్రం ఉన్నారు. శ్రీనివాసులు పై నెల్లూరు ఒకటవ నగర పోలీసుస్టేషన్లో కేసు నమోదైంది. ఇతనికి సహకరించిన వారి వివరాల కోసం ఆరా తీస్తున్నారు. అప్పటి తహశీల్దార్లు భాస్కర్‌నాయుడు, ధర్మయ్య, పెంచలకిషోర్, భక్తవత్సలరెడ్డి, ప్రస్తుత తహశీల్దార్ నరశింహులు సంతకాలతో ఉన్న పట్టాలను అధికారుల తనిఖీల్లో బయట పడడం సంచలనం సృష్టించింది.

### 1న ప్రారంభమైన...

## శ్రీ రంగనాథస్వామి అధ్యయనోత్సవాలు



నెల్లూరులో వెలసిన తల్పగిరి రంగనాథస్వామికి ధనుర్మాసంలో విశిష్టమైన ఉత్సవాలుగా జరిపే అధ్యయనోత్సవాలు ఈనెల 1న మొదలయ్యాయి. 20వతేదీ వరకు భక్తిప్రపత్తులతో నిర్వహిస్తారు. అంకురార్పణగా 1న పగల్‌పత్తు ఉత్సవంలో మూలవర్లకు, అమ్మ వారికి, ప్రసన్న వెంకటేశ్వస్వామికి పూలంగిసేవ, నవరత్నఖచిత స్వర్ణవైరముడిసేవలు వైభవంగా నిర్వహించారు. 2న వైకుంఠనాథ అవతారం, 3న కోదండరామ, 4న శ్రీ రాజమన్నార్ అవతారాలలో దర్శనమిచ్చిన శ్రీరంగనాథుడు, 5న శ్రీరామపట్టాభిషేకం, 6న పుష్పాలంకరాలు, 7న వేణుగోపాల స్వామి అవతారం, 8న గొల్లబోయిన, 9న కాళీయమర్దనుడిగా, 10న మోహినీ అవతారంలో విశేషపూజలు అందుకుంటాడు. ముక్కోటి పర్వదినాన వేకువజామున 4.30గంటలకు ఉభయనాంచారుల సమేత శ్రీరంగ నాథుడు వైకుంఠద్వారం గుండా వెలుపలకు వచ్చి భక్తులకు దర్శనమిస్తారు. తదుపరి ఉత్తరద్వారం గుండా భక్తులు ఆలయంలోని మూలవర్లను దర్శించుకొని తరిస్తారు. ఈ అధ్యయనోత్సవాల్లో శ్రీరంగనాథుడు ఉదయం నుంచి రాత్రి వరకు వైభవంగా ప్రత్యేక పూజలందుకుంటూ సాయంత్రం పురవిహారం చేస్తూ భక్తులను ఆనందింపజేస్తాడు.

- బీజేపీ మహాధర్నా

## చిత్తూరుకు కండ్లేరు.. నెల్లూరుకు కన్నీరా?

### --- కండ్లేరు హెడ్‌రెగ్యులేటర్ వద్ద నిరసన తెలిపిన నేతలు ---



అక్రమంగా చిత్తూరుజిల్లాకు కండ్లేరు జలాలను తర లిస్తూ ఈ రాష్ట్ర ప్రభుత్వం జిల్లా రైతాంగానికి కన్నీళ్ళు మిగిలిస్తుందని బీజేపీ నాయకులు ధ్వజమెత్తారు.

చిత్తూరు జిల్లాకు కండ్లేరు జలాల తరలింపుకు నిరసనగా సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో కండ్లేరు హెడ్ రెగ్యులేటర్ వద్ద మహాధర్నా జరిగింది. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కాకు విజయలక్ష్మి, అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు పి.సురేంద్రరెడ్డి, ఆ పార్టీ నాయకులు మిడతల రమేష్, రంగినేని కృష్ణయ్య, గాలి అంకబాబు, హనుమంతురావు, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. 1997జూలైలో కండ్లేరు నుండి చెన్నైకి నీటి తరలింపును కణతకు తుపాకీ గురిపెట్టి అడ్డుకున్న ఆనం రామనారాయణరెడ్డి, మరి నేడు చిత్తూరు జిల్లాకు నీళ్లు తరలిపోతుంటే అదే పని ఇప్పుడెందుకు చేయలేకపోతున్నాడని బీజేపీ నాయకులు ప్రశ్నించారు. ప్రతిపక్షంలో వున్నప్పుడేమో రైతులు కావాలి, అధికారపక్షంలో వున్నప్పుడు వాళ్ళ అవసరాలు పట్టవా అని వారు ప్రశ్నించారు.

ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి ఆనం రామనారాయణరెడ్డిలు కలిసికట్టుగా నెల్లూరుజిల్లా రైతాంగం కడుపుకొట్టారని విమర్శించారు.

## 7వ విడతలో నిరుపేదలకు భూమి మంజూరు

### రాష్ట్ర మంత్రి ఆనం



పాఠశాల గదులను ప్రారంభిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన నిరుపేదలందరికి 7వ విడతలో భూమిని మంజూరు చేస్తుందని రాష్ట్ర ఆర్థిక మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మర్రిపాడు మండలం పరిధిలోని ఇర్లపాడు, ఖాదర్‌పూర్, చిలక పాడు, ఏపిలిగుంట, బూదవాడ, పెగళ్లపాడు, కంపసముద్రం గ్రామాలలో మంత్రి పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమా లకు శంఖుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. మర్రిపాడు మండలం కేంద్రం వద్ద మైనారిటీలకు 51 గృహాలకాలనీకి శంఖుస్థాపన చేశారు. అనంతరం ఇర్లపాడు వద్ద 3.05 కోట్లతో నిర్మిస్తున్న రోడ్డుకు, ఖాదర్‌పూర్ వద్ద 10లక్షలతో నిర్మిస్తున్న సిమెంటు రోడ్డు, 12 లక్షలతో నిర్మిస్తున్న పంచాయితీ భవనం ప్రారంభం, ఏపిలిగుంట–మర్రిపాడు 2 కోట్లతో నిర్మిస్తున్న రహదారికి శంఖుస్థాపనలు, చిలకపాడు వద్ద 12 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయితీ భవనాన్ని, 10.60 లక్షలతో నిర్మించిన 2 అదనపు పాఠశాల గదులను ప్రారంభించారు. 2 కోట్లతో వై.యం.రోడ్డు నుండి ఖాదర్‌పూర్ వయా కంపసముద్రం వరకు 2 కోట్లతో నిర్మిస్తున్న తారురోడ్డుకు, ఏపిలిగుంట వద్ద 3.50 లక్షలతో సిమెంటు రోడ్డుకు శంఖుస్థాపనలు చేశారు.

ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద, బలహీన వర్గాల వారికి వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాలను కోట్లాది రూపాయలు వెచ్చించి అమలు చేయడం జరుగుతున్న దన్నారు. అందులో భాగంగా భూపంపిణీ కార్యక్రమం కింద యింత వరకు 6 విడతలుగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించడం జరిగిందని, యింకా మిగిలివున్న భూమిలేని అర్హులైన నిరుపేదలం దరికీ 7వ విడత కార్యక్రమంలో భూపంపిణీ చేయడం జరుగు తుందన్నారు. ప్రభుత్వ భూమిలేని పక్షంలో భూమి కొనుగోలు పథకం కింద భూమిని మంజూరు చేసి యివ్వడం జరుగుతుం దన్నారు. అలాగే సోమశిల వద్ద హైలెవల్ కెనాల్‌కు రాష్ట్ర ముఖ్యమంత్రి 783 కోట్ల వ్యయంతో శంఖుస్థాపన చేయడం జరిగిందని, మరలా సర్వేచేయగా దాదాపు తొలివిడతగా 1028 కోట్లు అంచనా వేసి, 4 రిజర్వాయర్లు పెగళ్లపాడు, పొంగూరు, ఇస్కపల్లి, కె.ఎన్.పల్లి వద్ద ఏర్పాటు చేసి తద్వారా సాగునీరం దించడం జరుగుతుందన్నారు. రెండవ విడతగా 3 రిజర్వాయర్లు చాబోలు, కంపసముద్రం, గుండెమడకల వద్ద ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

కార్యక్రమంలో యన్.డి.సి.సి.బ్యాంక్ ఛైర్మన్ ఎం.ధనుం జయరెడ్డి, అదనపుజాయింట్ కలెక్టర్ పెంచలరెడ్డి, ఆత్మకూరు ఆర్.డి.ఓ కోదండరామిరెడ్డి, డ్వామా పి.డి శ్రీమతి గౌతమి, కాంగ్రెస్ నాయకులు చేవూరి దేవకుమార్‌రెడ్డి, యం.పి.డి.ఓ, తహశీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

## విభజన చిచ్చుతో విద్వేషాలే!



ప్లీనరీ సమావేశంలో ప్రసంగిస్తున్న బి.వి.రాఘవులు

రాష్ట్రాలను విభజించుకుంటూ పోతే అది రాష్ట్రానికే కాదు, దేశ సమైక్యతకే గొడ్డలిపెట్టులా మారుతుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి బి.వి.రాఘవులు పేర్కొ న్నారు. మంగళవారం నెల్లూరులోని సీపీఎం కార్యాలయంలో జరిగిన ప్లీనరీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే విడిపోయిన రాష్ట్రాల మధ్య నీటి యుద్ధాలు జరుగుతూనే ఉన్నాయన్నారు. రాష్ట్ర విభజనలో నీటి వనరుల పంపకం కీలకమని, నీటి వనరుల విషయంలో ఖచ్చితంగా రాష్ట్రాల మధ్య గొడవలు వస్తాయన్నారు. మన దేశంలో నీటి వన రులు బాగానే వినియోగం లోకి వచ్చాయి. అయినా ఇంకా పూర్తిస్థాయి నీటి సద్విని యోగానికి చర్యలు తీసుకోవాల్సి వుందన్నారు. రాష్ట్ర విభజన మూలంగా తెలంగాణ స్వర్ణమయం కావడం, సీమాంధ్ర ఎడారి కావడం అంటూ ఏమీ వుండదు, కాకపోతే ఇరు ప్రాంతాలు కలిసిఉంటే సమన్వయంతో అభివృద్ధిని సాధించే అవకాశముంటుం దన్నారు. రాష్ట్రం కలిసి వుంటే బలమైన శక్తిగా ఉండి కేంద్రంపై ఒత్తిడి తెచ్చి నిధులు తెచ్చుకునే అవకాశ ముంటుంద న్నారు. చిన్నచిన్న రాష్ట్రాలు పెద్దపెద్ద పారిశ్రామికవేత్తల చేతుల్లోకి పోయి అక్కడి కార్మికులు, రైతులు, పేదలు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి వస్తుందన్నారు. పెద్ద రాష్ట్రాలలో వెనుకబడిన ప్రాంతాలకు ఎక్కువ నిధులు కేటాయించుకుని అభి వృద్ధి పరచుకునే అవకాశం ఎక్కువుగా ఉంటుందన్నారు. అసెంబ్లీలోనూ, పార్ల మెంటులోను సీపీఎం విభజన బిల్లును వ్యతిరేకిస్తుందన్నారు.

దేశంలో ప్రజలు కాంగ్రెస్, బీజేపీలతో విసిగిపోయారని, మూడో ప్రత్యామ్నాయాన్ని కోరుకుంటున్నారని, ఇందుకు ఢిల్లీ ఎన్ని కలనే ఉదాహరణగా పేర్కొన్నారు. రాష్ట్ర విభజన అంశం తేలితే రాష్ట్ర రాజకీయా లపై ఒక నిర్ణయం తీసుకుంటామన్నారు. మతతత్వం, అవినీతి, అధికధరలకు వ్యతి రేకంగా ప్రతిజిల్లాలోనూ ఉద్యమాలు నిర్వ హించాలని ఆయన కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు పి.మధు, జిల్లా కార్యదర్శి చంద్ర రాజగోపాల్, నాయకులు జక్కా వెంకయ్య, చంద్రమౌళి, శ్రీరాములు, జనా ర్ధన్‌రెడ్డి, మాదాల వెంకటేశ్వర్లు, ఎం. మోహన్‌రావు పాల్గొన్నారు.

### కొత్త సంవత్సరం

## గట్టిగా పనిచేద్దాం

**- పోలీసులకు ఎస్పీ సూచన**

నూతన సంవత్సరంలో అందరం కలిసిమెలిసి జిల్లాలో ఐక్యంగా శాంతి భద్రతను కాపాడుదామని నెల్లూరు జిల్లా ఎస్పీ పివీయన్ రామకృష్ణ పోలీసు అధికారులకు, సిబ్బందికి సూచించారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఏఎస్పీ ఐఆర్ఎస్ మూర్తి, డిఎస్పీలు వెంకటనాథ్‌రెడ్డి, రాంబాబు, బాలవెంకటే శ్వరరావు, చౌడేశ్వరితో పాటు హోంగార్డు డిఎస్పీ సూరిబాబు తదితరులు బుధవారం నెల్లూరు నగరంలోని ఎస్పీ ఛాంబర్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నెల్లూరు కేంద్రకారాగారం సూపరింటెండెంటు రవి కిరణ్, డిప్యూటీ సూపరింటెండెంట్లు, జైలర్లు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ ఈఎస్ శ్రీనివాస్ తదితరులు ఎస్పీని కలిసి శుభా కాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎస్పీ సిఐ జయ రామసుబ్బారెడ్డి, సిసియస్ సిఐలు వీరాంజ నేయరెడ్డి, బాజిజాన్‌సైదా, ఖాసింపీరా, నెల్లూరు రూరల్, కోవూరు సిఐలు సుధా కర్‌రెడ్డి, మాణిక్యరావు, డిసీఆర్‌బీ సిఐ శ్రీనివాసరావు, మహిళా సిఐ నాగేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## నారాయణ పరిశోధనా కేంద్రానికి అవార్డుల పంట

నెల్లూరు ముత్తుకూరురోడ్డులోని నారాయణ వైద్యశాలలో మెడికల్ సూపరింటెండెంట్ జి.సుబ్రహ్మణ్యం డిసెంబర్ 31న విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ నారాయణ వైద్యశాల ఆధునిక పరిశోధనా కేంద్రంలో జరుగుతున్న పరిశోధనలకు పలు అవార్డులు వచ్చాయని పేర్కొన్నారు. దేశంలోని పరిశోధనా కేంద్రాల్లో నారాయణ పరిశోధనాకేంద్రం 12వస్థానంలో వుందన్నారు. ఇటీవల విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం నిర్వహించిన పర్యావరణ కాలుష్యం జన్యుశాస్త్రం, క్యాన్సర్ బయాలజీ చికిత్స విధానాలపై అంతర్జాతీయ సదస్సులో నారాయణకు ఉత్తమ, ద్వితీయ పరిశోధన అవార్డులు వచ్చాయన్నారు. విదేశాల్లోని పరిశోధనా కేంద్రాల్లో నారాయణ పరిశోధనకేంద్రం తరఫున 10ప్రాజెక్టులు కొనసాగుతున్నాయన్నారు. ఫిబ్రవరి 3న జమ్ముకాశ్మీర్‌లో జరుగనున్న జాతీయస్థాయి సదస్సుకు నారాయణకు ఆహ్వానం అందిందన్నారు. ప్రైవేటు పరిశోధనాకేంద్రాల్లో నారాయణ వైద్యశాల పరిశోధనాకేంద్రం మేటిగా నిలిచిందన్నారు. ఈ ఉన్నతికి కృషిచేసిన శాస్త్రవేత్తలు, గైడ్లు, నర్సింగ్ లెక్చరర్స్‌కు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వైద్యశాల ఐ.సి.సూపరింటెండెంట్ సుబ్బారావు, అడిషనల్ సూపరింటెండెంట్ రామ్మోహన్, శాస్త్రవేత్తలు సత్యానంద్, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# గొప్ప ఆదర్శవంతుడు డా॥ నీలం సంజీవరెడ్డి



నెల్లూరు పురమందిరం లోని పఠన మందిరం మిద్దె పైన పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతాజీ ఫౌండేషన్‌ల సంయుక్త నిర్వహణలో డిసెంబర్ 30న డాక్టర్ నీలం సంజీవరెడ్డి శత జయంతి వేడుకలు జరిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నెల్లూరు నగర శాసన సభ్యులు ముంగమూరు శ్రీధర్‌కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి అయిన డా॥ నీలం సంజీవరెడ్డి రాష్ట్ర రాజకీయాలతో ప్రముఖ పాత్ర పోషించడమే కాకుండా రాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వహించి ప్రజలు మన్నలు పొందిన ఆదర్శవంతుడు అని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ ఐటిఐ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు వొమ్మిన సతీష్ మాట్లాడుతూ అనంతపురం జిల్లాలోని మారుమూల పల్లెటూర్లో పుట్టిన సంజీవరెడ్డి క్రమశిక్షణ, పట్టుదలతో చదివి, రాజకీయాలలో రాష్ట్రంలోను, కేంద్రంలోను పేరు ప్రఖ్యాతులు పొందారని అన్నారు. యూత్‌కాంగ్రెస్ నేత ఆనం రంగమయూర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ యాంత్రిక జీవనంలో అటు తల్లిదండ్రుల్ని, ఇటు తోబుట్టువుల్ని మర్చిపోతున్న తరుణంలో వందేళ్ళ క్రితం జన్మించిన వ్యక్తుల్ని గుర్తు చేసుకుంటున్నామంటే కారణం వారు చేసిన మంచి పనులేనని, అవి వారిని ప్రజల మనస్సులో చిరకాలం నిలిచుండేలా చేస్తాయని అన్నారు. కార్యక్రమంలో బివి నరసింహం, నేతాజీ ఫౌండేషన్ పేరం సుందరామిరెడ్డి, "పినాకిని" అధ్యక్షుడు మురళీమోహన్‌రాజు, దగ్గుపాటి రాధాకృష్ణ, ఉరుబిండి వెంకటసుబ్రహ్మణ్యశాస్త్రి, దశరథరామిరెడ్డి, సంస్థ ఉపాధ్యక్షుడు రవి గోగులపల్లి తదితరులు పాల్గొన్నారు.

# అంధ విద్యార్థులకు స్వీట్స్ పంపిణీ



నెల్లూరు దర్గామిట్టలోని విశ్వభారతి అంధుల పాఠశాలలో డిసెంబరు 27న ముస్లింయూత్ ఆధ్వర్యంలో అంధ విద్యార్థులకు బ్రెడ్, బిస్కెట్లు, జామ్, స్వీట్లు పంపిణీచేసారు.

ఈ సందర్భంగా ముస్లిం యూత్ జిల్లా అధ్యక్షుడు ఖాలీద్ మాట్లాడుతూ నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగలను పురస్కరించుకొని ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. నెల్లూరు ప్రజలకు నూతన సంవత్సర సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పఠాన్ షబ్బీర్, జమీర్, నరేష్, సలాం, యూసూఫ్ తదితరులు పాల్గొన్నారు.

**సేవాకార్యక్రమంతో...**

# 2013కు వీడ్కోలు పలికిన "స్టైల్" వాకర్స్



నెల్లూరు భక్తవత్సలనగర్‌లోని జనహిత వాత్సల్య అనాధబాలల వసతిగృహం, వృద్ధుల ఆశ్రమమాలలో డిసెంబర్ నెల 29న స్టైల్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు 2013కు వీడ్కోలు, 2014కు ఆహ్వానం పలుకుతూ ఫలహారాలు, తినుబండారాలు పంపిణీ చేశారు. స్టైల్ వాకర్స్ డాక్టర్ తులం సుబ్బారావు, రూపినేని శ్రీనివాసులునాయుడు, వృద్ధులకు ఆరోగ్య సలహాలు ఇచ్చారు.

కార్యక్రంలో స్టైల్ వాకర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వై.రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.వి.కృష్ణయ్య, సభ్యులు మన్నసుబ్రహ్మణ్యం, గణపం రాజగోపాల్‌రెడ్డి, భక్తవత్సలరెడ్డి, రోశయ్య, ఇస్మాయిల్, లెనిన్ టైలర్ మదార్, ఇఫ్కో రవీందర్, దుత్తా శ్యామ్, ప్రసాద్‌రాజా, సుబ్బారావు, దొమ్మరాజు, వెంకటసుధ పాల్గొన్నారు.

# ప్రైవేట్ ట్రావెల్స్‌పై రవాణాశాఖ దాడులు

నెల్లూరు ఉపరవాణా కమీషనర్ మోహన్ పర్యవేక్షణలో రవాణాశాఖ ఇన్‌స్పెక్టర్లు మురళీమోహన్, సీతారామిరెడ్డి, అనిల్ తదితరుల తమ సిబ్బందితో కలిసి నెల్లూరు నగరంలో నిబంధనలకు వ్యతిరేకంగా నడుపుతున్న ప్రైవేట్ ట్రావెల్స్ కార్యాలయాలపై మంగళవారం రాత్రి దాడులు చేసారు. మినీబైపాస్ రోడ్డు, రైల్వేస్టేషన్ రోడ్డు, మద్రాసు బస్టాండ్ తదితర ప్రాంతాల్లో ఉన్న టిక్కెట్ బుకింగ్ కేంద్రాలను అధికారులు తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అనుమతులు లేకుండా టిక్కెట్ కేంద్రాలు నడుపుతున్న మద్రాసు బస్టాండ్ వద్దనున్న రాజేష్, దివ్య, ఢిల్లీ, మినీబైపాస్ రోడ్డులోని శ్రీసాయికృష్ణ, ప్రైవేట్ ట్రావెల్స్ ఏజెన్సీ కార్యాలయాల్లోని పుస్తకాలను, కంప్యూటర్ సిపియూలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డిటిసి మోహన్ మాట్లాడుతూ ఇక మీదట క్రమం తప్పకుండా టిక్కెట్ బుకింగ్ కేంద్రాలపై దాడులు చేస్తామన్నారు. నెల్లూరు నగరంలో ప్రైవేటు, ఆర్టీసీబస్సు టిక్కెట్లు అమ్మే కేంద్రాలు నగరంలో 30 నుంచి 35 వరకు ఉన్నాయని, జిల్లా వ్యాప్తంగా మరో 20 వరకు ఉన్నట్లు గుర్తించామన్నారు. వీరందరూ టిక్కెట్లు అమ్ముకునేందుకు రవాణాశాఖ కార్యాలయంలో లైసెన్స్ తీసుకోవాలన్నారు.

# సవాళ్ళు ఎదుర్కొని...శాంతిభద్రతలు కాపాడాము

**నెల్లూరు జిల్లా రామకృష్ణ**



2013వ సంవత్సరం అనేక సవాళ్ళను సమర్థవంతంగా ఎదుర్కొని, శాంతి భద్రతలు కాపాడామని నెల్లూరు జిల్లా ఎస్పీ పివియస్ రామకృష్ణ అన్నారు.

ఆదివారం నెల్లూరులోని ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్ హాల్లో విలేకర్లతో మాట్లాడారు. 2012లో జిల్లాలో 6,410 కేసులు నమోదుకాగా, 2013లో 7,013 కేసులు నమోదయ్యాయన్నారు. నేరాల సంఖ్య 9 శాతం పెరిగిందన్నారు. మొత్తం రూ.10.30 కోట్ల సొత్తు చోరీ జరిగిందని అందులో రూ.6,36,78,336 సొత్తు రికవరీ చేసి, 550 మంది నిందితులను అరెస్ట్ చేసామన్నారు. రోడ్డు ప్రమాదాల్లో 2012లో 487 మంది మృతి చెందగా, 2013లో 441 మంది మృతి చెందారన్నారు. నెల్లూరు జిల్లావ్యాప్తంగా ఎర్రచందనం అక్రమ రవాణాకు సంబంధించి 53 కేసులు నమోదు చేసి 54 వాహనాలను సీజ్ చేశా మని, రూ.3.40 కోట్ల విలువజేసే 2,362 దుంగలను స్వాధీనం చేసుకుని 74 మందిని అరెస్ట్ చేసామన్నారు. మోటారు వెహికల్ యాక్టు క్రింద 82,629 కేసులు నమోదు చేసి రూ.1,84,86,900 జరిమాన విధించామన్నారు. డ్రింక్ అండ్ డ్రైవ్‌పై రెండు నెల్లో 570 కేసులు నమోదు చేశామని 59 మందికి జైలు శిక్ష పడిందన్నారు. నంబరు ప్లేట్లు లేని వాహనాలపై దాడులు చేసి 10591 కేసులు నమోదు చేసి రూ.17.05 లక్షల నగదు జరిమాన విధించామన్నారు. పరిమితికి మించిన లోడుతో వెళుతున్న ఆటోలపై దాడులు చేసి 4085 కేసులు నమోదుచేసి రూ.6.49 లక్షలు అపరాధ రుసుము వసూలు చేసామన్నారు.

జిల్లాలో 135 ట్రాన్స్‌ఫార్మర్లు, 28 మోటార్లు, 55 బ్యాగ్ లిఫ్టింగ్ కేసులు నమోదయ్యా యన్నారు. ఈ సమావేశంలో నెల్లూరు నగర, రూరల్, కావలి, గూడూరు డిఎస్పీలు వెంకటనాథ్‌రెడ్డి, రాంబాబు, బాలవెంకటేశ్వ రారావు, చౌడేశ్వరి, ఎస్‌బి, సిసియస్, డిసి ఆర్‌బి, డిటిఆర్‌బి, అయిదవ నగర సిఐలు జయరామ సుబ్బారెడ్డి, వీరాంజనేయరెడ్డి, వై.శ్రీనివాసరావు, మాధవరావు, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

# ఘరానా కేటుగాళ్ళ అరెస్ట్

## 2లక్షల సొత్తు స్వాధీనం

ఒక వృద్ధురాలిని బెదిరించి దోపిడీకి పాల్పడిన సంఘటనలో ఇద్దరు నిందితులను నెల్లూరు జిల్లా కొడవలూరు పోలీసులు అరెస్ట్ చేసారు. నిందితుల నుంచి సుమారు రూ.2లక్షలు సొత్తు స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరు నగరంలోని ఉమేష్ చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్‌హాల్లో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో జిల్లా ఎస్పీ పివియస్ రామకృష్ణ వివరాలు వెల్లడించారు. నెల్లూరు జిల్లా టిపిగూడూరుకు చెందిన ఆటోడ్రైవర్ బండి ప్రసాద్ కొంత కాలంగా నెల్లూరు లక్ష్మీపురంలో కాపురంముంటున్నాడు. కిసాన్ నగర్ మల్లెతోటకు చెందిన గౌస్‌బాషా, బండిప్రసాద్ స్నేహితులు. చెడు అలవాట్లుకు బానిసలై దొంగతనలకు అలవాటుపడ్డారు. ఆక్రమంలో నెల్లూరు జిల్లా జలదంకి మండలం గట్టుపల్లి చింతలపాలెంకు చెందిన లక్కల కొండమ్మ అనే వృద్ధురాలు నెల్లూరు వచ్చి డిసెంబర్ 21వ తేది ఉదయం తన స్వగ్రామంకు వెళ్ళేందుకు రోడ్డు పైకి వచ్చింది. బండి ప్రసాద్ తన ఆటోలో స్నేహితుడితో కలసి అటుగా వెళుతుండగా, కొండమ్మ ఆపి ఆత్మకూరు బస్టాండ్‌కు వెళ్ళాలని చెప్పింది. ఆటోలో ఎక్కించుకున్న నిందితులు ఆమె ఒంటిపై నున్న బంగారు ఆభరణాలను అపహరించాలని తలంచి, తడికలబజారు సెంటర్‌లో ఆటోను ఆపి కూల్‌డ్రింక్‌లో మత్తుమందు కలిపి ఆమెతో తాగించారు. అనంతరం ఆమెను ఆత్మకూరు బస్టాండ్‌లో కావలి బస్సు ఎక్కించారు. అనంతరం బస్సును వెంబడించి కొడవలూరు వద్ద ఆటోలోవున్న గౌస్‌బాషా బస్సు ఎక్కి కొండమ్మ ప్రక్కన కూర్చుని ముసునూరు సమీపంలో గౌస్‌బాషా బస్సు డ్రైవరుతో అవ్వకు అనారోగ్యంగా ఉందని, నెల్లూరు ఆసుపత్రికి తీసుకెళ్ళాలని చెప్పి, గౌస్‌బాషా కొండమ్మను దించి వెంట వచ్చిన ప్రసాద్ ఆటోలో ఆమెను ఎక్కించుకుని గండవరం సబ్‌స్టేషన్ వద్ద ఆటోను ఆపి వృద్ధురాలిని బెదిరించి ఆమె వద్దనున్న బంగారు ఆభరణాలను దోచుకెళ్ళారు. బాధితురాలు బస్సులో వెళ్ళి కుటుంబసభ్యులకు విషయం తెలపగా డిసెంబర్ నెల 26న కొడవలూరు పోలీసులకు ఫిర్యాదు చేసారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఆదివారం ములుమూడి బస్టాండ్ వద్ద నిందితులను పట్టుకున్నారు. ఆటోను స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్ట్ చేసారు. నెల్లూరు రూరల్ డిఎస్పీ రాంబాబు, కోడూలూరు సిఐ మాణిక్యరావు, కొడవలూరు ఎస్సై పాల్గొన్నారు. సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

# రైస్‌మిల్లులపై దాడులు

## రూ.10 లక్షలు విలువైన బియ్యం స్వాధీనం

నెల్లూరు జిల్లా కోవూరు మండలంలోని ఇనమడుగు రోడ్డులో ఉన్న రాబాయిల్డ్ రైస్‌మిల్లు, నెల్లూరు శెట్టిగుంటరోడ్డులోని మరో రైసుమిల్లుపై జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లక్ష్మీకాంతం ఆదివారం దాడులు చేసారు. చౌక దుకాణం బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేయడంతో ఈ దాడులు చేపట్టారు. శెట్టిగుంటరోడ్డులోని రైసుమిల్లులో తనిఖీలు చేసిన అధికారులు 67.5క్వింటాళ్ల బియ్యం అక్రమంగా నిల్వ ఉన్నట్లు గుర్తించారు. రూ.10 లక్షల విలువైన 934 బస్తాల బియ్యంను సీజ్ చేసారు. ఈ సందర్భంగా జేసి మాట్లాడుతూ జిల్లాలోని పలు రైసుమిల్లర్లు పేదలకు ప్రభుత్వం అందజేస్తున్న బియ్యాన్ని అక్రమంగా కొనుగోలుచేసి వాటిని రీసైక్లింగ్ చేస్తున్నట్లు తెలిసిందన్నారు. రేషన్ బియ్యాన్ని కల్తీ చేసి నాణ్యమైన బియ్యంగా విక్రయిస్తున్నట్లు గుర్తించామన్నారు. అక్రమ వ్యాపారం చేస్తున్న పలు రైసుమిల్లులపై నిఘా పెట్టేందుకు తనిఖీ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. కొడవలూరు మండలం సిఎస్‌పురం, కోవూరు మండలం ఇనమడుగురోడ్డులోని రైసు మిల్లులపై ఈ బృందాలు దాడులు చేసి పేదల బియ్యాన్ని సీజ్ చేశామన్నారు. ఆయా మిల్లర్లపై 6ఏ కేసులు నమోదు చేశామన్నారు.

ఈ దాడుల్లో డిఎస్ఓ ఉమామహేశ్వరరావు, సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ ధర్మారెడ్డి, కోవూరు తహశీల్దార్ సాంబశివరావు, నెల్లూరు, కావలి ఏఎస్ఓలు శంకర్, శ్రీహరి, సిఎస్‌డిటి వెంకట్రావు, విఆర్వో

# దెబ్బ మీద దెబ్బ

- పదిరోజుల్లో ఏసిబి రెండోసారి దాడి
- రూ.60వేలు స్వాధీనం

పట్టుమని పది రోజులు కూడా కాలేదు ఏసిబి దెబ్బ కొట్టింది. ఆంధ్రా, తమిళనాడు సరిహద్దులోని బీవీపాళెం చెక్‌పోస్ట్‌పై ఏసిబి రెండోసారి దాడి చేసింది. ఇటీవల అర్థరాత్రి దాటిన తర్వాత ఏసిబి డిఎస్పీ భాస్కరరావు ఆధ్వర్యంలో దాడులు చేపట్టారు. ఈ దాడుల్లో ఓ ప్రైవేటు వ్యక్తితో సహా పలు విభాగాల్లో దాదాపు రూ.60 వేలు పట్టుబడింది. వారం క్రితం జరిపిన దాడిలో రూ.1,10,990లు పట్టుబడగా ఈసారి అందులో సగం లభించింది. ఏసిబి దాడుల్లో ముందు జాగ్రత్తగా సిబ్బంది వ్యవహరించడంతో ఏసిబి అధికారులకు అంతగా మొత్తం పట్టుబడలేదు. డ్రైవర్లు, క్లీనర్లు వేషధారణలతో డిసెంబర్ 20వ తేది జరిగిన దాడుల తరహాలోనే శనివారం అర్థరాత్రి వేషధారణతో మరలా చెక్‌పోస్టులపై దాడిని నిర్వహించారు. ఈసారి ఇరిగేషన్‌శాఖ అధికారులను మధ్యవర్తులుగా పెట్టుకుని దాడులు చేసారు. ఏసిబి డిఎస్పీ భాస్కరరావు నేతృత్వంలో ముగ్గురు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు ఒక ఇన్‌స్పెక్టర్, ముగ్గురు హెడ్ కానిస్టేబుళ్ళు, ఎనిమిది మంది కానిస్టేబుళ్ళు ఈ దాడుల్లో పాల్గొన్నారు.

గత ఏడాది అక్టోబర్ 10న, డిసెంబర్ 20వ తేదీన ఏసిబి అధికారులు దాడులు నిర్వహించి తాజాగా శనివారం అర్థరాత్రి దాటిన తర్వాత దాడులు చేపట్టారు. ఇన్‌కమింగ్ చెక్‌పోస్టులో రూ.31,390, వివిధశాఖలు ఉన్న అవుట్ గోయింగ్‌లో రూ.6910, రవాణాశాఖ వద్ద రూ.21,310 దొరికింది. ఈ దాడుల్లో సిఐలు కె.వెంకటేశ్వరరావు, కృపానందం, టివి శ్రీనివాస్(బంగోలు), ఇన్‌స్పెక్టర్ ఎస్. వెంకటే శ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.



డిసెంబర్ 30వ తేదీ మర్రిపాడు మండలం రామానాయుడుపల్లి గ్రామంలో సిమెంటు రోడ్డు మరియు కమ్యూనిటీహాలు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న రాష్ట్ర ఆర్థికశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పక్కన ఏజేసీ సి.హెచ్.పెంచలరెడ్డి, జిల్లా కేంద్రసహకార బ్యాంకు ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, పి.బ్రహ్మానందరెడ్డి తదితరులు.

# నెల్లూరు కబుర్లు

## నేతల ఇళ్ల వద్ద సందడే సందడి

జనవరి 1వ తేదీ కొత్త సంవత్సరం సందర్భంగా నెల్లూరులోని వివిధ పార్టీల నేతలు, పార్టీ కార్యాలయాల వద్ద సందడి నెలకొంది. అలాగే జిల్లా కలెక్టర్, ఎస్పీ, జేసీ వంటి ఉన్నతాధికారుల కార్యాలయాల వద్ద కొత్త సంవత్సరం కోలాహలం కనిపించింది. ఎంపీ, ఎమ్మెల్యేలు, వివిధ పార్టీల నేతలు తమ ఇళ్ల వద్ద ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి శుభాకాంక్షలు చెప్పడానికి వచ్చిన అభిమానులకు అల్పాహార విందు ఏర్పాటు చేసారు. అభిమానులు, కార్యకర్తలు తమ నాయకులను గజమాలలతో సత్కరించి నూతనసంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యంగా వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని టిక్కెట్లను ఆశిస్తున్న నాయకుల ఇళ్ల వద్ద కొత్త సంవత్సర శోభ బాగా కనిపించింది.

## పోలీస్‌డైరీ విడుదల



జిల్లా పోలీసు అధికారుల సంఘం రూపొందించిన 2014 సంవత్సరం డైరీని జిల్లా ఎస్పీ వి.వి.యస్. రామకృష్ణ డిసెంబర్ 30వ తేదీన ఆవిష్కరించారు. నెల్లూరులోని పోలీస్ పెరేడ్‌గ్రౌండ్‌లోగల ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్ హాల్ నందు ఈ కార్యక్రమం జరిగింది. పోలీసు సిబ్బందికి ఈ డైరీ దిక్సూచిలాంటిదని ఈ సందర్భంగా ఎస్పీ చెప్పారు. పోలీసుడైరీలో సిబ్బందికి అవసరమైన అన్ని విషయాలు పొందుపరచి ఉన్నాయని, ప్రతి పోలీసు కూడా ఈ డైరీని తమ చెంత ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు గోపిరెడ్డి, డిఎస్పీ వెంకటనాథ్‌రెడ్డి, పోలీసు అధికారుల సంఘం గౌరవాధ్యక్షులు గంగాధర్, జిల్లా అధ్యక్షులు ప్రసాద్, కార్యదర్శి అంజిబాబు, సహాయకార్యదర్శి సురేష్‌కుమార్‌రెడ్డి, కోశాధికారి బాబు, సంఘం మాజీ జిల్లా అధ్యక్షులు మాధవరెడ్డి, రూరల్, కావలి డిఎస్పీలు వి.యస్.రాంబాబు, బాలకోటేశ్వరరావు, డైరీ ముద్రణకు సహకరించిన ఎం.ద్వారకానాథ్, చిన్నారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, నారాయణ, సిఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

## మధ్యప్రదేశ్ హోంమంత్రి మైపాడులో బస

మధ్యప్రదేశ్ హోంమంత్రి బాబులాల్‌గౌర్ సోమవారం రాత్రి నెల్లూరు జిల్లా మైపాడు బీచ్‌లోని రిసార్ట్స్‌లో బసచేసారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ ఈ ప్రాంతం తనకు, తన కుటుంబసభ్యులకు ఆహ్లాదాన్ని, ఆనందాన్ని ఇచ్చిందన్నారు. హోంమంత్రితో పాటు కోడలు, భూపాల్ మేయర్ కృష్ణగౌర్, కుటుంబసభ్యులు ఉన్నారు. తహశీల్దార్ విక్రమ్ శీనానాయక్, ఎస్సై శేఖర్‌బాబు భద్రత ఏర్పాటును చూసారు. మంగళవారం హోంమంత్రి, కుటుంబ సభ్యులు తిరిగి వెళ్ళారు.

అమ్మ ఫర్నిచర్ మాల్
మినిబైపాస్‌రోడ్, నెల్లూరు.
- సరికొత్త ప్రపంచస్థాయి మోడల్స్
- ఇంపోర్టెడ్ & ఇండియా ఫర్నిచర్
ఫైనాన్స్ సదుపాయము, ఆదివారం షాపు గలదు.

## రాత్రివేళల్లో గస్తీని ముమ్మరంచేయాలి

రాత్రివేళల్లో గస్తీని ముమ్మరంచేయాలని నెల్లూరు రూరల్ డిఎస్పీ వియస్ రాంబాబు ఆదేశించారు. ఇటీవల నెల్లూరురూరల్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీచేసిన అనంతరం రాంబాబు మాట్లాడారు. ప్రజలకు శాంతిభద్రతలను కల్పించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. చోరీల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. హత్యకేసులు, రోడ్డు ప్రమాదాలు, వివిధ సమస్యలపై ఉన్న కేసులు త్వరగా పరిష్కారమయ్యే విధంగా చూడాలన్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లోని పలు రికార్డులను పరిశీలించారు. రూరల్ సిఐ సుధాకర్‌రెడ్డి, ఎస్సై వెంకటరావు పాల్గొన్నారు.

## కొత్త సంవత్సరానికి కొత్త ఆఫర్లు

నెల్లూరు బిఎస్ఎన్ఎల్ సంస్థ నూతన సంవత్సరం సంక్రాంతి పండుగల సందర్భంగా కొత్త ఆఫర్లు ప్రకటించింది. ఈమేరకు జిల్లా జనరల్ మేనేజర్ గోపి విలేకర్లకు తెలిపారు. మొబైల్ ఫోన్‌ల టాప్‌అప్‌లో 200రూ॥ల నుంచి 900వరకు మార్చి31వతేదీ వరకు ఫుల్‌టాక్‌టైమ్ ఉంటుందన్నారు. 1000 నుండి 2999 వరకు 10శాతం అదనపు టాక్‌టైంను అందజేస్తామన్నారు. మొబైల్ ప్రీపెయిడ్ అక్షర పథకం ద్వారా ప్లాన్ వాలిడిటీ 180రోజులు, ఎస్‌టిడి, లోకల్ కాల్స్‌కు ఏ నెట్‌వర్క్ అయినా నిమిషానికి 33పైసలు పడుతుందని తెలిపారు. జనవరి6 నుంచి 26వతేదీ వరకు బిఎస్ఎన్ఎల్ కార్యాలయాల్లో, కస్టమర్‌కేర్‌సెంటర్లలో రీకనెక్షన్ మేళా నిర్వహిస్తామన్నారు. గ్రామీణ ప్రాంత ల్యాండ్‌లైన్ వినియోగదారులు నెలకు 500రూ॥లు పట్టణ ప్రాంత వినియోగదారులు 600రూ॥ల చెల్లించి ల్యాండ్‌లైన్, మొబైల్ బిఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌తో దేశవ్యాప్తంగా అపరిమితంగా సేవలు ఉపయోగించుకోవచ్చన్నారు. ఇంటర్నెట్ సేవల్లో 650కు 1ఎంబిపిఎస్ అపరిమితంగా సేవలు ఉపయోగించుకోవచ్చన్నారు. ఇంటర్నెట్ సేవల్లో రూ॥650కు 1ఎంబిపిఎల్ అపరిమిత ఇంటర్నెట్, 100ఉచిత ఫోన్‌కాల్స్ బిఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌తో పొందవచ్చన్నారు. 800కు 2ఎంబిపిఎస్‌తో అపరిమిత ఇంటర్నెట్‌ను వినియోగించుకోవచ్చన్నారు. 900రూ॥లకు ఫోర్ ఎంబిపిఎస్‌తో అపరిమిత ఇంటర్నెట్ 350ఉచిత ఫోన్‌కాల్స్‌ను పొందవచ్చని తెలిపారు.

## వైకాపా కొత్త సంవత్సర క్యాలెండర్ విడుదల



నెల్లూరు దర్గామిట్టలోని సరస్వతీ నగర్‌లో గల నెల్లూరు గ్రామీణ వైయస్సార్సీపీ కార్యాలయంలో డిసెంబర్ నెల 29న నూతన సంవత్సరం సందర్భంగా క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మేరిగ మురళీధర్, నెల్లూరు గ్రామీణ సమన్వయకర్త కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తదితరులు ఆవిష్కరించారు. పార్టీ నెల్లూరు నగర నాయకుడు సన్నపురెడ్డి సుబ్బారెడ్డి ఈ క్యాలెండర్‌ను ప్రచురించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తాటి వెంకటేశ్వర్లు, మాజీ కౌన్సిలర్ కె.వి.రాఘవరెడ్డి, పిగిలాం నరేష్‌యాదవ్, బందారు సతీష్‌రెడ్డి, కొల్లి పవన్‌కుమార్‌రెడ్డి, తోటకూర అశోక్‌నాయుడు, ఎస్.నరేష్, టి.భాస్కరరావు, కె.నరేంద్ర, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మీ-సేవ ప్రాంతీయ అధ్యక్షుడిగా సలీం

నెల్లూరు మీ-సేవ ప్రాంతీయ అధ్యక్షుడిగా ఎస్‌కె సలీంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నెల్లూరు జడ్పీ కాలనీలోని ఆనం రామిరెడ్డి బిల్డింగ్‌లో సోమవారం జరిగిన సమావేశంలో పాలకమండలి సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ కోఆర్డినేటర్లుగా నెల్లూరుటౌన్-1కు వెంకటరావు, నెల్లూరు టౌన్-2కు సుకన్య, గూడూరుకు నాగరాజు, వెంకటగిరికి చక్రపాణి, కావలికి ధనుంజయ కుమార్‌లను ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, తాత్కాలిక అధ్యక్షుడు చక్రపాణి, శ్రీనివాసులు, మధుసూదనరెడ్డి, గిరి, కిషోర్, మమత, మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.




### "స్వర్ణభారత్"

## ముగ్గుల పోటీలు

స్వర్ణభారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల సందర్భంగా నెల్లూరు జిల్లాలోని 11 ప్రాంతాలలో ముగ్గుల పోటీలు జరుగుతాయని ట్రస్ట్ ముఖ్య కార్యనిర్వాహణధికారి జె. శరత్‌బాబు తెలిపారు. జనవరి 4న వెంకటాచలంలో, 5న బుచ్చి, కావలి, ఉదయగిరి, పొదలకూరు, గూడూరు, వెంకటగిరి, ఆత్మకూరు, నాయుడుపేటల్లో, 6న నెల్లూరు, రాపూరుల్లో ఈపోటీలు నిర్వహిస్తామని తెలిపారు. పోటీలో పాల్గొనే మహిళలు ముగ్గుపొడి, రంగులు వారే తెచ్చుకోవాలని, 11 ప్రదేశాల్లో గెలుపొంది ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన విజేతలు అందరికీ జనవరి 11న వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఫైనల్స్ జరుగుతాయని తెలిపారు. ప్రతి ప్రదేశంలో మొదటి బహుమతి రూ.4,500లు, రెండవ బహుమతి రూ.1000లు, మూడవ బహుమతి రూ.750 చొప్పున అందిస్తామని, ఫైనల్స్‌లో విజేతలకు మొదటి బహుమతిగా రూ.5000లు, రెండవ బహుమతిగా రూ.4,000లు మూడవ బహుమతిగా రూ.3,000లు బహుకరిస్తామని తెలిపారు.

## మల్లేశ్వరస్వామికి కొత్త వాహనాలు

నెల్లూరు నవాబుపేటలోని శ్రీభ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామికి ఉభయకర్తలు రెండు కాంస్య వాహనాలను అందజేసారు. మంచికలపాటి దశరధరామయ్య, రమణమ్మల జ్ఞాపకార్థం వారి మనుమళ్లు సుమన్, వెంకటేష్‌లు సోమవారం వారి కుటుంబసభ్యులతో కలిసివచ్చి స్వామి వారికి నంది కాంస్య వాహనాన్ని అందజేసారు. అలాగే మల్లాల వెంకటసుబ్బయ్య, జయలక్ష్మమ్మల జ్ఞాపకార్థం వారి కుమార్తె భారతి, అల్లుడు ఎన్.బాలాజీలు అమ్మవారికి కాంస్య సింహవాహనాన్ని అందజేశారు.

### బ్రిడ్జిపై చీకట్లు...

## వాహనదారులకు అగచాట్లు

నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండ్ వద్దగల ఫ్లైఓవర్ బ్రిడ్జి ప్రమాదభరితంగా మారుతోంది. ఈ బ్రిడ్జి మీద వున్న లైట్లలో ఒక్కటీ వెలగడం లేదు. రాత్రివేళల్లో ఈ బ్రిడ్జి మీద పోతుంటే నగరంలో పోతున్నట్లు లేదు, ఎడారిలో పోతున్నట్లుగా ఉంటుంది. దీనికితోడు బ్రిడ్జి మీద చాలా చోట్ల గుంతలు పడివున్నాయి. ఆ చీకటిలో దగ్గరకు వచ్చాకగాని గుంతలు కనిపించడం లేదు. లైట్లు లేక, గుంతలు కనిపించక ఈ బ్రిడ్జి మీదపోయే సమయంలో వాహనదారులు నానా అగచాట్లు పడాల్సివస్తుంది.

### మాజీ సైనికులకు

## దరఖాస్తుల ఆహ్వానం

ఎక్స్ సర్వీస్‌మెన్ కంట్రిబ్యూటరీ హెల్త్ స్కీంకు సంబంధించి సికింద్రాబాద్‌లో పనిచేసేందుకు మాజీ సైనికుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నెల్లూరుజిల్లా సైనిక సంక్షేమ అధికారి డాక్టర్ వి.కోటేశ్వరరావు కోరారు. డెంటల్ ఆఫీసర్, నర్సింగ్ అసిస్టెంట్ పోస్టులు కోసం ఈనెల 9వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. ఈసీహెచ్ఎస్. గవర్నమెంట్. ఇన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

# పిచ్చి బాగా ముదిరింది

సింహపురి సమాచారం



మంచి అనేది అంత తొందరగా తలకెక్కదు. అదే చెడయితే జెట్‌స్పీడ్‌తో ఎక్కేస్తుంది. ఆరోగ్యానికి మంచిది, మిరియాల కషాయం తాగమంటే ఎవరన్నా తాగుతారా... అదే ఒళ్లు గుల్లచేసేదయినా మద్యం తాగమంటే లీటర్ల లెక్కన తాగేస్తారు. సంవత్సరం ఆఖరు తేదీ అంటే మద్యం తాగుతూ, మాంసాహారం తింటూ కొత్త సంవత్సరానికి స్వాగతం పలకాలనే పిచ్చి జనానికి ఏడాదికేడాదికి పెరుగుతూ ఉంది. డిసెంబర్ 31వ తేదీకి విజయదశమి, సంక్రాంతి, దీపావళి వంటి పండుగల కంటే ప్రాధాన్యత పెరిగి పోయింది. కొత్త సంవత్సరం వేడుకలు వేలంవెర్రిగా తయారవుతున్నాయి. ఒకరోజు గడిస్తే తేదీ మారుతుంది. 30రోజులు దాటితే నెలమారుతుంది... 12నెలలు గడిస్తే సంవత్సరం మారుతుంది. నెలలు మారినట్లే సంవత్సరం మారుతుంది. దీనికే ఇంత హంగామా దేనికి.

బాగా బలిసినోళ్లు, డబ్బులు ఎక్కువుగా ఉన్నోళ్లు కొత్త సంవత్సరం పేరు చెప్పుకుని తాగి తందనాలాడుతున్నారంటే అర్ధముంది. వాళ్ల బలుపు ఆ విధంగా చూపించుకుంటారు. కాని రిక్షాలు తొక్కే వాళ్లు, మూటలు మోసే కూలీలు, సన్న, చిన్న పనులు చేసుకునే వాళ్లు కూడా కొత్త సంవత్సరం పేరుతో తాగితలకు పోసుకుంటున్నారంటే ఈ పిచ్చి ఎంతగా ముదిరిందనుకోవాలి. జీవితంలో ఏదో ఘనకార్యం సాధించినట్లుగా పీకలదాకా తాగడం, రోడ్ల మీద వెర్రి కేకలు వేస్తూ బైకులలో చక్కర్లు కొట్టడం, ఆ మత్తులో ఎక్కడన్నా విరగబడితే ఆసుపత్రిలో మంచమెక్కడం.. ఈ విషసంస్కృతి మనకు అవసరమా?

సంక్రాంతి, శివరాత్రి, దసరా వంటి పండుగలప్పుడు కూడా గుళ్లకు పోని ప్రబుద్ధులు డిసెంబర్ 31వ తేదీ అర్ధరాత్రి 12గంటలకు మాత్రం ఠంచన్‌గా గుడిలో వుంటారు. సంవత్సరంలో 364రోజులు గుళ్లోని దేవుళ్లు ఖాళీగా ఉండి భక్తుల కోసం ఎదురుచూసినా వీళ్లు పోరు. కాని 31వతేదీ మాత్రం గుళ్లలోని దేవుళ్లు గురకపెట్టి నిద్రపోతుంటే, వీళ్లు గుళ్లోని గంటలను గణగణ మోగించి ఆ దేవుళ్ల నిద్రను పాడుచేస్తున్నారు. అర్ధరాత్రి పూజలతో పిచ్చి వీళ్లకు పట్టించుకోవడమే కాకుండా దేవుళ్లకూ పట్టిస్తున్నారు. కొత్త సంవత్సరం క్యాలెండర్‌ను అనుసరించడంలో తప్పులేదు. కాని ఆ కొత్త సంవత్సరం పేరుతో పాశ్చాత్య దేశాలలో కంటే కూడా మనం ఓవర్‌యాక్షన్ చేయడమే వెర్రిబాగుల పని.

## ఒలంపియాడ్‌లో రత్నం విద్యార్థుల విజయకేతనం



న్యూఢిల్లీలోని సైన్స్ ఒలంపియాడ్ ఫౌండేషన్ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన నేషనల్ సైన్స్ ఒలంపియాడ్ పరీక్షల్లో నెల్లూరు వేదాయపాలెంలోని డాక్టర్ కిషోర్స్ రత్నం హైస్కూలు విద్యార్థులు బంగారు పతకాలు సాధించినట్లు డైరెక్టర్ డాక్టర్ కృష్ణ కిషోర్ తెలిపారు. సైన్స్ ఒలంపియాడ్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరచి స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించిన విద్యార్థులను సోమవారం వేదాయ పాలెంలోని పాఠశాలలో అభినందించారు. కార్యక్రమంలో వాసంతి, జీఎం రామ్మూర్తినాయుడు, ప్రధానోపాధ్యాయులు జి.బాలాజీసింగ్, ప్రైమరీ ఇన్‌చార్జ్ అరుణ, మేనేజర్ కామేష్ పాల్గొన్నారు.



ఈ నెల 1వ తేదీన నెల్లూరు క్యాంపు కార్యాలయంలో జిల్లా ఎస్పీ పి.వి.యస్.రామకృష్ణను కలిసి నూతనసంవత్సర శుభాకాంక్షలను తెలియజేస్తున్న నెల్లూరురూరల్ డిఎస్పీ వి.యస్.రాంబాబు, సిఐ సుధాకర్‌రెడ్డి, ఎస్సై ఎ.వెంకట్రావ్

## ఆనం ఫ్యాక్టరీలో నుండే వచ్చాను...



ఆనం కుటుంబం రాజకీయ కర్మాగారం వంటిదని, తాను కూడా ఆ కర్మాగారం నుండి వచ్చిన నాయకుడినేనని మాజీకార్పొరేటర్, రాష్ట్ర ఎడిబుల్ ఆయిల్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సన్నపరెడ్డి పెంచలరెడ్డి చెప్పారు. ఇటీవలే కాంగ్రెస్‌ను వదిలి ఆయన వైయస్సార్ కాంగ్రెస్‌లో చేరడం జరిగింది. వైకాపా నాయకుడిగా మంగళవారం నెల్లూరు రేబాల సందులోని తన ఆఫీసులో తొలి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసారు. ఆనం కర్మాగారంలో తనలాంటి వాళ్లు ఎంతోమంది ఉన్నారని, తాను బయటకెళ్లినంత మాత్రాన వాళ్లకి ఎలాంటి నష్టం ఉండదన్నారు. ఆనం వివేకానందరెడ్డి నాల్గవ తమ్ముడిగా చెప్పుకుంటున్న స్థానం తనదేనని, ఆ స్థానం కల్పించింది కూడా ఆనం సోదరులేనని అన్నారు. దివంగత మహానేత డాక్టర్ వై.యస్.రాజశేఖరరెడ్డి మీద ఉన్న అభిమానంతో, ఆయన తనయుడు జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలో పనిచేయాలని వైకాపాలో చేరడం జరిగిందన్నారు. ఈ రాష్ట్రంలో వ్యాపారులకు అండగా నిలిచింది వై.యస్.రాజశేఖర్‌రెడ్డే. 2002-03 ప్రాంతంలో తెలుగుదేశం ప్రభుత్వం వ్యాపారులపై విజిలెన్స్ దాడులు చేయించి రోజుకో వ్యాపారిని జైలుకు పంపించింది. షాపుకెళ్లిన వ్యాపారి ఇంటికొస్తాడో, జైలుకెళతాడో తెలియని ఆనాటి పరిస్థితుల్లో శాసన సభా ప్రతిపక్ష నాయకుడిగా వ్యాపారుల పక్షాన నిలబడి పోరాడింది వైయస్సేనన్నారు. వై.యస్. ముఖ్యమంత్రిగా వ్యాపారులకు ఎన్నో అండదండలందించారు. ఆయన పట్ల కృతజ్ఞతతోనే వైకాపాలో చేరామన్నారు. వ్యాపారులకు వై.యస్. చేసిన మంచిని వివరిస్తూ జిల్లాలోని పది నియోజకవర్గాలలో కరపత్రాలను పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

## దోమల స్వర్గధామం నెల్లూరు

**- వైఎస్సార్సీపీ నేత కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి**



నెల్లూరులోని వెంగళరావునగర్‌లో డిసెంబర్ 30న డివిజన్ బాటలో భాగంగా వైఎస్సార్సీపీ గ్రామీణ సమన్వయకర్త కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పర్యటించి స్థానిక సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు నగర కార్పొరేషన్ అధ్వాన్నంగా తయారయిందని, అధికారపార్టీ నేతల దోపిడీ అడ్డాగా మారిందని పేర్కొన్నారు. పారిశుద్ధ్యం సరిగా లేక దోమల బెడదతో నెల్లూరు ప్రజలు అనారోగ్యాల పాలై అసుపత్రుల చుట్టూ తిరుగుతూ వేలాది రూపాయలు ఖర్చు పెట్టుకోవాల్సిరావడం శోచనీయమన్నారు. మంచి నీరు తాగేందుకు కాదుకదా స్నానం చేసేదానికి కూడా పనికిరాక ప్రజలు చర్మరోగాల బారిన పడుతున్నారన్నారు. అనేక ప్రాంతాల్లో వీధిలైట్లు వెలగక చిమ్మచీకట్లో ఎవరు ఏ అఘాయిత్యానికి పాల్పడుతారోనని మహిళలు వీధిలోకి రావడానికే భయపడుతున్నారన్నారు. దోమల నిర్మూలనకు ఫాగింగ్ చేయడం కూడా నగర కార్పొరేషన్ మరిచి పోవడం, పారిశుద్ధ్యం పట్ల శ్రద్ధ లేకపోవడం సాక్షాత్తు రాష్ట్ర ఆర్థికశాఖామంత్రి సొంత నగరం కార్పొరేషన్‌లో చోటుచేసుకోవడం సిగ్గుచేటైన విషయమన్నారు. ఇప్పటికైనా అధికారులు, అధికారపార్టీ శాసనసభ్యులు కళ్ళు తెరిచి ప్రజా సమస్యలపై దృష్టిసారించాలని లేకపోతే వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో భారీ ప్రజాందోళనలు చేపడతామని హెచ్చరించారు.

కార్యక్రమంలో ఆటోనగర డెవలప్‌మెంట్ కమిటీ ప్రెసిడెంట్ యస్‌డి సలీమ్, మాజీ కార్పొరేటర్ తాటి వెంకటేశ్వరరావు, స్థానిక నేతలు డా॥సత్యాద్, అరుణమ్మ, బాలకృష్ణయ్య, చెంగళరాయుడు, కాలేషా తదితరులు పాల్గొన్నారు.

ESTD: 1944 సూటింగ్స్ - షర్టింగ్స్ - రెడీమేడ్స్
మాడరన్ స్టోర్స్
ట్రంక్‌రోడ్డు, నెల్లూరు. ఫోన్: 2326462, 6511611.



మీ ఆదరాభిమానాలతో 69 సంవత్సరములు
పూర్తి చేసుకుని 70 వ వసంతములోకి
అడుగిడుతున్న సందర్భంలో మా ఖాతాదారులకు,
శ్రేయోభిలాషులకు, మిత్రులకు మా హృదయపూర్వక
నూతన సంవత్సర మరియు
సంక్రాంతి శుభాకాంక్షలు.
Raymond KILLER Reid & Taylor Louis Philippe The upper crest.

నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు

Mayuri Restaurant
MULTICUISINE
Pogathota, Nellore
☎ 2329601, 2349679
INDIAN CHINESE
TANDOOR MEALS
NELLORE DUM BIRIYANIES
ICE-CREAMS
Carry Home
For HOME DELIVERY
CALL - 2336889
We undertake OUT-DOOR CATER

Venkataramana Vilas
Padmavathi Fast Foods
High Quality Pure Vegetarian
TIFFIN, COFFEE, MEALS, ICE-CREAMS & COOL DRINKS
POGATHOTA, NELLORE. ☎ 2328659, 2349677

శ్రీను గల్పిక 989

# ట్రైనింగ్ కోసం నెల్లూరొచ్చిన అరవింద్ కేజ్రీవాల్

అది గ్యాంగ్‌రేప్‌ల రహిత నగరంగా ఐక్యరాజ్య సమితిలోని మహిళా విభాగం గుర్తింపు పొందిన ఢిల్లీ మహానగరం. అప్పుడే జంతర్‌మంతర్ మైదానంలో ఢిల్లీ ముఖ్యమంత్రిగా అరవింద్ కేజ్రీవాల్ ప్రమాణ స్వీకారం ముగిసింది. ఆయనతో పాటు మంత్రివర్గ సహచరులు చీపురకట్టలు చేతపట్టి సచివాలయానికి చేరుకున్నారు. వీరు చీపుర్లతో రావడం చూసి అక్కడున్న మహిళా కార్మికులు అడ్డంగా నిలబడ్డారు. చీపుర్లతో వస్తున్న సీఎంను, మంత్రులను చూసి... తమను పనిలో నుండి తీసేసి వారిని కొత్తగా చేర్చుకున్నారేమోనని వీళ్లు భ్రమపడ్డారు. ఆ భయంతోనే వారికి అడ్డుతగిలి... మా కడుపులు కొట్టొద్దు... ఎన్నో ఏళ్లుగా ఇక్కడ చీపుర్లతో చిమ్ముకుంటూ బ్రతుకుతున్నాం. మీరు ఇంకోచోట పని చూసుకోండి అని నినాదాలు చేయసాగారు. అరవింద్ కేజ్రీవాల్‌కు విషయం అర్థమై... మీరేం భయపడవద్దు, మీ ఉద్యోగాలు ఎక్కడికీ పోవు. మేం ఉద్యోగాలలోకి రావడం కాదు, ఈ ఢిల్లీకి సీఎం, మంత్రులుగా వచ్చాం. మీరు మా రూంలు చిమ్మండి, మేం ఈ ఢిల్లీ రాజకీయాలలో వున్న చెత్తనంతా చిమ్మేస్తాం అంటూ లోపలకు వెళ్లాడు. సీఎం ఛాంబర్‌లో తన కుర్చీలో కూర్చున్నాడు. ఆయన ఎదురుగా మంత్రులు కూర్చున్నారు. సీఎం కుర్చీలో కూర్చోగానే ఆటోమేటిక్‌గా ఆరవింద్‌కేజ్రీవాల్ మైండ్‌సెట్ మారిపోయింది. ఆయన మంత్రులతో... ఈ కాంగ్రెస్ ఎంతకాలం మనకు మద్దతునిస్తుందో తెలియదు... కాబట్టి దీపం ఉండగానే ఇళ్లు చక్కదిద్దుకోవాలి. ఏయే పనులు చేస్తే ఎంతెంత కమీషన్లు వస్తాయో చూడండి... ముందు డబ్బు దండిగా వచ్చే పనులు చేసేద్దాం. మళ్లీ ఎలక్షన్‌లలో పోటీ చేయాలంటే డబ్బు కావాలిగా. రేపు ఎంపీ ఎలక్షన్‌లలో కనీసం నాలుగు సీట్లన్నా గెలుద్దాం. అప్పుడు కేంద్రంలో ఏ ప్రభుత్వం ఏర్పడ్డా మనం మద్దతునిచ్చి మంత్రి పదవులు కొట్టేయవచ్చు. బ్లాక్‌మెయిల్ చేసైనా మనకు కావాల్సిన పనులు చేసుకుంటుండొచ్చని చెప్పుకుంటూ పోతున్నాడు... ఆయన మాటలు విని మిగతా మంత్రులు ఆశ్చర్యపోయారు. అరవింద్ కేజ్రీవాల్‌లో వారంతా రెండోరూపం చూస్తున్నారు. ఎదురుగా వున్న మంత్రి మనీష్ శిసోడియాకు అరవింద్ కేజ్రీవాల్ అలా ఎందుకు మాట్లాడుతున్నాడనేది అర్థమైపోయింది. వెంటనే ఆయన అరవింద్ చంకల్లో చేతులేసి ఆయన కూర్చున్న కుర్చీలో నుండి పైకిలేపాడు. ఆ కుర్చీలో నుండి లేవగానే అరవింద్ మామూలు స్థితిలోకొచ్చి... మనం ఈ రాజకీయాలను సంస్కరించాలి. ప్రజలకు నీతి, నిజాయితీలతో కూడిన విభిన్నమైన పరిపాలన అందించాలి, మన పనితీరు ఈ దేశానికే ఆదర్శంగా నిలవాలని చెప్పసాగాడు. అప్పుడు మరో మంత్రి సౌరభ్ భరద్వాజ్ కలుగుజేసుకుని... సార్, ముందు మన సచివాలయాన్నే సంస్కరించాలి. గతంలో వున్న వాళ్లు వాడిన వస్తువులను మనం వాడకూడదు. పాత సీఎం కుర్చీలో ఇంతకుముందే మీరు కూర్చున్నారు... మీ మాటలు వారికి తగ్గట్లే వచ్చాయి. కాబట్టి మనం కుర్చీలన్నింటిని మార్పించాలి... అలాగే వాళ్లు వాడిన ఏ వస్తువులూ వాడొద్దు. సచివాలయాన్ని ఫినాయిల్‌తో కడిగి పసుపునీళ్లతో శుద్ధి చేయాలి. పుణ్యక్షేత్రాల నుండి వేదపండితులను పిలిపించి పూజలు, హోమాలు చేయించాలని చెప్పాడు. దాంతో అప్పటికప్పుడు సీఎం ఛాంబర్‌లో కుర్చీలన్నీ మార్చారు.

కొత్తగా పదవుల్లో కూర్చున్నారనేగాని, ఢిల్లీ నగరాన్ని ఏ విధంగా మార్చాలనే దానిపై అరవింద్ కేజ్రీవాల్ ఎంతగా ఆలోచించినా దారి దొరకలేదు. మాటలు చెప్పినంత సులభం కాదు చేతల్లో చూపించడం అనేది ఆయనకు అర్థమైంది. ఈ సమయంలో తన గురువు అయితే ఏదో ఒక తరుణోపాయం చెబుతాడనుకుని అన్నాహజారేకు ఫోన్ చేసి తన సమస్యను చెప్పాడు. అవతల నుండి హజారే... మనం కొన్ని సమస్యలు పరిష్కరించాలంటే ముందుగా ఆ సమస్యలను మనం ఎదుర్కొని వుండాలి. నువ్వు ఢిల్లీ పరిపాలనలో సమర్థవంతంగా నెగ్గుకురావాలంటే నా మాట విని ఐఆర్ 20-420 మున్సిపల్ కార్పొరేషన్ ముదురు దోమలకు ప్రసిద్ధిగాంచిన నెల్లూరులో వారంరోజుల పాటు ఉండు... ముఖ్యంగా అక్కడి ఎమ్మెల్యే, స్టైల్ ఆఫ్ సింహపురి ఆనం వివేకానందరెడ్డి(64) పనితీరు పరిశీలించు... ఆయనను నువ్వర్థం చేసుకుంటే ఈ ప్రపంచంలోని రాజకీయాన్నంతా చదివేసినట్లేనని సలహా ఇచ్చాడు.

★★★★★

న్యూఢిల్లీ నుండి చెన్నై వెళ్లే తమిళనాడు ఎక్స్‌ప్రెస్ అప్పుడే సేఫ్‌గా వచ్చి నెల్లూరు రైల్వేస్టేషన్‌లో ఆగింది. అందులో నుండి అరవింద్ కేజ్రీవాల్‌తో పాటు ఆయన ఆరుగురు మంత్రివర్గసభ్యులు దిగారు. స్టేషన్ బయట కొచ్చి రెండు ఆటోలు కావాలన్నారు. ఆటో యూనియన్ నాయకుడొచ్చి... మీరు 7మందేకదా వుండేది, రెండు ఆటోలెందుకు ఒకటి సరిపోతుంది కదా అని అన్నాడు. దానికి అరవింద్... ఒక ఆటోలో ముగ్గురికి మించి పట్టరు కదా అని అడిగాడు. అందుకు అతను నవ్వి... మీరు నెల్లూరుకు కొత్తలా వున్నారు. ఒక ఆటోలో 7మందిని కాదు 17మందిని ఎక్కిస్తాం... ముందు మీరు ఆటో ఎక్కండంటూ అరవింద్ బృందాన్ని ఆటో ఎక్కించాడు. ఆటో రాకెట్ వేగంతో వెళుతుంటే అరవింద్ బృందం సభ్యుల ఒళ్లు హూనం కాసాగింది. ఆటోవాలా ఆత్మకూరు బస్టాండ్ అండర్‌బ్రిడ్జి వద్ద రాంగ్‌రూట్‌లో పోతుంటే... ఇది తప్పుకదా అని అరవింద్ కేజ్రీవాల్ అన్నాడు. దానికి ఆటోవాలా... ఇదే కరెక్ట్‌సార్, నెల్లూరు ట్రాఫిక్‌లో కరెక్ట్‌గా పోతేనే ప్రమాదాలు జరుగుతుంటాయని చెప్పాడు. అరవింద్ కేజ్రీవాల్ బృందం ట్రంకురోడ్డులోని ఓ హోటల్‌లో దిగింది. వీళ్లు రూంలోకి రావడమే తరువాయి వాళ్ల వళ్లంతా పాములు కరిచినట్లుగా మంట పుట్టసాగింది. ఆ బాధతో వాళ్ళు కెవ్... మంటూ అరిచారు. ఆ అరుపుకు హోటల్ రూంబాయ్ పరుగెత్తుకుంటూ వచ్చి, ఏమైందని అడిగాడు. తమను పాములేవో కరిచినట్లున్నాయని చెప్పారు. అందుకు ఆ రూంబాయ్ నవ్వి... అవి పాములు కాద్సార్... మా నెల్లూరు ముదురు దోమలు. మీరు నెల్లూరుకు కొత్తలాగుంది. రెండ్రోజులు ఉంటే అలవాటైపోతుందిలే అని సులభంగా చెప్పి వెళ్లిపోయాడు. అరవింద్ బృందం హోటల్‌లో స్నానం చేసి, టిఫిన్ కానిచ్చి మళ్లీ ఇంకో ఆటో ఎక్కి ఏ.సి సెంటర్‌లోని ఆనం కాంగ్రెస్ కార్యాలయం వద్దకు చేరుకుంది. అక్కడ ఎమ్మెల్యే పి.ఏ రాజును కలిసి ఎమ్మెల్యే ఎప్పుడొస్తారని అడిగారు. వచ్చే టైమయ్యిందని, కూర్చోమని రాజు వారికి చెప్పాడు. అంతలో నల్లద్దాలు, నల్లచొక్కా, నల్లబూట్లు, నల్లజీన్స్‌ప్యాంట్ వేసుకుని వివేకా అక్కడకు వచ్చాడు. అరవింద్ ఆయనను ఎమ్మెల్యే అనుకోలేదు. ఎమ్మెల్యేను కలిసి పోవడానికి వచ్చిన సినిమాయాక్టర్ అనుకున్నాడు. అయితే రాజు వచ్చి... ఆయనే ఎమ్మెల్యేగారు, కలవండని చెప్పడంతో అరవింద్ ఆశ్చర్యపోయాడు. తర్వాత వివేకాను కలిసి... మేం రాజకీయాలకు కొత్త అని, ఇక్కడ ఎలా నెట్టుకురావాలో చెప్పమని కోరాడు. అప్పుడు వివేకా... రాజకీయ మంటేనే లేనిది ఉన్నట్లు సృష్టించి దానిని మనమే లేకుండా చేయడం. ఈ దేశంలో ప్రజలు ఎవరి పని వాళ్లు చేసుకుంటే ఎవరికీ ఏ సమస్యా వుండదు. కాని వాళ్ల పనిని వాళ్లు చేసుకోనీయకుండా చేసి, వారి పనిని మనం చేయడమే రాజకీయం. ఉదాహరణకు ఎవడింటి ముందు చెత్త వాడు చిమ్ముకోగలడు, కాని వాళ్లింటి ముందు చెత్తను మనమే పోయాలి, దానిని మనమే ఎత్తేయాలి. అప్పుడే మనకు చేతి నిండా పని. మా నెల్లూరునే చూడండి... రోడ్లు లేని చోట కొత్త రోడ్లు వేస్తాం, రోడ్లున్న చోట వాటిని పగలగొడతాం... ప్రజల కోరిక మేరకు మళ్లీ అక్కడ రోడ్లు వేస్తాం. నగరం నిండా మురికిగుంటలు పెంచుతాం, తద్వారా ముదురుదోమలు ఉత్పత్తి అవుతాయి. ప్రజల కోరికమేరకు ఫాగింగ్ చేసి దోమల నిర్మూలనకు నడుం కడతాం. ఇక్కడ ఒక్కటే లాజిక్... ప్రజలకు మనమే సమస్యలను సృష్టించాలి... వాటిని మనమే పరిష్కరించాలి. ఆ సమస్యలే లేకుంటే మనకు పని లేదు. అసలు మనమనేదే లేకుండా ప్రజలకు సమస్యలు ఏమీ ఉండవని చెప్పాడు. వివేకా రాజకీయ బోధనతో అరవింద్‌లో విజ్ఞాన జ్యోతులు వెలిగాయి.

ఆ సమయంలో వివేకా ఆయన కళ్లకు అర్జునుడికి గీతను బోధిస్తున్న కళ్లద్దాలు పెట్టిన కృష్ణుడిలా కనిపించసాగాడు.

## కదంబం

### జ్ఞాపకాల్ని నెమరేస్తూ...!

ఏటూరి నాగేంద్రరావు,
నెల్లూరు, 74166 65323.

కాలం నే రాయని కవిత్వంలా
నన్ను దహించేస్తుంది!
ఎన్ని కష్టాలు!
ఎన్ని దుఃఖాలు!
ఎన్ని సముద్రాలు ఈదానో
ఎందరిచేత స్నేహింపబడ్డానో
ఎందరిచేత ద్వేషింపబడ్డానో
బాబూ!
ఇప్పుడు నన్ను ప్రశాంతంగా వుండమంటావా!
అయినా మనిషి వక్రబుద్ధి
ఎన్ని జ్ఞాన ప్రదర్శనలు చేస్తుందో!
అనుబంధాలను చూస్తే
కళ్ళు భయపడుతున్నాయ్!
వృద్ధాప్యం ఎదురొచ్చే వేళ
బెదిరిన నా మనస్సును సవరిస్తున్నకాలం!
నాన్నా! నిజంగా మనిషి ఎదిగాడా?
నాగరికతలన్నీ నరకబడి
విధ్వంసాల్ని కథల్లా చదువుకొంటున్నాను!
వెక్కి వెక్కి ఏడుస్తున్నాను
ఆకుల్లా రాలిపోయిన జ్ఞాపకాల్ని నెమరేసుకొంటూ!

## భగవద్గీత పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం

చిన్మయామిషన్ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా జరిగిన భగవద్గీత పఠన పోటీల్లో విజేతలకు డిసెంబర్ 29న నెల్లూరు పొదలకూరు రోడ్డులోని చిన్మయామిషన్ కార్యాలయంలో బహుమతులు ప్రదానం చేసారు. ఈ సందర్భంగా స్వామి నిర్మలానంద మాట్లాడుతూ నేటి విద్యార్థులు భగవద్గీత సారాంశాన్ని తెలుసుకోవలసిన అవసరం ఎంతైనా వుందని పేర్కొన్నారు. ఈ పోటీల్లో దాదాపు 2000మంది విద్యార్థులు పాల్గొనగా 12మంది విజేతలుగా నిలిచారని తెలిపారు.

## పోట్లూరు వెంకయ్య స్మారక సాహితీపురస్కారాలు

నెల్లూరు ఆదిత్యానగర్‌లోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో డిసెంబర్ 29న పోట్లూరు వెంకయ్యస్మారక సాహితీ పురస్కారాల ప్రదాన కార్యక్రమం జరిగింది. ఈ పురస్కారాలను నాగగాయత్రి, తిప్పావఝుల సుబ్రహ్మణ్యం, భూదేవమ్మలకు ప్రముఖ కథా రచయిత పోట్లూరు సుబ్రహ్మణ్యం సౌజన్యంతో సభకు అధ్యక్షత వహించిన తెలుగు భాషోద్యమ సమితి జిల్లా అధ్యక్షులు ఆచార్య ఆదిత్య, అల్లు భాస్కరరెడ్డి తదితరులు అందించారు. కార్యక్రమంలో జి.సుభద్రాదేవి, కొత్తగూడెంకు చెందిన రచయిత్రి జ్యోతి, పెరుగు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఎఫ్ఐ జిల్లా నూతన కమిటీ

భారతీయ విద్యార్థి సమాఖ్య(ఎస్ఎఫ్ఐ) నెల్లూరు జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు సుధీర్ తెలిపారు. డిసెంబర్ నెల 28, 29 తేదీల్లో ఆత్మకూరులో జరిగిన ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభల్లో కమిటీని ఎన్నుకోవడం జరిగిందన్నారు. జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా సుధీర్, కిరణ్‌ను ఎన్నుకుంటూ మరో అవకాశం కల్పించారన్నారు. నెల్లూరు జిల్లావ్యాప్తంగా 46 మండలాలకు సంబంధించిన 23 సభ్యులతో కూడిన కమిటీని ఎన్నుకున్నారు. నెల్లూరు నగర ఉపాధ్యక్షుడిగా ఎంవీ రమణను ఎన్నుకున్నట్లు తెలిపారు.

## ఆన్‌లైన్‌లో రక్తనిధి సమాచారం



రెడ్‌క్రాస్‌పై ప్రజల్లో వున్న అపోహలను తొలగించేందుకు రక్త నిల్వలకు సంబంధించిన సమాచారాన్ని ఆన్‌లైన్‌లో ఏర్పాటుచేసినట్లు నెల్లూరుజిల్లా జాయింట్ కలెక్టర్ బి.లక్ష్మీకాంతం పేర్కొన్నారు. నెల్లూరులోని మద్రాసుబస్టాండ్ సమీపంలో ఉన్న రెడ్‌క్రాస్ రక్తనిధి కేంద్రంలో రక్తనిల్వల సమాచారాన్ని ఆన్‌లైన్‌లో ఉంచేందుకు ఏర్పాటుచేసిన ప్రక్రియను సోమవారం జేసి ప్రారంభించి మాట్లాడుతూ రక్తనిల్వలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ప్రజలు ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు ఆన్‌లైన్ ఉపయోగపడుతుందన్నారు. పేదరోగులకు అవసరమైన వివిధ పరీక్షలను నోలాస్ నోగెయిన్ పద్ధతిలో రెడ్‌క్రాస్ కేంద్రంలో సెంట్రల్ లేబొరేటరీని ఏర్పాటుచేయబోతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కన్వీనర్ డాక్టర్ ఈదూరు సుధాకర్ వైద్యాధికారులు డాక్టర్ జూలియానా, డాక్టర్ పెంచలసుబ్బయ్య, మేనేజర్ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## క్యాలెండర్ ఆవిష్కరణ



నెల్లూరు నగరం రాజన్నభవన్‌లో వైయస్సార్‌సీపీ నెల్లూరుసిటీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ పి.అనిల్‌కుమార్‌యాదవ్ సోమవారం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. 10వడివిజన్‌కు చెందిన వైయస్సార్‌సీపీ అభిమాని పల్లం రవికుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 2014 క్యాలెండర్‌ను అనిల్‌కుమార్‌యాదవ్ ఆవిష్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

కార్యక్రమంలో సంక్రాంతి కళ్యాణ్, మునీర్‌సిద్ధిక్, ముప్పసాని శ్రీనివాసులు, లోకిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ముదిరెడ్డి లక్ష్మీరెడ్డి, పెళ్ళూరు శ్రీనివాసులు, గంధం సుధీర్‌బాబు, సగిలి జయరామిరెడ్డి, బి.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# కొత్త సంవత్సరంలో ప్రజలకు షాక్

- మళ్ళీ గ్యాస్‌ధర పెంపు
- వంటగ్యాస్‌కు 215రూ॥లు
- వాణిజ్యానికి రూ॥600లు



కొత్త సంవత్సరం ప్రారంభం రోజునే కేంద్ర ప్రభుత్వం ప్రజలకు షాకిచ్చింది. ఇప్పటికే ఎన్నోసార్లు వంటగ్యాస్ ధరలను పెంచిన కేంద్రప్రభుత్వం తాజాగా తన తడాఖా చూపించింది. సబ్సిడీయేతర గ్యాస్ ధరలను భారీగా పెంచుతూ బుధవారం నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఏడాదికి 9సిలిండర్లను సబ్సిడీపై పంపిణీచేస్తోంది. అంతకన్నా అదనంగా సిలిండర్‌ను వినియోగిస్తే ఇకపై 1325రూ॥లు చెల్లించాల్సిందే ఇప్పటి వరకు 1170గా ఉన్న ధరను ప్రభుత్వం ఒక్కసారిగా 215రూ॥లు పెంచింది. వాణిజ్య అవసరాలకు సంబంధించిన సిలిండర్‌ను 1750రూ॥లు నుంచి 2350రూ॥లుకు పెంచేసింది. ఇంత భారీగా గ్యాస్ సిలిండర్ల ధరలు పెంచడం పదేళ్లలో ఇదే మొదటిసారి.

# గ్రామ పరిపాలన బలోపేతానికి గ్రామ సభలు

## జిల్లా కలెక్టర్ శ్రీకాంత్



సమావేశంలో ప్రసంగిస్తున్న జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్

గ్రామ పరిపాలన బలోపేతం చేసేందుకే భారత రాజ్యాంగంలోని 243 ఆర్టికల్ ప్రకారం గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు నెల్లూరు జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ తెలిపారు. బుధవారం నెల్లూరు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. ఈనెల 2 నుంచి 11తేదీ వరకు ఈ సభలు జరుగుతాయన్నారు. ఈనెల 4వతేదీ నుంచి పకడ్బందీగా జరుపనున్నట్లు తెలిపారు. ఈ సభలకు గ్రామాల్లో ఓటరుగా ఉండేవారు అర్హులని తెలిపారు. ఏప్రిల్‌లో మరో సభలు నిర్వహిస్తామన్నారు. గ్రామ సభల్లో వివిధ శాఖలకు చెందిన 29 అంశాలు ఉంటాయని, ఈ అంశాలపై గ్రామ సభలు నిర్వహించి ఓటింగ్ ద్వారా అభిప్రాయాలు సేకరించి ప్రజల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. గ్రామ సభలకు సర్పంచి అధ్యక్షుడిగా వ్యవహరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు జాయింట్ కలెక్టర్ సిహెచ్ పెంచలరెడ్డి, జడ్పీ సిఇఓ జితేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# ప్రయాణీకులకు అత్యున్నత సేవలు

ప్రయాణీకులకు అత్యున్నత సేవలు అందిస్తామని, ప్రయాణీకులు సైతం ఆర్టీసీ బస్సులను ఆదరించి సురక్షిత, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని పొందాలని ఆర్టీసీ నెల్లూరు రీజియన్ మేనేజర్ రవికుమార్ అన్నారు. నెల్లూరు ప్రధాన ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో నూతన సంవత్సర వేడుకలను బుధవారం ప్రయాణీకుల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ప్రయాణీకురాలిచే కేక్‌ను కట్ చేయించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ సుబ్రమ్మణ్యం, అసిస్టెంట్ మేనేజర్ వీరాస్వామి, సీఆర్‌సీ రవీంద్రబాబు, కార్మికులు, ప్రయాణీకులు పాల్గొన్నారు.

# పాత్రికేయుల విలువలు పెంచేందుకే "ప్రెస్ స్టిక్కర్లు"



పాత్రికేయుల విలువలు పెంచేందుకే ప్రెస్ స్టిక్కర్లు జారీ చేస్తున్నామని నెల్లూరు జిల్లా ఎస్పీ పివియస్ రామకృష్ణ పేర్కొన్నారు. నెల్లూరు నగర డిఎస్పీ వెంకటనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం పోలీసు పేరాడుగ్రౌండ్‌లో గుర్తింపు కలిగిన పాత్రికేయులకు మొదటి విడతగా ప్రెస్ స్టిక్కర్లు జారీ చేసారు. ఎస్పీ స్వయంగా కొంత మంది వాహనాలకు స్టిక్కర్లు అతికించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ప్రెస్ పేరుతో పలువురు అక్రమార్కులు, నేరస్తులు, స్మగ్లర్లు తమ వాహనాలకు "ప్రెస్ స్టిక్కర్లు" అతికించుకుని తిరుగుతున్నారని, వారిని గుర్తించి చర్యలు తీసుకునేందుకు, నేరాలను నియంత్రించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

ఈ నెలాఖారులోగా జిల్లాలో గుర్తింపు పొందిన పాత్రికేయులందరికీ స్టిక్కర్లు అందజేస్తామన్నారు. ఈ లోపు నకిలీలను గుర్తించి చర్యలు తీసుకుని క్రిమినల్ కేసులు పెడతామన్నారు. అక్రిడిటేషన్, డ్రైవింగ్ లైసెన్స్ బండి ఆర్సీ ఆధారంగా స్టిక్కర్లును రూపొందించినట్లు తెలిపారు. నకిలీలు తయారు చేసేందుకు వీలు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రతి జర్నలిస్టు వాహనానికి స్టిక్కర్లు ఇస్తామని, దీని కాలపరిమితి ఏడాది పాటు ఉంటుందని వివరించారు. తర్వాత రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నగర సిఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

## ప్రభుత్వానికి కృతజ్ఞతలు

రాష్ట్ర ప్రభుత్వ పింఛన్‌దారులకు 27శాతం మధ్యంతర భృతిని పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లాశాఖ అధ్యక్షులు కె.మోహన్‌రావు, కార్యదర్శి టి.కొండాచారి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం వల్ల జిల్లాలో 30వేల మంది పెన్షన్‌దార్లు లబ్ది పొందనున్నారని వారు వెల్లడించారు. ఈ కీలక నిర్ణయం తీసుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రికి, రాష్ట్ర ఆర్థికమంత్రికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

# కీలక దశకు క్రీడ

(మొదటిపేజీ తరువాయి)

అంశంగా మారింది. ఇదొక ఎత్తయితే విభజన బంతిని మిగతా పార్టీలు కూడా ఏ రకంగా తన్నాలో ఆ రకంగా తన్నుతూ క్షణక్షణం గేమ్‌లో కోణాలను మార్చేస్తున్నాయి. గేమ్‌ను మొదలుపెట్టిన కాంగ్రెస్ అధిష్టానానికే అంతుబట్టని విధంగా ఆట రూపురేఖలను మారుస్తున్నాయి. ఈ గేమ్‌లో కీలక ఆటగాడు కేసీఆర్. ఆయనను లక్ష్యంగా చేసుకునే కాంగ్రెస్ విభజన ఆటను మొదలుపెట్టింది. తెలంగాణ ఇస్తే కేసీఆర్ తన పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేయాలి. లేదంటే కనీసం పొత్తయినా పెట్టుకోవాలి. ఈ రెండింటికి కేసీఆర్ సిద్ధంగా లేడు. కాంగ్రెస్‌లో తన పార్టీని విలీనం చేస్తే చిరంజీవిలాగా టెన్‌జనపథ్ ముందు తాను కూడా చేతులు కట్టుకుని నిలబడాల్సి వస్తుందని కేసీఆర్‌కు తెలుసు. అలా నిలబడాల్సిన ఖర్మ నాకేంటనేది కేసీఆర్ ఆలోచన. అలాగని పొత్తు కూడా ఇష్టం లేదు. కాంగ్రెస్‌తో పొత్తు అంటే కేసీఆర్‌ను నమ్ముకుని టీఆర్ఎస్‌లో చేరిన చాలామంది నాయకులకు సీట్లు ఎగ్గొట్టాల్సి వస్తుంది. అదే తెలంగాణలో టీఆర్ఎస్ ఒంటరిగా పోటీ చేస్తే పదికి పైనే ఎంపీ సీట్లు వస్తాయనే ధీమా ఉంది. అప్పుడు కేంద్రంలో చక్రం తిప్పొచ్చనేది కేసీఆర్ ఆలోచన.

ఈ ఆటలో వైకాపా అధినేత వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డిది విభిన్నమైన ప్లాన్. విభజన ప్రక్రియలో సంపూర్ణంగా సమైక్యాంధ్ర వైపు నిలిచింది ఆయనే! జగన్ సమైక్యవాదం వినిపిస్తున్నా విభజన జరిగితే లాభపడేది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీయే. విభజన జరిగితే సీమాంధ్రలో జగన్ పార్టీకి తిరుగుండదు. మంచి మెజార్టీతోనే అధికారాన్ని కైవసం చేసుకుంటుంది. అదే విభజన జరగకపోతే, ఇప్పుడున్న రాష్ట్రంలోనే ఎన్నికలు జరిగితే పూర్తి మెజార్టీ కోసం కొంత ప్రయాస పడక తప్పదు. ఎందుకుంటే తెలంగాణలో వైకాపా బాగా మైనస్‌లో పడుతుంది. అయినా జగన్ సమైక్యాంధ్రనే కోరుకుంటున్నాడంటే సీమాంధ్రలో స్వీప్ చేసే వ్యూహమే. ఈ మొత్తం క్రీడలో ఏ విధంగా ఆడాలో తెలియక, బంతిని గోల్ లోకి తానే తన్నుతూ, అదే బాల్‌ను తన కాలితోనే ఆపుతూ అటూ ఇటూ కాకుండా రెండింటికి చెడిన రేవడిలా మారిన నాయకుడు చంద్రబాబునాయుడు. ఈ గేమ్‌లో ఆయన పాత్ర ఏంటనేది జనాలకు అర్థం కావడం లేదు. ఒకరకంగా ఆయనకు అర్థం కావడం లేదు. ఆ పక్క తెలంగాణ కావాలంటున్నాడు, ఈ పక్క కొచ్చి సమన్యాయం అంటున్నాడు. కేంద్రం తీసుకొచ్చిన టి-బిల్లును గట్టిగా వ్యతిరేకించలేకపోతున్నాడు. అలాగని పూర్తిగా సమర్ధించలేకపోతున్నాడు. ఆయన పరిస్థితి పగవాళ్లకు కూడా రాకూడదనిపిస్తుంది.

విభజన గేమ్ రసవత్తరంగా సాగుతుంది. ఇప్పటికి మొదటి స్పెల్ మాత్రమే ముగిసింది. రాష్ట్ర అసెంబ్లీకి బిల్లు రావడం వరకు కాంగ్రెస్ అధిష్టానందే విజయం. ఇక్కడ నుండి ఎవరు వేగంగా ఆడితే వారిదే విజయం.

# చంద్రబాబు సియం కావడం ఖాయం

నూతన సంవత్సరం 2014ను పురస్కరించుకుని బుధవారం నెల్లూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తెలుగుయువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్‌ను టిడిపి జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బీద మాట్లాడుతూ చంద్రబాబు సిఎం కావడం ఖాయమన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి కార్యకర్త కష్టపడి పని చేస్తే తప్పకుండా తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఎర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్‌రెడ్డి, తెలుగుయువత జిల్లా సమన్వయ కార్యదర్శి కె.ఎస్.మోహన్, ఉపాధ్యక్షులు జలదంకి సుధాకర్, ప్రభాకర్‌నాయుడు, టిడిపి అధికార ప్రతినిధి జడ్.శివప్రసాద్, నెల్లూరు రూరల్ కన్వీనర్ కిలారి వెంకటస్వామినాయుడు పాల్గొన్నారు.

# కెప్టెన్ ఇన్నింగ్స్

(మొదటిపేజీ తరువాయి)

ఈ బిల్లుపై చర్చించి తిరిగి పంపడానికి రాష్ట్రపతి ఆరు వారాల గడువిచ్చారు. శీతాకాల సమావేశాల ప్రారంభంలోనే ఈ బిల్లును చర్చకు చేపట్టాల్సిన అవసరం లేదు. అయితే శాసనసభ సమావేశాలు ప్రారంభమైన రెండోరోజు ఆరోగ్య కారణాలతో ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి సభకు హాజరు కాలేదు. ఆరోజే తెలంగాణ బిల్లు ప్రతులను సభలో పంచి తెలంగాణ బిల్లుపై చర్చ మొదలైనట్లేనని శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు ప్రకటించారు. సీఎం సభకు రాకపోవడం, చర్చ ప్రారంభమైనట్లు శ్రీధర్‌బాబు ప్రకటించడంతో కిరణ్‌పై విమర్శలు వెల్లువెత్తాయి. అధిష్టానం ఆడించినట్లే ఆయన కూడా ఆడుతున్నాడని, అందుకే కీలక సమయంలో సభకు రాలేదని ఆరోపణలు చుట్టుముట్టాయి. వీటికి శ్రీధర్‌బాబు వైఖరే కారణమనే ఆగ్రహంతో కిరణ్ ఉన్నాడు. ఇటీవల శాసనసభ ప్రోరోగ్ ఫైల్ కూడా శ్రీధర్‌బాబు సీఎంకు పంపకుండా తన వద్దే పెట్టుకోవడం వివాదానికి దారి తీసింది. తనకంటే తెలంగాణ అంశానికే ఎక్కువ ప్రాధాన్యత నిస్తూ, తద్వారా తనను అన్‌పాపులర్ చేస్తున్న శ్రీధర్‌బాబుకు చెక్ పెట్టాలని కిరణ్ ఆయన శాఖనే మార్చాడు. నేటి నుండి బిల్లుపై చర్చ మొదలుకానున్న తరుణంలో ఈ మార్పు చాలా కీలకంగా మారింది. శ్రీధర్‌బాబును ఈ శాఖ నుండి తప్పించి దానిని శైలజానాథ్‌కు అప్పగించడం ద్వారా శాసన సభ వ్యవహారాల ప్రక్రియను నిర్వహించే బిజినెస్ అడ్వయిజరీ కమిటీ(బిఏసి)లోనూ మార్పులు చోటుచేసుకోబోతున్నాయి. ఇంతవరకు బిఏసిలో తెలంగాణ తరపున నలుగురు, స్పీకర్‌ను కలుపుకుని సీమాంధ్ర తరపున నలుగురు సభ్యులున్నారు. స్పీకర్ తటస్థంగా ఉండాలి కాబట్టి బిఏసి నిర్ణయాలలో తెలంగాణ వారిదే పైచేయిగా ఉండేది. ఇప్పుడు శ్రీధర్‌బాబును తొలగించడంతో స్పీకర్‌ను కలుపుకుని సీమాంధ్ర నేతల సంఖ్య 5కు పెరగగా, తెలంగాణవాళ్ల సంఖ్య 3కి పడిపోయింది. స్పీకర్‌ను పక్కన పెట్టినా సీమాంధ్ర వారిదే పైచేయిగా ఉంటుంది.

బిల్లుపై చర్చకు రేపు శైలజానాథ్ ప్రారంభిస్తారు. చర్చ పూర్తయ్యాక రాష్ట్రపతికి సభ్యుల అభిప్రాయాలను క్రోడీకరించి పంపాల్సింది శాసనసభ వ్యవహారాల మంత్రే. కాబట్టే సీఎం సమైక్యవాదానికి అనుకూలంగా ఉండేలా శైలజానాథ్‌ను పెట్టుకున్నారు.

ఈ పరిణామంతో తెలంగాణ నాయకులు తెల్లబోయారు. కిరణ్ వైఖరి ఇక తాడోపేడో తేల్చుకోవాలన్నట్లుగానే ఉంది. కాబట్టే అధిష్టానం అనుమతి లేకుండా తెలంగాణవాళ్లకు ఈ ఝలక్ ఇచ్చాడు. మొత్తానికి కిరణ్ కెప్టెన్‌గా బరిలోకి దిగాడు. ఇన్నింగ్స్‌ను సమర్ధవంతంగా ఆడి విభజనను అడ్డుకుంటాడో, లేక హిట్‌వికెట్‌గా వెనుదిరుగుతాడో చూడాలి.

# పుంజుకుంటున్న 'దేశం'

(2వ పేజీ తరువాయి)

అదే తెలుగుదేశం అభ్యర్థిగా అయితే ఖచ్చితంగా గట్టిపోటీ ఇస్తాడు. నెల్లూరునగర తెలుగుదేశంకు అతనే సరైన అభ్యర్థి. నెల్లూరు తూర్పు ప్రాంతంలో తెలుగుదేశంకు సాంప్రదాయబద్ద ఓటుబ్యాంకు ఉంది. శ్రీధరకృష్ణారెడ్డికి సొంత పరపతి ఉంది. కాబట్టి నగర తెలుగుదేశంకు మంచి నాయకుడు దొరికినట్లే.

2004లో తెలుగుదేశంలో టిక్కెట్ రాదని తెలిసాక కాంగ్రెస్‌లోకి జంప్ చేసి కోవూరు టిక్కెట్‌ను ఒడిసిపట్టి, లక్కీగా ఎమ్మెల్యే అయిన నాయకుడు పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి. 2009లోనూ, ఆ తర్వాత జరిగిన ఉపఎన్నికలలోనూ ఆయన కాంగ్రెస్ అభ్యర్థిగానే పోటీచేసి పరాజయం పొందారు. ఇక కాంగ్రెస్‌కు, ఆ పార్టీనే నమ్ముకుంటే తనకూ భవిష్యత్ ఉండదనుకున్న పోలంరెడ్డి తిరిగి తెలుగుదేశంలోకి రావడానికి సన్నద్ధమవుతున్నాడు. అయితే కోవూరు సీటు గ్యారంటీ ఇస్తేనే ఆయన 'దేశం'లో చేరాలనుకుంటున్నారు. అక్కడ ఇప్పటికే పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి, వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డిలు టిక్కెట్‌రేసులో ఉన్నారు. ఈ నేపథ్యంలో సీటిస్తానని చంద్రబాబు స్పష్టమైన హామీ ఇస్తేనే ఆయన సైకిల్ ఎక్కాలనుకుంటున్నారు.

మొత్తానికి కాంగ్రెస్ పతనం తెలుగుదేశంకు నాయకుల కొరతను భర్తీ చేస్తుంది.


**బాండు పోయినది**

నా యొక్క పీర్‌లెస్ జనరల్ ఫైనాన్స్ వెల్ఫేర్ ఎండోమెంట్ సర్టిఫికేట్ నెం. A9-17000526 పోయినది. ఈ సర్టిఫికేట్ ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్సు వారికి తెలియజేయ వలసినదిగా కోరుతున్నాము.

సందిగం జానకి
8/29, రంగనాయకులపేట, నెల్లూరు.

## చెన్నైలో చందూర్ పురస్కార ప్రదానోత్సవం





ఎస్.ఆర్.చందూర్ జగతి శ్రీమతి మాలతీచందూర్ పురస్కారాల ప్రదానోత్సవం ఈనెల12న చెన్నై మైలాపూర్‌లోని రాయపేట హైరోడ్డులోగల విద్యామందిర్‌స్కూల్ శ్రీ పాదహాల్‌లో అమరజీవి పొట్టి శ్రీరాములు మెమోరియల్ సొసైటీ, చందూర్ కుటుంబం, స్నేహితుల సంయుక్త నిర్వహణలో జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. హెచ్.ఎం.టీవీ సంపాదకులు, ముఖ్యకార్యనిర్వాహణాధికారి డా॥కె.రామచంద్రమూర్తికి ఎన్.ఆర్.చందూర్ జగతి పురస్కారాన్ని, ప్రముఖ రచయిత్రి డా॥సి.ఆనందరామంకు శ్రీమతి మాలతీ చందూర్ పురస్కారాన్ని ప్రదానం చేస్తామని తెలిపారు.

కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కేంద్ర మానవవనరులశాఖ మంత్రి డా॥ దగ్గుబాటి పురందేశ్వరి, గౌరవఅతిథులుగా పద్మశ్రీ డా॥యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, "స్వాతి" వారపత్రిక సంపాదకులు వేమూరి బలరామ్, అమరజీవి పొట్టిశ్రీరాములు మెమోరియల్ సొసైటీ అధ్యక్షులు ఎం.వి.నారాయణగుప్తాలు పాల్గొంటారని తెలిపారు.

### మానసిక ఉల్లాసాన్ని కలిగించిన...

## "భామాకలాపం"




కళలలో ప్రతిభను కనబరిచే యువ కళాకారులకు తగిన వేదికను ఏర్పరిచి ప్రోత్సహించే సత్సంప్రదాయమున్న కళాంజలి సాంస్కృతిక సంస్థ డిసెంబరు నెల 28న నెల్లూరు పురమందిరంలో యువ నృత్య కళాకారుడైన కె.ఆదర్శ్ నాయర్‌చే ప్రదర్శింపజేసిన "భామాకలాపం" నృత్య ప్రదర్శన చూపరులను ఇట్టే కట్టిపడేసింది. నెల్లూరుజిల్లా విడవలూరు నివాసి ఆదర్శ్ సత్యభామగా, హైదరాబాద్‌కు చెందిన నృత్యకళాకారిణి కిల్లి శారద శ్రీకృష్ణుడుగా చేసిన అభినయం అందరినీ అలరించింది. "కళాంజలి" అనంత్ నిర్వహణలో ఈ నృత్యప్రదర్శన నెల్లూరులోని రసజ్ఞులకు మంచి మానసిక ఉల్లాసాన్ని కలిగించింది. కార్యక్రమంలో పురప్రముఖులు వీరిశెట్టి హజరత్‌బాబు, బి.వి.నరసింహం, ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాల ప్రిన్సిపాల్ సి.మునికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ సేవలకు రోటరీ అవార్డులు



నెల్లూరు రోటరీక్లబ్ వారు ప్రభుత్వ ఉద్యోగులందించిన సేవలను గుర్తించి ప్రతి ఏటా ఇస్తున్న ఒకేషనల్ అవార్డులను ఈనెల 1న 2013-14సంవత్సరంలో ఉత్తమ సేవలందించిన వివిధశాఖలలోని ఉద్యోగులకు అందించారు. ఆర్.టి.సిలో ఉత్తమ డ్రైవర్‌గా ఎస్.కె.బాబు, తపాలాశాఖలో ఉత్తమ పోస్ట్‌మెన్‌గా డి.మాలకొండయ్య, పోలీసుశాఖలో ఉత్తమ ట్రాఫిక్ కానిస్టేబుల్‌గా జి.సుబ్బరాజు, 108కి సంబంధించి ఉత్తమ ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్‌గా వై.నాగరాజు, వైద్యశాఖలో ఉత్తమస్టాఫ్‌నర్స్‌గా డి.సుశీల, మున్సిపాలిటీలో ఉత్తమ స్వీపర్‌గా వై.మస్తాన్‌లకు 2వేల నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రాలను అందించి అభినందించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షులు టి.శేఖర్, కార్యదర్శి కె.ప్రతాప్‌కుమార్‌రెడ్డి, పలువురు రొటేరియన్లు పాల్గొన్నారు.

## పాల సేకరణ ధరలు పెంపు



నెల్లూరులోని విజయా డెయిరీకి పాలు సరఫరా చేస్తున్న ఉత్పత్తిదారులకు కొనుగోలు ధర పెంచినట్లు నెల్లూరుజిల్లా పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సమితి (విజయ డెయిరీ) ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి తెలిపారు. నెల్లూరుజిల్లాలోని నెల్లూరు డెయిరీ, కావలి, దుత్తలూరు, వెంకటగిరి, ఆదూరుపల్లి, నెల్లూరుపాళెం, దొరవారిసత్రంలోని పాల శీతలీకరణ కేంద్రాలకు పాలు అందించే రైతులకు ప్రస్తుతం గేదె పాలు కిలో వెన్నకు 440ఇస్తుండగా జనవరి 1 నుంచి 460 ఇస్తున్నట్లు తెలిపారు. ఆవు పాలు కిలో ఘనపదార్థానికి ప్రస్తుతం ఇస్తున్న 170 నుంచి 180రూ॥లుకు పెంచినట్లు తెలిపారు. 10శాతం వెన్న లీటరు గేదెపాలుకు 45.90 రూ॥లు, 5శాతం వెన్నగల గేదెపాలకు 22.95రూ॥లు చెల్లిస్తున్నట్లు వివరించారు. జిల్లాలో ప్రస్తుతం రోజుకు సగటున 29వేల లీటర్లను సేకరిస్తున్నట్లు తెలిపారు. దాదాపు 25వేల మంది రైతులు పాడితో ఉపాధి పొందుతున్నారని ధరలు పెంపువల్ల ఒక్కో లీటరుకు (10శాతం) వెన్నగల పాలకు 2రూ॥లు, 6శాతం వెన్నపాలకు 1.50పైసలు పెరిగిందని వెల్లడించారు.

## చంద్రబాబును విమర్శించే స్థాయి జగన్‌కు లేదు



అవినీతి కేసులతో జైసుకెళ్ళి బెయిల్ కోసం సోనియాను నెత్తి మీద, రాహుల్‌ను భుజాల మీద మోస్తున్న జగన్‌కు చంద్రబాబును విమర్శించే స్థాయి లేదని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర ధ్వజమెత్తారు. నెల్లూరులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో డిసెంబర్ 31వ తేదీ విలేకర్లతో మాట్లాడారు. ప్రజా గర్జన సదస్సులు విజయవంతమవడంతో చంద్రబాబునాయుడిపై అనవసర ఆరోపణలు చేస్తున్నారన్నారు. తెలంగాణ వచ్చేందుకు బీజం వేసింది వైయస్సారేనన్నారు. రానున్న ఎన్నికల్లో జిల్లాలోని పది అసెంబ్లీ స్థానాలను గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా వున్నారన్నారు. తెలుగుదేశం పార్టీ నగర అధ్యక్షుడు కోటంరెడ్డి శ్రీనివాసురెడ్డి మాట్లాడుతూ నెల్లూరు, చిత్తూరు జిల్లా ఎస్పీలు పోలీసులకు వారాంతపు సెలవులు ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని, రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో కూడా ఇది అమలయ్యేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేసారు.

ఈ సమావేశంలో మాజీమంత్రి, తెలుగుదేశం పార్టీ నగర కన్వీనర్ టి.రమేష్‌రెడ్డి తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు అంచెల వాణి, రూరల్ నియోజకవర్గ పార్టీ కన్వీనర్ కిలారి వెంకటస్వామినాయుడు, బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు అన్నం దయాకర్‌గౌడ్, ధర్మవరం సుబ్బారావు, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కాకర్ల తిరుమలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

### అంతర్జాతీయ సదస్సుకు

## డా॥జగదీష్



ప్రత్యామ్నాయ ఇంధన వనరుల నిపుణుడు, నెల్లూరులోని "నాయుడమ్మ సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆల్టర్‌నేటివ్స్" డైరెక్టర్, ప్రముఖ శాస్త్రవేత్త డా॥ ఎ.జగదీష్ కేరళలోని త్రిసూర్ విద్యా అకాడమి ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో ఈ నెల 6 నుండి 7వ తేదీ వరకు జరిగే 3వ అంతర్జాతీయ పవర్, కంట్రోల్, సిగ్నల్స్ అండ్ కంప్యూటేషన్ సదస్సులో కీ నోట్ ఉపన్యాసం ఇచ్చేందుకు ప్రత్యేక ఆహ్వానం అందుకున్నారు. ఈ సదస్సులో పలు దేశాల నుండి శాస్త్రవేత్తలు పాల్గొంటున్నారు.

కెనడా రాజధాని అట్టావాలో ఈ ఏడాది ఆగష్టు 26 నుండి 28వ తేదీ వరకు జరిగే వాటర్, ఇన్‌ఫర్‌మేటిక్స్, సస్టైనబులిటి అండ్ ఎన్విరాన్‌మెంట్ అంతర్జాతీయ సదస్సులో కూడా డా॥ జగదీష్ పాల్గొంటారు. డా॥జగదీష్ ప్రత్యామ్నాయ ఇంధన వనరులు, అప్రాప్రియేట్ టెక్నాలజీలలో విశేష కృషిచేశారు. అంతర్జాతీయ, జాతీయ, వైజ్ఞానిక పత్రికలలో 140కి పైగా పరిశోధనా పత్రాలను ప్రచురించారు. నలబై దేశాలలో జరిగిన అంతర్జాతీయ వైజ్ఞానిక సదస్సుల్లో పాల్గొని తన పరిశోధనలను సమర్పించారు. ప్రతిష్టాత్మక మార్గరెట్ నోబుల్ ఫౌండేషన్, సీటెల్, అమెరికా అవార్డుతో పాటు 15 అంతర్జాతీయ, జాతీయ అవార్డులను డా॥జగదీష్ అందుకొనిఉన్నారు.

## ఫ్రెండ్స్ వాకర్స్ నూతన సంవత్సర వేడుకలు




నెల్లూరు దర్గామిట్టలోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు డిసెంబర్ నెల 31వ నూతన సంవత్సర వేడుకలను ఉత్సాహంగా జరిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బి.మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో జరిగిన సంఘటనలను, అనుభవాలను సానుకూలంగా తీసుకొని రాబోవు కొత్త సంవత్సరంలో వాటిని పునాదులుగా చేసుకొని ఆనందమయ జీవితానికి బాటలు వేసుకోవాలన్నారు. తదుపరి అసోసియేషన్ ఉపాధ్యక్షులు సుబ్బారావు కేక్ కట్ చేసి సభ్యులందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో కార్యదర్శి గోవర్ధన్, కోశాధికారి సుబ్బారావు, సభ్యులు సుబ్బరామిరెడ్డి, డా॥ సూర్యనారాయణ, లక్ష్మణరాజు, రామ్మోహన్, పరంధామయ్య, లక్ష్మయ్య, నరసింహామూర్తి తదితరులు పాల్గొన్నారు.

## జూనియర్ ఛాంబర్స్‌కు జాతీయ అవార్డు




జూనియర్ ఛాంబర్స్ ఆఫ్ ఇంటర్నేషనల్, నెల్లూరు విభాగానికి జాతీయ అవార్డు లభించిందని సంస్థ మాజీ అధ్యక్షుడు తవ్వా శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. మధురైలో డిసెంబర్ 27 నుంచి జరుగుతున్న జాతీయస్థాయి సమావేశాల్లో జాతీయ అధ్యక్షుల చేతుల మీదుగా అందుకున్నట్లు తెలిపారు. నెల్లూరు నగరపాలక పాఠశాలల్లో పదవ తరగతి చదివి 90శాతంపైగా మార్కులు తెచ్చుకున్న విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ప్రదానం చేశామన్నారు. కార్యక్రమంలో జోన్ ఉపాధ్యక్షుడు చింతా మధుబాబు, అధికారి గుండపల్లి మధు రవీంద్ర, సూర్యప్రకాష్, జేసీరెట్స్ మాజీ అధ్యక్షులు తవ్వా యోగవల్లి పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో గో సర్వాంగపూజ



నెల్లూరు ఏసీనగర్‌లోని వివేకానంద ఇంగ్లీషు మీడియం స్కూల్లో ఆదివారం గోసర్వాంగ పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు, గోమాతను పూజించి, గోవులకు చిన్నారులు ఫలాలు అందించారు. పసుపు, కుంకుమ పుష్పాలతో అలంకరించారు. తొలుత గోమాత శోభాయాత్ర వేడుకగా జరిగింది ఏసీనగర్, బాలాజీనగర్ తదితర ప్రాంతాల్లో ఊరేగింపుగా సాగింది. భక్తులు తమ నివాసాల వద్ద విశేష పూజలను నిర్వహించారు. పంచలోహాలతో కూడిన గోమాత ఉత్సవమూర్తులను పంచామృతం, సుగంధద్రవ్యాలతో అభిషేకించారు. పాఠశాల వ్యవస్థాపక అధ్యక్షుడు యలమందయ్య, అధ్యక్షుడు డాక్టర్ సివీ సుబ్రహ్మణ్యం, కరస్పాండెంట్ శివరామ్‌ప్రసాద్, భక్తులు పాల్గొన్నారు.

## రాష్ట్ర విభజన నిరసన ర్యాలి




సమైక్యాంధ్ర ఉద్యమనేత ఆనం జయకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరు రూరల్‌లోని 30వ డివిజన్ మహాత్మాగాంధీనగర్ రాష్ట్ర విభజన నిరసన ర్యాలీ సమావేశం నిర్వహించారు. ఆనం జయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాజకీయ పార్టీల బాధ్యతారాహిత్యం వల్ల రాష్ట్రానికి ఈ పెనుగండం దాపురించిందని, విభజనను అందరూ స్పష్టంగా వ్యతిరేకించి ఉంటే ఈ పరిస్థితి వచ్చి ఉండేది కాదని అన్నారు. విభజన బిల్లు వివిధ దశలు దాటుకొని మన అసెంబ్లీకి చేరిన ఈ సందర్భంలోనైనా అన్ని రాజకీయ పార్టీలు ఏకతాటి మీదకు వచ్చి దీనిని ఎదిరించాలన్నారు. విద్యార్థులకి, వ్యాపారస్తులకు, ఉద్యోగులకు, రైతులకు, కార్మికులకు ఇలా ఏ వర్గానికీ ఉపయోగం లేని ఈ విభజనను అడ్డుకోవాలన్నారు. కార్యక్రమంలో గాంధీనగర్ నాయకులు రియాజ్, వెంకటేశ్వర్లు మేస్త్రి, వీరయ్య, చంద్ర, విజయకుమార్, జె.శ్రీనివాసులురెడ్డి, ఏసునాయుడు, ఖాన్, ఆర్.ఎస్.ఆర్, కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మేషం


అశ్వని, భరణి, కృత్తిక 1 పాదము

ఈ రాశి వారికి ఆర్థికంగా పెద్ద ఇబ్బందులు లేకుండినా అసంతృప్తి ఉంటుంది. ఖర్చులు అదనంగా ఉండి, దాచుకున్నది ఖర్చుచేయడమో, ఋణం చేయడమో ఉంటుంది. వృత్తిపరంగా సామాన్య ఆదాయం, వ్యాపారాలలో స్వల్ప సంతృప్తి ఉంటుంది. స్థిరాస్తుల లావాదేవీలు వాయిదావేయడం మంచిది. దూర ప్రయాణాలుంటాయి. ఆరోగ్యం జాగ్రత్తగా కాపాడుకోవాలి.

## వృషభం


కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

సొంత పనులు, అనుకున్న కార్యక్రమాలు సరిగా సాగవు. వృత్తి వ్యాపారాలు సంతృప్తికరంగా ఉండవు. ఆడంబరాలకు, పొగడ్తలకుపోయి ఖర్చులు పెంచుకుంటారు. ఆర్థికాభివృద్ధి అవకాశాలు ఈవారంలో సరిగా ఉండవు. బిడ్డల విద్యా వివాహ ఉద్యోగ విషయాలలో శుభపరిణామాలుండగలవు. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. బంధుమిత్రులు కలుసుకొంటారు.

## మిథునం


మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ఆర్థికంగా ఇబ్బందులనెదుర్కొనవలసి ఉంటుంది. అయినా ఆదాయానికి లోపం రాదు. వృత్తి వ్యాపారాల నిర్వహణ ఆదాయాలలో ఆశించినంత ఫలితం ఉండదు. బంధుముఖ్యులకు అనారోగ్య బాధలుంటాయి. కోర్టు వ్యవహారాలు వాయిదా పడగలవు. స్థిరాస్తులు పెట్టుబడులపై ఆదాయము బాగుంటుంది. పట్టువిడుపు ధోరణి సమస్యలను పరిష్కరించుకొనాలి.

## కర్కాటకం


పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

వస్త్రాభరణ ఫలసరుకుల నిర్మాణ వస్తువుల వ్యాపారులకు ఆదాయం పెరుగుతుంది. ఆర్థికాభివృద్ధి ఉంటుంది. మిగిలిన వ్యాపారాలు, వాణిజ్య ఏజెన్సీలకు సామాన్యంగా రాబడి ఉంటుంది. వృత్తిజీవనము కలవారికి అవకాశాలు పెరుగుతాయి. బుధ, గురు వారాల నుండి షేర్లులో పెట్టుబడులు, ఇతర పెట్టుబడులకు అవకాశాలు బాగుంటాయి. స్థిరాస్తుల నిర్ణయాల మీద ఆచితూచి వ్యవహరించండి.

## సింహం


మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

శాస్త్ర సాంకేతికరంగాల ఉద్యోగులకు శ్రమ పనిభారం పెరుగుతుంది. ఇంటాబయట వ్యవహారాలను ఓర్పు, ఓపికతో నడపండి. పెండింగ్‌లోగల పనులు మరల కొనసాగుతాయి. వృత్తిపరంగా వ్యాపకం, రాబడి ఉంటుంది. వస్తు వాహన రిపేర్లు, గృహ మరమ్మత్తులుండవచ్చును. క్రొత్త పెట్టుబడులకు అవకాశాలు, నూతన వ్యాపార ఆలోచనలు కలుగుతాయి.

## కన్య


ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

హడావుడి పనులు జరపడం, మాటలు చెప్పడం చేయవద్దు. ఆర్థికంగా బాగుంటుంది. ముందు మీరు ప్రవేశపెట్టిన ప్రణాళిక ఆలోచనలు కార్యరూపం దాల్చి ఆర్థికస్థితిని వృద్ధిపరుస్తాయి. వృత్తిపరంగా గుర్తింపు గౌరవాలుంటాయి. ఉద్యోగులకు పనిసామర్థ్యం, అధికారుల సహకారం బాగుంటుంది. కుటుంబ సభ్యులతో అనుకూలత సరిగా ఉండదు.

## రాశి - మీ వాసి


బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

తేది. 03.01.2014 నుండి
తేది. 09.01.2014 వరకు

ఈ వారం మకరకుంభమీనమేషరాశులలో చంద్రుడు, మేషంలో కేతువు, మిథునంలో గురువు, కన్యలో కుజుడు, తులలో శనిరాహువులు, ధనుస్సులో రవిబుధులు, మకరంలో శుక్రుడు, 6తేది నుండి ధనుస్సులో శుక్రునకు వక్రగతి, 8తేది నుండి మకరంలో బుధుడు సంచరిస్తారు.

### పంచాంగము:

ధనుర్మాస సహిత పుష్యమాసము కావున శూన్యమాసము.
తేది 6.1.2014 నుండి శుక్రమౌఢ్యమి ప్రారంభం.

ముహూర్తములు లేవు.

### పుష్య మాస శుక్ల పక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 03 | శుక్ర | విదియ | ప॥గం.12.50ని॥ |
| తేది. 04 | శని | తదియ | ఉ॥గం.10.30ని॥ |
| తేది. 05 | ఆది | చతుర్థి | ఉ॥గం.8.20ని॥ |
| | పిదప | పంచమి | పూర్తిగా |
| తేది. 06 | సోమ | షష్ఠి | రా॥గం.4.35ని॥ |
| తేది. 07 | మంగళ | సప్తమి | రా॥గం.3.14ని॥ |
| తేది. 08 | బుధ | అష్టమి | రా॥గం.2.17ని॥ |
| తేది. 09 | గురు | నవమి | రా॥గం.1.54ని॥ |

## తుల


చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

అనుకున్న పనులకు ఆటంకాలు కలిగినా ముందుకు కొనసాగుతాయి. అయితే టెన్షన్‌గా ఉంటుంది. అనవసర ఖర్చులు కొద్ది ఎక్కువగానే ఉంటాయి. వృత్తి వ్యాపారరంగాలలో ప్రోత్సాహము, ఆదాయం బాగుంటుంది. ఇంట కుటుంబవ్యక్తులకు అనారోగ్య బాధలుండగలవు. ఉద్యోగులకు సమర్థతతో పాటు అధికారుల ఆదరణ బాగుండును.

## వృశ్చికం


విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

క్రొత్త కాంట్రాక్టులు, కొత్త పెట్టుబడులు లభించే అవకాశామున్నది. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా జరిగిపోగలవు. ఆదాయముతో సమానంగా ఖర్చులు పెరగగలవు. అనుకున్న పనులు వాయిదా పడవచ్చు లేక ఆలస్యంగా జరగవచ్చును. ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు అవసరం. కోర్టు వ్యవహారాలు, స్థిరాస్తుల క్రయవిక్రయాలు వాయిదాపడగలవు.

## ధనుస్సు


మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

చేస్తున్న పనులందు ప్రయత్నాలు అనుకోకుండా కలిసివస్తాయి. వృత్తి వ్యాపారాలలో మంచి అభివృద్ధి కనపడి ఆదాయం పెరుగుతుంది. మీ సలహాలు సూచనలు ఇతరులకు మేలు చేస్తాయి. కొత్త వస్తువులు వాహనాలు చేకూర్చుకొంటారు. షేర్లు పెట్టుబడులందు లాభాలుంటాయి. రాజకీయ వర్గాలకు అవకాశాలు పలుకుబడి బాగుంటుంది. కుటుంబసౌఖ్యం బాగుంటుంది.

## మకరం


ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

క్రొత్త పెట్టుబడులు, పొదుపు పథకాలు లాభాలనిస్తాయి. ఆదాయ వ్యయాలు సంతృప్తి, ప్రయోజనకరంగా ఉంటాయి. బిడ్డల వల్ల చిన్నచిన్న సమస్యలుండి సర్దుబాటుకాగలవు. శుభకార్యప్రయత్నాలు నెరవేరగలవు. స్థిరాస్తుల క్రయవిక్రయాలు నిర్ణయం కాగలవు. రాజకీయ పలుకుబడి కోరే వారు మరింత ప్రయత్నాలు చేయవలసి ఉంటుంది. సత్కారాలు అందుతాయి.

## కుంభం


ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

వృత్తి వ్యాపారాల మీద శ్రద్ధ దృష్టి పెట్టండి. పనులు సక్రమంగా జరుగుతున్నా మానసికాందోళన ఎక్కువగా ఉంటుంది. ఆర్థికాభివృద్ధికి మంచి అవకాశాలు దొరకకపోవచ్చును. సొంత వ్యవహారాలలో ఇతరుల ప్రమేయం రానీయకండి. వాహన రిపేర్లు వస్తు రిపేర్లుండగలవు. వాహనాలు యంత్రాల పనులు చేసేవారు జాగ్రత్తగా ఉండాలి. గాయాలు తగలవచ్చును.

## మీనం


పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

వృత్తి వ్యాపారాలలో ఆర్థికాభివృద్ధికి మంచి అవకాశాలు దొరకడం, ఆదాయం పెరగడం ఉంటుంది. శాస్త్ర, సాంకేతిక, కళా, క్రీడారంగాలవారు మంచి ప్రతిభను కనపరచడం, గుర్తింపు పొందడం జరుగుతుంది. మీ సలహాలు సూచనలకు ఎదుటి వారి నుండి గౌరవం పొందుతారు. దైవ, సేవాకార్యాలలో, సభలు సమావేశాలలో పాల్గొంటారు.

# కాకి లెక్కలు... కాకమ్మ కబుర్లు చెప్పొద్దు

### వ్యవసాయాధికారులపై మండిపడ్డ కలెక్టర్



నెల్లూరు జిల్లాలో ఎన్ని ఎకరాల్లో వరిసాగు అవుతుందో తెలపడంలో కాకి లెక్కలు చెప్తున్నారని, కార్యాలయాల్లో కూర్చుని నివేదికలు సిద్ధం చేస్తున్నారా అని కలెక్టర్ మండిపడ్డారు. నెల్లూరులోని గోల్డెన్ జూబ్లీ హాల్లో రెవిన్యూ, ఇరిగేషన్, వ్యవసాయ, విద్యుత్‌శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. వ్యవసాయశాఖ సమర్పించిన నివేదికల్లో కావలి కెనాల్ కింద 35వేల ఎకరాలు, ఇరిగేషన్‌శాఖ సమర్పించిన నివేదికల్లో 70 వేల ఎకరాలు, సాగునీటి కమిటీ మాజీ సభ్యులు ఇచ్చిన సమాచారం ప్రకారం లక్ష ఎకరాలకు పైగా వరి పంట సాగు చేస్తున్నారన్నారు. దీంతో శాఖల మధ్య ఇంత వ్యత్యాసం ఉంటే ఎలా అని అధికారులపై కలెక్టర్ మండిపడ్డారు. నాలుగు రోజుల్లో పూర్తిస్థాయిలో సాగు లెక్కలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

కావలి కెనాల్ కింద 33, కనుపూరు కెనాల్ కింద 32 బృందాలను నియమించారని ఈ బృందాలు 24గంటలు కాలువలపై తనిఖీలు నిర్వహిస్తాయన్నారు. ఆయకట్ట కింద సాగు చేస్తున్న వరిపంట ఎండకుండా సాగునీరు సరఫరా చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. జనవరి 10 నాటికి వరినాట్లు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ పివియస్ రామకృష్ణ, జాయింట్ కలెక్టర్ బి.లక్ష్మీకాంతం, సోమశిల ప్రాజెక్టు, తెలుగుగంగ ప్రాజెక్టు ఇరిగేషన్ ఎస్ఈలు సోమశేఖర్, సుబ్బారావు, కోటేశ్వరరావు, నెల్లూరు, కావలి, ఆర్డీఓలు సుబ్రహ్మణేశ్వరరెడ్డి, వెంకటరమణారెడ్డి అధికారులు పాల్గొన్నారు.

# వ్యాయామ ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

నెల్లూరు రంగనాయకులపేటలో గల రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నివాసంలో డిసెంబర్ 29న జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం, నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.సుబ్రహ్మణ్యం, కార్యదర్శి సి. హెచ్.కృష్ణారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతి, బి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణాన్ని కాపాడుకుందాం!

### పర్యావరణ కాలుష్య నియంత్రణపై వీఎస్‌యులో అంతర్జాతీయ సదస్సు

నెల్లూరులోని విక్రమసింహపురి విశ్వ విద్యాలయంలో ఇనిస్టిట్యూట్ ఫర్ క్యాన్సర్ రీసెర్చ్ సంయుక్త నిర్వహణలో డిసెంబర్ 27 నుంచి మూడురోజుల పాట ఎన్విరాన్ మెంటల్ పొల్యూషన్, న్యూట్రిషన్ అండ్ జెనిటిక్స్ అంతర్జాతీయ సదస్సు జరిగింది. సదస్సులో పాల్గొన్న రూజ్వెల్ట్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త బల్వంత్‌సింగ్ మాట్లాడుతూ ప్రజల్లో చక్కని అవగాహన, చైతన్యం తీసుకురాగలిగితే పర్యావరణ కాలుష్యాన్ని సంపూర్ణంగా నియంత్రించవచ్చన్నారు. నారాయణ మెడికల్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మానవ జాతికి అవసరమైన సూక్ష్మ పోషకాలు లెడ్, కాడ్మియం, సెలీనియం వంటి పదార్థాలు ఆహారంలో లోపించడంతో 950రకాల రుగ్మతలకు లోనవుతున్నారన్నారు.

విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య జి.రాజారామిరెడ్డి మాట్లాడుతూ కాలుష్య నివారణకు ప్రతి వ్యక్తి స్వీయ నియంత్రణ పాటించాలని ఇటువంటి సదస్సులతో అంతర్జాతీయ పరిశోధనలకు, నూతన స్నేహబంధాలు, ఒప్పందాలకు అవకాశం ఏర్పడుతుందన్నారు. అమెరికా, జర్మనీ, మలేషియా దేశాల నుంచి వచ్చి సదస్సులో పాల్గొన్న 22మంది విద్యార్థులు పరిశోధనా పత్రాలను సమర్పించారు. సదస్సు కన్వీనర్ ఎం.శ్రీనివాసులురెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి వై.సునంద, సంయుక్త కార్యదర్శి కె.నరసింహారావు, ఆలీ, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

# పెంచలరెడ్డికి ఘనస్వాగతం

ఇటీవల వైఎస్సార్సీపీలో చేరి నెల్లూరుకు వచ్చిన మాజీ కార్పొరేటర్ సన్నపురెడ్డి పెంచలరెడ్డికి డిసెంబర్ 29న రైల్వేస్టేషన్లో ఘనస్వాగతం లభించింది. ప్రముఖ వ్యాపారస్థులు మంచికంటి శ్రీనివాసులు, తిరుమలరావు, పెసల నరసింహస్వామి, చలువాది నాగేశ్వరరావు, నిశాంత్‌రెడ్డి, సభ్యులు నరసింహయాదవ్, ఖాదర్‌బాషా, హేమంత్, విజయ్, సుధీర్ ఆయనకు అభినందన పూర్వక స్వాగతం పలికారు.

# లంచాల అయ్యోర్లపై వేటు

విద్యార్థులను మభ్యపెట్టి పాస్‌చేయిస్తానని చెప్పి వారి నుంచి డబ్బు వసూలు చేసిన నెల్లూరుజిల్లా వాకాడు ఐటిఐ ప్రిన్సిపల్ కరీముల్లాతో పాటు ఉపశిక్షణాధికారి శైలజ, కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు రవి, కిరణ్‌లను రాష్ట్ర ఉపాధి కల్పనశాఖ అధికారులు సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీచేసారు. గత అక్టోబర్‌లో ప్రిన్సిపల్, ఉపశిక్షణాధికారి, కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు విద్యార్థుల నుంచి దాదాపు 2.80లక్షలు వసూళ్ళుచేసారు. ఈ విషయమై విద్యార్థులు నెల్లూరు ఏసిబి అధికారులకు సమాచారమిచ్చారు. ఏసీబీ అధికారుల దాడిలో ప్రిన్సిపల్‌తో పాటు మరో ముగ్గురు పట్టుబడ్డారు. వీరి నుంచి ఏసీబీ అధికారులు 2.80లక్షలు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో నిందితులని తేలడంతో సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

# గిరిజనుల అభివృద్ధికి బిజేపి కృషి

గిరిజనుల అభివృద్ధికి భారతీయ జనతాపార్టీ విశేష కృషి చేస్తుందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నపురెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు మినీబైపాస్ రోడ్డులోని బీజేపీ కార్యాలయంలో గత నెల 28వ తేదీ ఎస్టీ మోర్చా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఎక్కువ మంది గిరిజన ఎమ్మెల్యేలు ఉన్నపార్టీ తమదేనన్నారు.

మొట్టమొదటగా ఎస్టీ మంత్రిత్వశాఖను బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి.సురేంద్రరెడ్డి మాట్లాడుతూ సమాజంలో ఎస్టీలు ఎక్కువ మంది దారిద్ర్యరేఖకు దిగువున జీవిస్తున్నారన్నారు. రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి మాట్లాడుతూ దేశంలో పురాతన భారతీయ సనాతన ధర్మాన్ని కాపాడేది ఎస్సీ, ఎస్టీలేనన్నారు. అనంతరం బీజేపీ ఎస్టీమోర్చా నూతన కమిటీని నియమించారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు మండ్ల ఈశ్వరయ్య, ప్రధాన కార్యదర్శి రాజేష్, యువ మోర్చా అధ్యక్షుడు మొగరాల సురేష్, ఎస్టీ మోర్చా నగర అధ్యక్షుడు కె.వెంకటరమణ, మహిళ మోర్చా అధ్యక్షురాలు ఎ.శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.



డిఆర్‌డబ్ల్యూ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేసి ఇటీవల పదవీవిరమణ చేసిన శ్రీమతి పి.యస్.రాజ్యలక్ష్మి - రామ్మోహన్‌రావు దంపతులను సన్మానిస్తున్న కాలేజీ సెక్రటరీ, కరస్పాండెంట్ డా॥ సి.ఆర్.రెడ్డి మరియు ప్రిన్సిపాల్ తదితరులు.

# డిపాజిట్ల సేకరణలో ముందడుగు



ఎన్‌డిసిసిబి ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి

డిపాజిట్ల సేకరణలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఓ ముందడుగు వేసిందని ఆ బ్యాంకు ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయ రెడ్డి వెల్లడించారు. 2014 నూతనసంవత్సరంలో బ్యాంకు మరింత పురోగతి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేసారు. 2014 నూతన సంవత్సరం సందర్భంగా ఈ నెల 1వ తేదీన ఆయన దీనికి సంబంధించిన వివరాలను 'లాయర్'కు వెల్లడించారు. 2013 సంవత్సరం నవంబర్, డిసెంబర్ రెండు నెలల్లోనే బ్యాంకు తరపున 8కోట్ల రూపాయల డిపాజిట్లు సేకరించడం జరిగిందని, బ్యాంకు చరిత్రలోనే ఇదొక రికార్డుగా పేర్కొన్నారు. బ్యాంకుకు ఎంత ఎక్కువగా డిపాజిట్లు వస్తే అంతకంటే ఎక్కువగా ఋణాలు మంజూరు చేసేందుకు అవకాశముంటుందని ఆయన చెప్పారు. ఇటీవల సహకార బ్యాంకు సిబ్బందికి పలు రకాలుగా ప్రోత్సాహ కాలు ప్రకటించామని, ఆ ప్రయత్నం సత్ఫలితాలనిచ్చిందనేందుకు ఈ డిపాజిట్లే ఉదాహరణగా ఆయన పేర్కొన్నారు. బ్యాంకును 500కోట్ల టర్నోవర్‌కు చేరువ చేయడమే తన లక్ష్యమని, ఈ టర్నో వర్ సాధిస్తే బ్యాంకుకు వివిధ సంస్థలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి నిధులు అందే అవకాశ ముందని, తద్వారా జిల్లా రైతాం గానికి ప్రయోజనం చేకూర్చవచ్చునని చెప్పారు. బ్యాంకు ద్వారా రైతులకే కాక చేనేత కార్మికులను ఆదుకునేందుకు వారికి కూడా ఋణాలు మంజూరు చేసినట్లు చెప్పారు. రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, జిల్లా ప్రజాప్రతినిధుల సహకారంతో బ్యాంకును అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని ఆయన తెలిపారు.

# మాగుంట కాదంటే.. బీదనే!





**ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి తెలుగుదేశంలో చేరితే ఆయనను నెల్లూరు లోక్ సభ స్థానం నుండి పోటీ చేయించాలని ఆ పార్టీ అధిష్టానం వ్యూహం.**


ఒంగోలు టీడీపీ అభ్యర్థిగా ప్రస్తుతం నర్సారావుపేట ఎంపీగా వున్న మోదుగుల వేణుగోపాలరెడ్డిని ఖరారు చేసే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో మాగుంట శ్రీనివాసులురెడ్డి నెల్లూరు నుండి దిగాల్సివస్తుంది. ఏ పరిస్థితుల్లో అయినా మాగుంట శ్రీనివాసులురెడ్డి నెల్లూరుకు రావడానికి ఇష్టపడకపోతే ఆయనకు ప్రత్యామ్నాయంగా కావలి ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావును రంగంలోకి దించాలని చూస్తున్నారు.

పార్లమెంటు బరిలో దిగడానికి బీద సుముఖత వ్యక్తం చేసారని సమాచారం. బీజేపీతో పొత్తు కుదిరితే పార్లమెంట్‌కు పోటీ చేయడమే బెటర్ అనే ఆలోచనలో మస్తాన్‌రావు వున్నట్లు తెలుస్తుంది. అయితే పార్లమెంట్‌కు పోటీ చేయడానికి ఆయన కొన్ని కండీషన్స్ పెట్టినట్లు సమాచారం. కందుకూరు అభ్యర్థిగా దామంచర్ల జనార్ధన్‌ను పెట్టాలని కోరుతున్నట్లు తెలుస్తుంది. ప్రస్తుతం అక్కడ దివి శివరాం రంగంలో వున్నారు. అయితే ఆర్థికంగా దామంచర్ల జనార్ధన్ గట్టి వాడు కావడంతో ఆయనను నిలబెట్టాలని అడుగుతున్నాడు. తాను కావలిని వదిలిపోతే ఆ సీటు నుండి ఆదాల ప్రభాకర్‌రెడ్డి లేదా బీద రవిచంద్ర, అలాగే నెల్లూరురూరల్ నుండి సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డిలను అభ్యర్థులుగా పెట్టాలని కోరుతున్నట్లు సమాచారం. సోమిరెడ్డి తన పార్లమెంట్ పరిధిలోకే వస్తే గట్టి అభ్యర్థి అవుతాడని, 7 అసెంబ్లీ సెగ్మెంట్లలో మంచి అభ్యర్థులను నిలబెట్టుకుంటే ఆర్థికంగా భారం తగ్గడంతో పాటు వారి మూలంగా ఓట్లు పెరుగుతాయని మస్తాన్‌రావు ధీమా!

## సమైక్యాంధ్ర ఉద్యమ ఘట్టాల క్యాలెండర్ ఆవిష్కరణ

సమైక్యాంధ్ర ఉద్యమంలో చేపట్టిన ఉద్యమ ఘట్టాలతో కూడిన క్యాలెండర్‌ను బుధవారం నీటి పారుదలశాఖ పర్య వేక్షక ఇంజినీరు వి.కోటేశ్వరరావు విడు దల చేసారు. నెల్లూరు హరనాథపురం సెంటరులోని నీటి పారుదలశాఖ కార్యా లయంలో నీటి పారుదలశాఖ ఉద్యోగుల సంక్షేమ సంఘం 2014 క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ ఈ క్యాలెండర్ ఇరిగేషన్ ఉద్యోగులకు ఎంతగానో ఉప యోగపడుతుందని, ప్రతిఒక్కరూ ఈ క్యాలెం డర్‌ను తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్ర మంలో ఇఇలు, డిఇలు, అధికారులు, ఉద్యోగులు, సంఘ సభ్యులు, ఆర్.విశ్వ నాథం, జగన్, షంషాద్ అమిత్, కెఎస్ఎన్ రాజు, నాల్గవ తరగతి ఉద్యోగులు, వర్క్‌ఛార్జ్‌డ్ అసోసి యేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# డాక్టర్ వెంకటేష్‌కు సత్కారం




కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నెల్లూరు టౌన్‌హాలులో డిసెంబర్ నెల 30వతేదీ సోమవారం ప్రముఖ వైద్యనిపుణులు డాక్టర్ వెంకటేష్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ పి.యశోధర వ్యవహరించారు. డాక్టర్ తనూజ జ్యోతిప్రకాశం గావించారు.

ఈ సందర్భంగా శ్రీసాయి రాగాంజలి ఆర్కెస్ట్రా వారిచే సంగీతవిభావరి జరిగింది. రిటైర్డ్ ఇంజినీర్ కొమ్మున సీతారామస్వామి ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. సంస్థ అధ్యక్షులు కేతా సుబ్బారావు పాల్గొన్నారు.


శుభాకాంక్షలు

పంచాయితీరాజ్ ఇంజనీరింగ్ అధికారులకు,
ఇంజనీర్లకు మరియు లయన్స్‌క్లబ్ మెంబర్లకు,
స్వచ్ఛంధ సేవాసంస్థ ప్రతినిధులకు, శ్రేయోభిలాషులకు

2014 నూతన సంవత్సర
మరియు సంక్రాంతి శుభాకాంక్షలు

షేక్ రియాజ్ అహ్మాద్
అధ్యక్షులు, రాష్ట్ర పంచాయితీరాజ్
డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్, హైదరాబాద్.





గూడూరుప్రాంత ప్రజలకు, మిత్రులకు, మా శ్రేయోభిలాషులకు
2014 నూతన సంవత్సర
మరియు సంక్రాంతి శుభాకాంక్షలు.



డా॥ జి.మైథిలి
యం.బి.బి.యస్. యం.డి., డి.జి.ఓ., ఎఫ్.ఎ.జి.ఇ
కాన్పులు, గర్భకోశవ్యాధుల నిపుణులు

MYTHILI MATERNITY & FERTILITY CENTRE GUDUR

మైథిలి హాస్పిటల్
కూరగాయల మార్కెట్ దగ్గర, ఐ.సి.యస్.రోడ్డు, గూడూరు.
ఫోన్. 08624 - 253896.



మా ఖాతాదారులకు, మిత్రులకు,
శ్రేయోభిలాషులకు, గూడూరుప్రాంత ప్రజానీకానికి
2014 నూతన సంవత్సర
మరియు సంక్రాంతి శుభాకాంక్షలు.

మయూరి శ్యాం యాదవ్, ప్రొప్రైటర్

మయూరి స్వీట్స్
హాస్పిటల్‌రోడ్డు,
గూడూరు - 524 101.

మా బ్రాంచ్‌లు: ఎన్.టి.ఆర్. కాంప్లెక్స్, సంగం థియేటర్ ప్రక్కన, గూడూరు.
పి.ఎం.ఆర్. ట్రేడ్ కాంప్లెక్స్, రమేష్‌రెడ్డినగర్, నెల్లూరు.





మిత్రులకు, శ్రేయోభిలాషులకు
2014 నూతన సంవత్సర
మరియు సంక్రాంతి శుభాకాంక్షలు.

SEGU RAMESH
Ex-President,
THE GUDUR PAWNBROWKERS ASSOCIATION



జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ గారికి, జాయింట్ కలెక్టర్ బి.లక్ష్మీకాంతం గారికి
డిఆర్‌ఓ రామిరెడ్డి గారికి, గూడూరు ఆర్డీవో ఎన్.మధుసూధన్‌రావు గారికి
తహశీల్దార్లకు మరియు రెవెన్యూసిబ్బందికి
2014 నూతన సంవత్సర
మరియు సంక్రాంతి శుభాకాంక్షలు.





కురిచర్లపాటి వెంకటేశ్వరరావు
డివిజన్ అధ్యక్షులు

గ్రిద్దలూరు రమణయ్య, బి.ఎ.
డివిజన్ ప్రధానకార్యదర్శి

గూడూరుడివిజన్ గ్రామ రెవెన్యూఅధికారులసంఘం



పి.ఆర్. క్లబ్ సభ్యులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు,గూడూరుప్రాంత ప్రజానీకానికి
2014 నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు.



గూడూరు శశిధర్‌రెడ్డి
ప్రెసిడెంట్

ఎల్లసిరి శ్రీనివాసులరెడ్డి
సెక్రటరి

ఆర్.బాలరాజు, ట్రెజరర్

--- కమిటీ మెంబర్లు ---

వై.గోపాలరెడ్డి
వై.జనార్ధన్‌రెడ్డి
కె.శ్రీనివాసులురెడ్డి
ఎన్.ఉమాశంకర్
పి.లక్ష్మీనారాయణ
కె.జనార్ధన్‌నాయుడు
జి.రామసుబ్బారెడ్డి
ఎం.రవీంద్రరెడ్డి
బి.పెంచలయ్య
ఎం.అమర్‌నాథ్‌రెడ్డి



P.R. CLUB - GUDUR



# గూడూరు డివిజన్ వార్తలు

## డిఎస్పీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఎస్పీ


డిఎస్పీ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ రామకృష్ణ

గూడూరులోని డిఎస్పీ కార్యాలయాన్ని సోమవారం జిల్లా ఎస్పీ రామకృష్ణ తనిఖీ చేశారు. జిల్లాలో నేరాల అదుపుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు డివిజన్ పరిధి లోని అన్ని సర్కిళ్ల సి.ఐలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సిఐలతో మాట్లాడుతూ ఆయా సర్కిళ్ల పరిధిలో పెండింగులో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రాత్రిపూట గస్తీని ముమ్మరంచేయాలని సూచించారు. ఆయన వెంట గూడూరు డిఎస్పీ కె.చౌడేశ్వరి ఉన్నారు.

## కనీస వేతనాలు ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న చైతన్య

జిల్లాలోని వెంకటాచలం, బూదనం, సూళ్ళూరుపేట ప్రాంతాల్లో ఉన్న స్వర్ణాటోల్ ప్లాజాల్లో పనిచేస్తున్న సిబ్బందికి కనీస వేతనాలు ఇవ్వాలని ఆ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎన్జీవో హోంలో ఆదివారం సంఘ నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాలేపాటి చైతన్య మాట్లాడుతూ చట్టపరంగా సిబ్బందికి రావాల్సిన వేతన బకాయిలను చెల్లించాలన్నారు. సిబ్బంది సమస్యలపై కార్మికశాఖ అధికారులకు వినతిపత్రం సమర్పించినందుకు సంఘ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులను సంస్థ యాజమాన్యం సస్పెండ్ చేసిందన్నారు. ఆయన్ని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు శ్రీనివాసులు, ఓంకారం, మురళీధర్, చల్లా శ్రీనివాసులు, పెంచలయ్య, సుబ్బారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

### తూర్పు కనుపూరులో...

## ముత్యాలమ్మ క్యాలెండర్ల ఆవిష్కరణ

చిల్లకూరు మండలంలోని తూర్పు కనుపూరులో వెలసియున్న ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ముద్రించిన క్యాలెండర్లను ఆలయ ఈవో తాతా శ్రీనివాసరావు ఆదివారం ఆవిష్కరించారు. అంతకు ముందు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని 1వ తేదీ ఆలయంలో అమ్మవారికి శాస్త్రోక్తంగా అభిషేకాలు, పూజలు, కుంకుమార్చన నిర్వహించారు. కొత్త సంవత్సరం సందర్భంగా వేలాదిమంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

## నెల్‌క్యాస్ట్ స్టాఫ్ చిల్డ్రన్‌కు మెరిట్ అవార్డు


బహుమతిని అందుకొంటున్న వి.యువరాజ్

గూడూరు నెల్‌క్యాస్ట్ స్టాఫ్ వెల్‌ఫేర్ అసోసియేషన్ స్టాఫ్ చిల్డ్రన్‌కు సోమవారంనాడు నెల్‌క్యాస్ట్ కంపెనీ ఆవరణంలో ఎల్‌కెజీ నుండి పదవ తరగతి వరకు మెరిట్ వచ్చిన విద్యార్థులకు బహుమతి ప్రదాన కార్యక్రమం జరిగింది. ఈ సభకు రిటైర్డ్ ఎపిఎస్‌పిడిసియల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ మరియు నెల్‌క్యాస్ట్ కంపెనీ శ్రేయోభిలాషి అయిన కె.సుందరరామిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో నెల్‌క్యాస్ట్ స్టాఫ్ వెల్‌ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు దువ్వూరు రవీంద్రనాథ్‌రెడ్డి, సెక్రెటరీ బి.వెంకటరావు, ట్రెజరర్ ఆనిమెళ్ళ శివకుమార్ మరియు అసోసియేషన్ సభ్యులు విద్యార్థులు పాల్గొన్నారు.

## అడ్డంకిగా ఉన్న ఆక్రమణల తొలగింపు చేపట్టాలి

రోడ్లు భవనాలశాఖలోని రోడ్ల నిర్మాణలతో పాటు ఫ్లైఓవర్ వంతెన త్వరతగతిన పూర్తిచేసేందుకు ఆక్రమణలు అడ్డంకిగా ఉన్నాయని ఆ శాఖ అధికారులు సోమవారం ఆర్డీవో మధుసూదనరావుకు వివరించారు. గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఈ మేరకు రోడ్లు భవనాల డి.ఇ. రామారావు, ఎ.ఇ.చంద్రశేఖరరెడ్డి, పురపాలకసంఘ కమీషనర్ సుశీలమ్మ సమావేశమై పలువిషయాలను చర్చించారు. పోటుపాళెం కూడలిలో జాతీయ రహదారి నుంచి సంగం థియేటర్ వరకు నాలుగులైన్ల సిమెంటు రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉందని, ఆక్రమణల కారణంగా పనులకు ఆటంకం ఏర్పడుతుందన్నారు.

రోడ్లు భవనాల స్థలాలను సర్వే చేసేందుకు రెవెన్యూ సిబ్బందిని కేటాయించి హద్దులు నిర్ణయించాలని కోరారు. ఆర్డీవో స్పందించి ఆక్రమణల తొలగింపుకు కృషిచేస్తామని వారికి హామీ ఇచ్చారు.

## సమస్యలను పరిష్కరించండి

గ్రీవెన్స్‌డేలో అర్జీల రూపంలో వచ్చే సమస్యలను త్వరతగతిన పరిష్కరింఛాలని తహశీల్దార్ మైత్రేయ రెవెన్యూ సిబ్బందికి సూచించారు. గూడూరు తహశీల్దార్ కార్యాలయంలో సోమవారంనాడు ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు.

ఈ సందర్భంగా పాలిచర్లరాజుపాళెం గ్రామస్తులు దళితవాడకు చెందిన శ్మశానానికి వెళ్లేందుకు దారి చూపాలని కోరారు. చెన్నూరు, వెందోడు, కాంద్ర, గొల్లపల్లి, కుందకూరు, విందూరు, మిట్టాత్మకూరు తదితర గ్రామాల నుంచి పలువురు అర్జీదారులు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అర్జీలిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ నిర్మలాదేవి పాల్గొన్నారు.

## వైకాపా బలోపేతానికి సమిష్టిగా కృషి చేయాలి


క్షేత్రస్థాయిలో పార్టీబలోపేతానికి సమిష్టిగా కృషిచేయాలని వైకాపా నాయకులు ఎల్లసిరి గోపాలరెడ్డి, పాశం సునీల్‌కుమార్ కార్యకర్తలను కోరారు. పట్టణంలోని రోడ్డు భవనాలశాఖ అతిథిగృహంలో ఆదివారం పలువురు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని బలోపేతం చేసి రానున్న ఎన్నికల్లో విజయం సాధించేందుకు శ్రమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నాశిన నాగులు, పార్టీ నాయకులు రాజారెడ్డి, శివకుమార్, ప్రభాకరరెడ్డి, విజయ్, శ్రీనివాసులురెడ్డి, శ్రీవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నెల్లూరు డివిజన్ ఎల్ఐసి అధికారులకు, గూడూరు బ్రాంచి మేనేజర్ మరియు స్టాఫ్‌కు, డెవలప్‌మెంట్ ఆఫీసర్లకు, ఏజంటుమిత్రులకు, పాలసీదారులకు, పట్టణశ్రేయోభిలాషులకు మరియు లయన్ మిత్రులకు
LIC
भारतीय जीवन बीमा निगम
LIFE INSURANCE CORPORATION OF INDIA
2014 నూతనసంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు.
మీ అందరి జీవితాలలో సంక్రాంతి వెలుగులు నింపాలని కోరుతూ
మీ...
Ln. మల్లెమాల మురళీరెడ్డి
Ex-Disctrict Chairman(Insurance)
LIC Development Officer, Gudur Branch.





గూడూరు డివిజన్‌లోని 16మండలాల ప్రజలకు
2014 నూతన సంవత్సర
మరియు
సంక్రాంతి శుభాకాంక్షలు


సంక్రాంతి బుజ్జయ్యయాదవ్
అధ్యక్షులు
గూడూరుడివిజన్ బిసి సంక్షేమసంఘం



మా ఖాతాదారులకు, మిత్రులకు,
శ్రేయోభిలాషులకు, గూడూరుప్రాంత ప్రజానీకానికి
2014 నూతన సంవత్సర
మరియు
సంక్రాంతి శుభాకాంక్షలు.
వల్లంకొండ వెంకటసుబ్బయ్య
అధ్యక్షులు, చిల్లీస్ కమీషన్ మర్చెంట్స్ అసోసియేషన్
గూడూరు



మా క్లయింట్లకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు,
గూడూరుప్రాంత ప్రజానీకానికి
2014 నూతన సంవత్సర
మరియు
సంక్రాంతి శుభాకాంక్షలు.
S. RAMA MOHAN RAO,
B.Com., FCA
S.V. Ratnam & Co.,
Chartered Accountants
13/160, Thyagaraja Street, Gudur - 524 101,
Nellore Dist., A.P. Tel: 08624 - 52143.





మా ఖాతాదారులకు, మిత్రులకు,
శ్రేయోభిలాషులకు,
గూడూరుప్రాంత ప్రజానీకానికి
2014 నూతన సంవత్సర
మరియు
సంక్రాంతి శుభాకాంక్షలు
అట్ల శీనయ్య యాదవ్
ప్రొప్రైటర్
శ్రీ లక్ష్మీ శ్రీనివాస పాన్‌బ్రోకర్స్
& దిలీప్ హైరర్స్
1/573-1, మాళవ్యనగర్, గూడూరు, నెల్లూరు జిల్లా.







జిల్లా ప్రజలకు,
వై.యస్.ఆర్.కాంగ్రెస్‌పార్టీ నాయకులకు,
కార్యకర్తలకు, అభిమానులకు
2014 నూతన సంవత్సర
మరియు
సంక్రాంతి శుభాకాంక్షలు







బత్తిని విజయకుమార్
వై.యస్.ఆర్. కాంగ్రెస్ నాయకులు, గూడూరు
బత్తిని శ్రీహర్ష అనురాగ్‌కుమార్
గూడూరు

# సహకారం కొనసాగేనా?

## ఆత్మకూరులో కాంగ్రెస్‌కు ఉదయగిరిలో 'దేశం'కు






జగనే లక్ష్యంగా, వైకాపాను ఓడించడమే ధ్యేయంగా పెట్టుకుని కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు ఇంతకాలం మ్యాచ్ ఫిక్సింగ్‌లకు పాల్పడుతూ వచ్చాయి. ఈ ఏడాది జరిగిన సహకార ఎన్నికలలోనూ, ఆ తర్వాత పంచాయితీ ఎన్నికలలోనూ గ్రామస్థాయిలో ఈ రెండు పార్టీలు కలిసి పనిచేసాయి. కలిసే కంబైన్డ్‌గా అభ్యర్థులను నిలబెట్టాయి. జిల్లాలో సహకార, పంచాయితీ ఎన్నికలలో ఈ రెండు పార్టీల మధ్య స్నేహసంబంధాలు బలంగా వర్ధిల్లాయి. అదే సహకారం రేపు శాసనసభ ఎన్నికల్లోనూ కొనసాగుతుందా? అంటే పూర్తిగా ఉండదు. ఎందుకంటే అధికారానికి మార్గం ఈ ఎన్నికలే! కాబట్టి సహకార, పంచాయితీ ఎన్నికల్లో లాగా అసెంబ్లీ ఎన్నికల్లో మ్యాచ్ ఫిక్సింగ్ కుదరదు.

అయితే జిల్లాలోని 10సీట్లలో కాకపోయినా రెండు నియోజకవర్గాల్లో మాత్రం మ్యాచ్ ఫిక్సింగ్‌కు బలంగా అవకాశాలున్నాయి. ఈ రెండు నియోజకవర్గాలే ఆత్మకూరు, ఉదయగిరి. ఆత్మకూరు నుండి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కొమ్మి లక్ష్మయ్యనాయుడు వైకాపాలో చేరాక ఇక్కడ తెలుగుదేశం కేడర్ బాగా బలహీనపడింది. ఈ పార్టీలో ఉన్న నాయకులు చాలా వరకు కాంగ్రెస్, వైయస్సార్ కాంగ్రెస్‌లలోకి వెళ్లిపోయారు. ఈ ఐదేళ్లలో తెలుగుదేశం కేడర్ చాలావరకు ఆనం రామనారాయణరెడ్డి వెనుకే నడిచింది. కరటంపాడుకు చెందిన గూటూరు కన్నబాబు ఆత్మకూరు ఇన్‌ఛార్జ్‌గా వున్నప్పటికీ పార్టీని పటిష్టం చేయడానికి ఆయన శక్తి చాలడం లేదు. తెలుగుదేశంకు ఇక్కడ గట్టి నాయకుడు ఎవరూ లేరు. తెలుగుదేశం నుండి ఎవరినైనా సరే డమ్మీనే నిలబెట్టాలి. ప్రధాన పోటీ ఆనం రామనారాయణరెడ్డి, మేకపాటి గౌతంరెడ్డిల మధ్యే ఉంటుంది. తెలుగుదేశం శ్రేణులు ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థికి సహకరించే అవకాశాలున్నాయి. మొన్న పంచాయితీ, సహకార ఎన్నికలలో జరిగింది ఇదే!

ఆత్మకూరులో తెలుగుదేశంకు నాయకత్వం కొరతగా ఉంటే, ఉదయగిరిలో కాంగ్రెస్‌కు నాయకుడు లేకుండా పోయాడు. ఆత్మకూరులో కాంగ్రెస్‌కు తెలుగుదేశం సహకరిస్తే, ఉదయగిరిలో తెలుగుదేశంకు కాంగ్రెస్ సహకరించేలా మ్యాచ్‌ఫిక్సింగ్‌కు అవకాశముంది. ఎందుకంటే ఉదయగిరి నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయడానికి ఎవరూ ముందుకు రాకపోవచ్చు. మొన్నటి ఉపఎన్నికలలో పోటీ చేసిన కంభం విజయరామిరెడ్డి కాంగ్రెస్‌లోనే ఉంటాడా... తిరిగి తెలుగుదేశంలోకి పోతాడా అనేది సందేహమే. మాజీమంత్రి మాదాల జానకిరాంకు పోటీపై ఆసక్తి లేదు. అదీగాక తెలుగుదేశం అభ్యర్థి బొల్లినేని రామారావుపై పోటీకి దిగడు. ఈ నేపథ్యంలో ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థిగా డమ్మీనే నిలబెట్టాలి. అప్పుడు ప్రధాన పోటీ వైకాపా, తెలుగుదేశంల మధ్యే ఉంటుంది. ఈ సమయంలో కాంగ్రెస్‌వాళ్లు తెలుగుదేశంకే సహకరించవచ్చు. ఈ కోణంలో చూస్తే ఈ రెండు చోట్లా మ్యాచ్ ఫిక్సింగ్‌కు అవకాశాలు ఎక్కువుగా ఉన్నాయి.

## చిల్లకూరు గోపిరెడ్డికి పోలీస్ ప్రశంసా అవార్డు



ప్రవాసాంధ్రుడు, నెల్లూరు జిల్లా నాయుడుపేట వాసి చిల్లకూరు గోపిరెడ్డికి ప్రతిష్టాత్మకమైన పోలీస్ ప్రశంసా అవార్డు లభించింది. అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా పోలీస్ శాఖ నిర్వహించే 'సురక్ష' పత్రికలో చిల్లకూరు గోపిరెడ్డి వ్రాసిన 'మేమే పోలీసులం' అనే కవిత ప్రచురితమైంది. ఈ కవితలో పోలీసు జీవితాన్ని ఆయన కళ్ళకు కట్టారు. పోలీసులు పడే బాధలు, కుటుంబసభ్యులతో గడపలేని వేదనను, పనిఒత్తిడితో పడే మానసిక వేదనను అక్షరరూపంలో ఎంతో విపులంగా వివరించారు. ఈ కవిత పోలీసు శాఖలో అందర్నీ ఆకట్టుకుంది. రాష్ట్ర పోలీసు శాఖనే ఎంతగానో అలరించిన ఈ కవితను ఉత్తమ కవితగా ఎంపిక చేసి ఈ నెల 1వ తేదీ హైదరాబాద్‌లోని పోలీస్ స్టేడియంలో ఏర్పాటు చేసిన అవార్డుల అభినందన కార్యక్రమంలో రాష్ట్ర డిజిపి ప్రసాదరావు గోపిరెడ్డి స్థానికంగా లేనందున ఆయన తరపున వాళ్ళ సోదరుడు మోహన్‌రెడ్డికి ఈ అవార్డును అందజేసారు. చిల్లకూరు గోపిరెడ్డికి 'లాయర్' అభినందనలు.







## తృతీయ వర్ధంతి

పూజ్యులు, మా ఇంటిదైవం
మా పురోభివృద్ధికి ముఖ్యకారకులు, "మిత్రబంధు"

### శ్రీ నారపరెడ్డి కోదండరామరెడ్డి, M.A. గారు

(మైపాడు వాస్తవ్యులు)
స్వర్గస్థులై తేది 05-01-2014 నాటికి
మూడు సంవత్సరాలు నిండనున్న సందర్భంగా
ఆయన దివ్యస్మృతిని స్మరించుకుంటూ
వారి పవిత్రాత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ...

**శ్రీమతి నారపరెడ్డి సులోచనమ్మ** - భార్య

కుమారులు - కోడళ్ళు

**డాక్టర్. ఎన్.విష్ణుస్వరూప్‌రెడ్డి** - **డాక్టర్. శాంతి**
ఇ.ఎన్.టి. & ఫేషియల్ ప్లాస్టిక్ సర్జన్, కేర్ హాస్పిటల్, బంజారాహిల్స్, హైద్రాబాద్. - ఒబేస్టెట్రిషియన్ & గైనకాలజిస్ట్ అపోలో హాస్పిటల్, జూబ్లీహిల్స్, హైద్రాబాద్.

**ఎన్.వినోద్‌రెడ్డి** - **శాలిని**
ఛైర్మన్ & ఎం.డి., సిఆర్‌ఎంఐటి గ్రూప్, బెంగుళూరు. - డైరెక్టర్, సిఆర్‌ఎంఐటి గ్రూప్, బెంగుళూరు.

కుమార్తెలు - అల్లుళ్ళు

**జి.సుప్రియ** - **జి.విజయసింహారెడ్డి**
డైరెక్టర్, ఫార్చ్యూన్ ఇండియా బిల్డర్స్, బెంగుళూరు.

**ఎన్.పద్మప్రియ** - **ఎన్.చంద్రారెడ్డి**
ఛైర్మన్ & ఎం.డి., ఫార్చ్యూన్ ఇండియా బిల్డర్స్, బెంగుళూరు.

మనుమలు, మనుమరాండ్రు
**జి.అభిషేక్‌రెడ్డి**, సిఆర్‌ఎంఐటి (డైరెక్టర్, ఆస్ట్రేలియా), **వైష్ణవి**
**జి.అనుదీప్, రాహిల్, రుషిల్ సాకేత్, విశాల్, మేఘన, హర్ష, సంజన, వినూష**

Edited, Published, Printed & owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**.